

'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 320

శనివారం 10-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

చీకూ చింతా లేకుండా జీవిస్తున్నా..



గోడలకు రంగులు వేయడం నా వృత్తి. నాకు ఇద్దరు అమ్మాయిలు. వారిద్దరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. శ్రీకాకుళం సమీపంలోని కాజీపేటకు చెందిన నాది దినసరి కూలీ బతుకు. రెక్కాడితేగానీ డొక్కాడదు. ఉన్నదాంట్లో ఎలాగోలా నెట్టుకొస్తున్న తరుణంలో నా భార్యకు ఊపిరితిత్తుల వ్యాధి సోకింది. ఆమెకు చికిత్స చేయించేందుకు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్చాను. ఆమెకు సహాయంగా నేనూ ఆస్పత్రిలోనే ఉండేవాడ్ని. ఇంతలో డిసెంబర్ 28వ తేదీన ఒక్కసారిగా గుండె నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రిలో వైద్యులు నన్ను పరీక్షించి స్ట్రోక్ వచ్చిందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉండడంతో సమీపంలోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆపరేషన్ చేస్తుండగానే మరోసారి స్ట్రోక్ వచ్చింది. అయినా ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చయింది. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించింది. విశ్రాంతి సమయంలో ఆసరాగా రూ.10 వేల వరకు డబ్బులు జమ చేశారు. నా భార్య కన్ను మూసింది. ఒంటరిగానే ఉంటున్న నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. రేషన్‌కార్డు ఉండటంతో బియ్యం, పప్పు ఉచితంగా వస్తున్నాయి. ఇంకా నెలనెలా అవసరమైన మందులు మా ఊరికే తెచ్చి ఇస్తున్నారు. ఇప్పుడు నాకు ఏ చింతా లేదు.

– సాధు మల్లేసు, కాజీపేట
(బలివాడ శివప్రసాద్, విలేకరి, అరసవల్లి)

అద్దె భారం తప్పింది



మా ఆయన వెంకట నూక శివ అప్పారావు పెయింటింగ్ పని చేస్తుంటాడు. ఆయన సంపాదనతోనే కుటుంబం మొత్తం గడవాలి. పనులు ఉంటేనే ఆదాయం. లేదంటే అప్పులతోనే జీవనం. అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వాడ్రాపల్లిలో ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లోనే కాపురం చేస్తున్నాం. ఒక్కో నెల ఆదాయం ఉండేది కాదు. అలాంటి సమయంలో అప్పు చేసి అద్దె చెల్లించాల్సి వచ్చేది. గత ప్రభుత్వ హయాంలో పలు మార్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసినా ఫలితం లేక పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి పట్టా మంజూరు చేయాలని సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్నాం. వెంటనే స్థలంతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.లక్షా 80 వేలు సాయం అందించారు. దీంతో సొంతిల్లు నిర్మించుకొని గృహ ప్రవేశం చేశాం. అద్దె బాధ తప్పడంతో సంతోషంగా కుటుంబ పోషణ సాగుతోంది. మాకు ఇద్దరు సంతానం. మా బాబుకు అమ్మ ఒడి పథకం ద్వారా మూడు సంవత్సరాలుగా రూ.45 వేలు అందింది. మా మామ మల్లేశ్వరరావుకు వృద్ధాప్య పింఛన్ ప్రతి నెలా ఒకటో తేదీనే అందుతోంది. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నాం.

– కొయిలాడ ఇందు, వాడ్రాపల్లి
(వెలగా జగదీష్ కుమార్, విలేకరి, మునగపాక)

ఉన్న ఊళ్లోనే ఉపాధి దొరికింది



మాది పేద కుటుంబం. నేను బీఎస్సీ, నా భర్త శ్రీనివాసరావు ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేశాం. ఇద్దరం నిరుద్యోగులం. నా ఇద్దరు కుమారులు ప్రభుత్వ బడిలో చదువుతున్నారు. విజయనగరం జిల్లా వంగర మండలం కొప్పర గ్రామానికి చెందిన మాకు ఇక్కడ బతుకు తెరువు లేకపోవడంతో వలస వెళ్లిపోవాలని అనుకున్నాం. ఇంతలో ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఆ తర్వాత మా కుటుంబ జీవన స్థితిగతుల్లో మార్పు వచ్చింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.30 వేలు వచ్చింది. వెలుగు శాఖ ద్వారా స్త్రీనిధి రుణం రూ.2 లక్షలు, సీఐఎఫ్ రుణం రూ.1.50 లక్షలు, పీఎంఎఫ్ఎంఈ కింద రూ.6.90 లక్షలు తీసుకుని దాంతో మాప్‌స్టిక్స్(తుడుపు కర్రలు) యూనిట్ నెలకొల్పాం. అనంతరం మినప గుళ్ల తయారీ యంత్ర పరికర యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. నా భర్త శ్రీనివాసరావు సహాయంతో రెండు రకాల యూనిట్ల ద్వారా వ్యాపారం సాగిస్తున్నాం. నెలకు రూ.30 వేల వరకు సంపాదించుకొని నిరుద్యోగాన్ని పారదోలాం. అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. మా అమ్మమ్మ వరహాలమ్మకు వైఎస్సార్ పింఛన్ కానుక వర్తిస్తోంది. ఇప్పుడు మేము ఆర్థిక ఇబ్బందులు లేకుండా హాయిగా ఉన్న ఊళ్లోనే జీవిస్తున్నాం. ఈ ప్రభుత్వం చేసిన సాయం మరచిపోలేం.

– లగ్గు మౌనిక, కొప్పర
(తూముల మహేశ్వరరావు, విలేకరి, వంగర)

ఏపీలో 'సంక్షేమం' సూపర్

దేశంలో మిగతా రాష్ట్రాలకన్నా పథకాల అమలులో రాష్ట్రం చాలా ముందుంది

- ఎన్డీసీ ఎయిర్ వైస్ మార్షల్ మనీష్‌కుమార్ గుప్తా ప్రశంస
- విశాఖ, అరకు ప్రాంతాల్లో పర్యటించి పథకాల అమలుతీరు స్వయంగా పరిశీలన
- రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం



సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయిన ఎయిర్ వైస్‌మార్షల్ మనీష్‌కుమార్ గుప్తా

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అద్భుతమని ఢిల్లీ నేషనల్ డిఫెన్సు కళాశాల సీనియర్ డైరెక్టింగ్ స్టాఫ్, ఎయిర్ వైస్‌మార్షల్ మనీష్‌కుమార్ గుప్తా ప్రశంసించారు. ఢిల్లీలోని నేషనల్ డిఫెన్సు కళాశాలకు చెందిన సుమారు 20 మంది ప్రతినిధులతో కూడిన బృందం మనీష్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్రంలో పర్యటించింది. ఇందులో భాగంగా శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పలువురు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమైంది. మనీష్‌కుమార్ మాట్లాడుతూ.. నేషనల్ డిఫెన్స్ కళాశాల ఫ్యాకల్టీ, కోర్సు సభ్యులతో కలిసి రెండ్రోజులుగా విశాఖపట్నం, అరకు తదితర ప్రాంతాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, మహిళ, రైతు సంక్షేమం తదితర రంగాల్లో అమలుచేస్తున్న పలు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు అక్కడి ప్రజలతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఈ ఎన్డీసీ బృందం పర్యటించి అక్కడ అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను పరిశీలించామని.. అయితే, ఆంధ్రప్రదేశ్ మిగతా రాష్ట్రాల కంటే చాలా ముందంజలో ఉందని మనీష్‌కుమార్ కొనియాడారు.

విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలు మెరుగు..

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్యం, మహిళ, రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి పలు కార్యక్రమాలను అమలుచేస్తోందన్నారు. అలాగే, ప్రాథమిక విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. అలాగే, పేద ప్రజల సంక్షేమానికి పలు వినూత్న కార్యక్రమాలు, పథకాలను విజయవంతంగా అమలుచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు.

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్..

ఇక రాష్ట్రంలో ఇంధన శాఖకు సంబంధించిన అంశాలపై ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు వివరిస్తూ.. ప్రజలకు 24 గంటలూ యాక్సెసబుల్, రిలయబుల్ విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని.. సుమారు 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఒకే దేశం ఒకే గ్రిడ్ నినాదంలో భాగంగా 5 గిగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామని, ఐదు పంపు స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నామన్నారు. రాష్ట్ర ఇంధన రంగంలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు ఈ ఏడాది నాలుగు జాతీయ, మూడు అంతర్జాతీయ అవార్డులతో పాటు రాష్ట్రపతి అవార్డును కూడా సాధించామన్నారు. అనంతరం.. వ్యవసాయ రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జి కమిషనర్ జి. శేఖర్‌బాబు వివరిస్తూ.. రాష్ట్ర జీడీపీలో 34 శాతం పైగా వాటా వ్యవసాయ రంగం నుంచే వస్తోందని చెప్పారు. రైతులకు అవసరమైన సేవలన్నింటినీ ఆర్బీకేల ద్వారా ఒకేచోట నుండి అందిస్తున్నామన్నారు.

కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు..

రాష్ట్రంలో వైద్యసేవలను రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా. వెంకటేశ్వర్ వివరిస్తూ.. రాష్ట్రంలో వైద్యపరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా ఎన్నడూలేని విధంగా 53 వేల పోస్టులను భర్తీచేయడంతోపాటు ఇంటివద్దకే మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి జరుగుతోందని వివరించారు. అలాగే.. కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు.

ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకున్నాం.. ▶ మా టార్గెట్ 175

రాజ్యసభ అభ్యర్థి వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, అమరావతి : ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన నాయకుడు సీఎం జగన్ అని, అందుకే మరలా తిరిగి ఓటు అడగడానికి వెళ్తున్నామని, తమ టార్గెట్ 175 అని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థి వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 175 సీట్లు గెలిచి చరిత్ర సృష్టించి తిరిగి అధికారంలోకి రావాలని టార్గెట్ పెట్టుకుని ముందుకెళ్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థిగా వైవీ సుబ్బారెడ్డి ఎంపిక అయిన సందర్భంగా శుక్రవారం తాడేపల్లిలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 'మేనిఫెస్టోలను మాయం చేసిన తత్వం కలిగిన వ్యక్తి చంద్రబాబు.. ఇచ్చిన ప్రతి హామీని చెత్త బుట్టలో పడేశాడు. మేనిఫెస్టోలో హామీలను అమలు చేసి ప్రతి ఇంటికీ దానిని తీసుకెళ్లి ఇచ్చిన వ్యక్తి సీఎం జగన్. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నారు' అని చెప్పారు. ఎన్ని పద్మవ్యూహాలు పన్నినా, ఎందరు కలిసి ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని సీఎం వైఎస్ జగన్ సాధించనున్నారని తెలిపారు. సీఎం జగన్ సుపరిపాలన చూసి రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ, జనసేనలు ఇంకా భేటీలలోనే, సీట్లు, నోట్లు లెక్కేసుకునే స్థితిలోనే ఉన్నారని, తాము మాత్రం దూసుకుపోతున్నామని వైవీ సుబ్బారెడ్డి వివరించారు.

ఎంపీ మాధవి కుమార్తెకు సీఎం నామకరణం

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అరకు ఎంపీ మాధవి శివప్రసాద్ దంపతుల కుమార్తెకు సీఎం వైఎస్ జగన్ శుక్రవారం నామకరణం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ఢిల్లీ వెళ్లిన మాధవి, భర్త శివప్రసాద్ అక్కడకు వచ్చిన సీఎం జగన్‌ను కలిశారు. వారి కోరిక మేరకు చిన్నారికి నామకరణం చేశారు. తాము కోరిన వెంటనే సీఎం నామకరణం చేయడం ఆనందంగా ఉందని, త్వరలో బారసాల నిర్వహించి సీఎం నామకరణం చేసిన పేరును ప్రకటిస్తామని ఎంపీ మాధవి చెప్పారు.



ఎంపీ దంపతుల కుమార్తెకు నామకరణం చేస్తున్న సీఎం జగన్

గ్రామస్థాయిలో వైద్య సేవలు భేష్

కేంద్ర బృందం ప్రశంస

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా): ఏపీలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు అత్యవసర సేవలు అందించడంలో భేషుగ్గా పనిచేస్తున్నాయని ఢిల్లీ కేంద్ర వైద్యసేవల క్వాలిటీ అభివృద్ధి పరిశీలన బృందం సభ్యులు డాక్టర్ రోనఖ్‌శర్మ, డాక్టర్ పవేస్ థాస్ కొనియాడారు. శుక్రవారం చౌడేపల్లె మండలంలోని పరికిదొనలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని వారు పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకనుగుణంగా పేద ప్రజలకు ప్రభుత్వపరంగా అందుతోన్న వైద్యసేవలు, అత్యవసర సేవలపై ఆరా తీశారు. సచివాలయ పరిధిలో సిబ్బంది అందిస్తోన్న సేవలను తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షలు, పరిశుభ్రత, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందుతోన్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భవ సేవలను వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్‌కుమార్, సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



పరికిదొనలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

శ్రీశైలం ప్రాజెక్ట్‌పై ముగిసిన అధ్యయనం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లు కృష్ణానదీ యాజమాన్య బోర్డు పరిధిలోకి రానున్న నేపథ్యంలో శ్రీశైలం డ్యాం సామర్థ్యంపై ఇంజనీరింగ్ నిపుణులు చేపట్టిన అధ్యయనం శుక్రవారం ముగిసింది. కేంద్రజలశక్తి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు గురు, శుక్రవారాల్లో ఇంజనీరింగ్ నిపుణులు డ్యాం సామర్థ్యంపై క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. జలాశయంలోకి ఏటా వచ్చి చేరుతున్న వరదనీరు, దిగువ ప్రాజెక్ట్‌లకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం, శ్రీశైలం జలాశయంపై ఆధారపడిన ప్రాజెక్ట్‌లు, ఎత్తిపోతల పథకాలు వంటి వివరాలను డ్యాం ఇంజనీర్ల నుంచి కేంద్ర బృందం సేకరించింది. శ్రీశైలం డ్యాం పటిష్టతకు తీసుకోవాల్సిన రక్షణ పనులపై కమిటీ శుక్రవారం వ్యూపాయింట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించింది. ప్లంజ్‌పూల్, యాప్రాన్, అప్రోచ్‌రోడ్‌ల నిర్మాణం, రేడియల్ క్రస్ట్‌గేట్లు, రోప్‌ల సామర్థ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలు వంటి విషయాలపై నిపుణులు చర్చించారు. ప్రపంచబ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో సుమారు రూ.130 కోట్లతో త్వరలో పనులు చేపట్టేందుకు కమిటీ నిర్ణయించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ముఖ్యులు వివేక్‌త్రిపాఠి, సభ్యులు కమలేష్ జైన్, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ ఆర్.శరవణన్, కృష్ణానదీ యాజమాన్య బోర్డు సభ్యులు ఆర్.వి.ప్రకాశ్, కె.దక్షిణామూర్తి, సీఎస్ఎంఆర్ఎస్ పరిశోధకులు యు.ఎస్.విద్యార్థి, ఆంధ్రా ఎస్‌డీఎస్ఓ చీఫ్ ఇంజనీర్ టి.వి.ఎన్.ఎ.ఆర్.కుమార్, తెలంగాణ ఎస్‌డీఎస్ఓ చీఫ్ ఇంజనీర్ టి.ప్రమీల, శ్రీశైలం డ్యాం చీఫ్ ఇంజనీర్ ఎస్.కబీర్‌బాషా, డ్యాం ఎస్ఈ పి.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

టెస్లా కంపెనీకి ప్రత్యేక రాయితీల్లేవు

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ | లోక్‌సభ

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లాకు ప్రత్యేకంగా ఎలాంటి రాయితీలను కల్పించడం లేదని భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి కృష్ణపాల్ గుర్జర్ చెప్పారు. భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల తయారీ పరిశ్రమ నెలకొల్పేందుకు రాయితీలతో కూడిన ప్రత్యేక విధానం ఏదీ ప్రభుత్వం రూపొందించలేదని తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. దేశంలో ఎలక్ట్రిక్ కార్లతోపాటు అత్యాధునిక ఆటోమోటివ్ టెక్నాలజీ (ఏఏటీ)తో కూడిన ఉత్పాదనల కోసం ప్రభుత్వం ఉత్పత్తితో ముడిపడిన రెండు ప్రోత్సాహక పథకాలను (పీఎల్ఐలను) రూపొందించినట్లు తెలిపారు. ఏఏటీతోపాటు దేశంలో అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీల ఉత్పాదనను కూడా పీఎల్ఐ స్కీమ్‌లో చేర్చినట్లు చెప్పారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు క్రెడిట్ గ్యారంటీ

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పీవోలను) ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్రెడిట్ గ్యారంటీ స్కీం కింద ఆంధ్రప్రదేశ్‌లో 406 ఎఫ్‌పీవోలు రిజిస్టర్ అయినట్లు కేంద్ర వ్యవసాయ, రైతుసంక్షేమశాఖ మంత్రి అర్జున్ ముండా చెప్పారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఈ ఏడాది జనవరి 31 నాటికి దేశవ్యాప్తంగా 7,906 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఈ పథకం కింద రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అత్యధిక ఎఫ్‌పీవోలు నమోదైన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఏడో స్థానంలో ఉందని వివరించారు.

4,861 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.211.87 కోట్లు



ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (పీఎంఎఫ్ఎంఈ) పథకంలో మొత్తం 4,861 యూనిట్లకు రూ.211.87 కోట్ల ఆర్థిక మద్దతు ఇచ్చామని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలశాఖ సహాయమంత్రి శోభ కరంద్లాజే.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

రూ.68.059 కోట్లతో రైల్వేల అభివృద్ధి

ఏపీలోని నాలుగు జోన్ల పరిధిలో 2023 ఏప్రిల్ 1వ తేదీ వరకు రూ.68.059 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు చేపట్టామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమల్ నత్వానీ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఆ మినహాయింపు ఎందుకు?



పరీక్షల ప్రక్రియ విఫలం కావడానికి సహకరించే అభ్యర్థికి పబ్లిక్ పరీక్షల (అన్యాయమైన మార్గాల నివారణ) బిల్లు నుంచి మినహాయింపు ఎందుకిచ్చారని వైఎస్సార్‌సీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించారు. అభ్యర్థి తప్పు చేసినప్పుడు బిల్లు పరిధిలోకి ఎందుకురారో చెప్పాలని కోరారు. పబ్లిక్ పరీక్షల బిల్లుపై ఆయన మాట్లాడారు. పేపర్ లీకులు, ఉద్యోగ నియామక ప్రశ్నపత్రాల లీకుల కారణంగా నష్టపోయిన కోట్లాదిమంది యువత ఈ తరహా బిల్లు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. బిల్లు అమలుకు ఆర్థిక, మానవ వనరులు గణనీయంగా అవసరం అయ్యేలా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వనరుల లేమి గుర్తించి బిల్లు ప్రభావం పడకుండా చూడాలని కోరారు. రాష్ట్రాలన్నీ ఒకే విధమైన చట్టాన్ని అమలు చేసి పరీక్ష వ్యవస్థలో అసమానతలు రాకుండా చూడాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తిరుపతి నారాయణ స్కూల్‌లో పదో తరగతి పశ్నపత్రాలు లీక్‌చేసిన వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ తరహా అవినీతి, అక్రమా లు, ఇతరత్రా నేర కార్యకలాపాలపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గట్టి చర్యలు తీసుకుంటారని తెలిపారు. బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తోందని చెప్పారు.

ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

దేశవ్యాప్తంగా ఓబీసీలకు జరుగుతున్న అన్యాయం పరిష్కారం కావాలంటే కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి డిమాండ్ చేశారు. జమ్ము, కశ్మీర్ స్థానికసంస్థల చట్టాలు (సవరణ) బిల్లుపై ఆయన మాట్లాడారు. జమ్ము, కశ్మీర్‌లో వెనకబడిన తరగతులకు న్యాయం జరిగేలా బిల్లు తీసుకొచ్చారని కేంద్రాన్ని అభినందించారు. అయితే ఓబీసీలకు జరుగుతున్న అన్యాయాలపై కేంద్రం దృష్టి సారించాల్సి ఉందన్నారు. అసెంబ్లీ, లోక్‌సభల్లో ఓబీసీల ప్రాతినిధ్యం పెంచడానికి 33 శాతం రిజర్వేషన్లతో చట్టం చేయాలని కోరారు. వెనకబడిన తరగతుల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ఏపీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విజయవంతమైన పథకాలను వివరించారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా ఆర్థికంగా వెనకబడిన తరగతుల సామాజిక సాధికారతకు కృషి చేస్తున్నారని చెప్పారు. 45 నుంచి 60 సంవత్సరాలు ఉండి ఆర్థికంగా వెనకబడిన తరగతుల మహిళలకు మూడు దశల్లో రూ.15 వేల చొప్పున ఏడాదికి రూ.45 వేలు ఆర్థికసాయం చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల్లో ఎస్‌హెచ్‌జీ మహిళలకు 45 నుంచి 60 సంవత్సరాలున్న వారికి నాలుగేళ్లలో రూ.75 వేలు ఆర్థిక ప్రయోజనం అందించే లక్ష్యంతో వైఎస్సార్ చేయూత తీసుకొచ్చారని చెప్పారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ తదితర పోటీపరీక్షలకు హాజరు కావాలనుకునే బీసీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ కోసం ఆర్థికసాయం అందిస్తున్నారని తెలిపారు.

కేంద్రంలో 97 మంది ఐఏఎస్ అధికారుల్లో ముగ్గురే ఓబీసీలు



కేంద్రంలోని మంత్రిత్వ శాఖల్లో సెక్రటరీలుగా ఉన్న 97 మంది ఐఏఎస్ అధికారుల్లో ఓబీసీ వారు ముగ్గురే ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య చెప్పారు. కాశ్మీర్ స్థానిక సంస్థల సవరణ బిల్లు–2024కు వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్ల అమలుపై కేంద్రంలోని గత ప్రభుత్వం చిత్తశుద్ధి కనబరచలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అలాగే ఉందని విమర్శించారు. ఓబీసీలను ఓటు బ్యాంకుగా చూడొద్దంటూ కోరారు.

బీసీలను పట్టించుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు

ఓబీసీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని కృష్ణయ్య చెప్పారు. ఓబీసీ విద్యార్థులను పట్టించుకోకపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

వైజాగ్, కాకినాడ, కృష్ణపట్నం నుంచి సముద్ర ఆహార ఉత్పత్తుల రవాణా

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తికి కేంద్రం సమాధానం




సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల నుంచి సముద్ర ఆహార ఉత్పత్తులు సరఫరా చేస్తున్నామని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాలశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. దేశంలో మొత్తం తొమ్మిది సముద్రతీర రాష్ట్రాల నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. సాగర్‌మాల పథకంలో భాగంగా ఇప్పటివరకు 171 ప్రాజెక్టుల్లో రూ.4,525 కోట్ల విలువైన పనులను పాక్షికంగా చేపట్టామని, వీటిలో 55 పూర్తిచేశామని వివరించారు. బందరు, విశాఖపట్నం సహా.. పలు ప్రధాన పోర్టులకు ఆనుకుని ఉన్న ఫిషింగ్ హార్బర్ల ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్‌కు ఆమోదం తెలిపినట్లు చెప్పారు.

రాష్ట్రంలో 3,421 మంది రిజిస్టర్డ్ ప్రాక్టీషనర్లు

ఆంధ్రప్రదేశ్‌లో హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాలకు చెందిన రిజిస్టర్డ్ ప్రాక్టీషనర్లు మొత్తం 3,421 మంది ఉన్నారని కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2022 జనవరి 1వ తేదీ లెక్కల ప్రకారం హోమియోపతి రిజిస్టర్డ్ ప్రాక్టీషనర్లు 2,662 మంది, యునాని 562 మంది, నేచురోపతి 197 మంది ఉన్నారని వివరించారు.

విశాఖ పోర్టులో యాంత్రీకరణ, ఆధునీకరణ పనులు



విశాఖపట్నం పోర్టు సహా ప్రధాన పోర్టుల్లో యాంత్రీకరణ, ఆధునీకరణ పనులు చేపట్టామని కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. విశాఖపట్నం సహా పలు పోర్టుల్లో బెర్త్‌లు, టెర్మినల్స్ అప్‌గ్రేడేషన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఫలితంగా 2013–14 నుంచి కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం రెండింతలు పెరిగిందని తెలిపారు.

ఏపీకి తగిన నిధులు మంజూరు చేయాలి



విభజనతో అన్యాయం జరిగిన ఏపీకి తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీత విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికావడానికి, పునరావాసానికి తగిన నిధులివ్వాలని కోరారు. ఏపీ అభివృద్ధి చెందడానికి కేంద్రం నుంచి తగిన మద్దతు పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ అమృత్ కాల్ అంటున్నారని, కానీ ఏపీకి ఒక్కచుక్క అమృతం కూడా అందలేదని చెప్పారు. కేంద్రం విడుదల చేసిన శ్వేతపత్రంపై ఆమె శుక్రవారం లోక్‌సభలో మాట్లాడారు. రాష్ట్రాల సమూహమే దేశమని, రాష్ట్రాలు అభివృద్ధి చెంది ఆర్థికంగా బలపడితేనే దేశం వృద్ధి చెందుతుందని చెప్పారు. ఏపీకి విద్య, వ్యవసాయం, నీటిపారుదల రంగాల్లో మరింత సహకరించాలని కోరారు. ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ ఫ్యాక్టరీ, కడప ఉక్కు కర్మాగారాలకు పూర్తిస్థాయి మద్దతు ఇవ్వాల్సి ఉందన్నారు. విభజన చట్టం ప్రకారం మంజూరు చేసిన కళాశాలలు, వర్సిటీలకు పూర్తిగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆర్థికవ్యవస్థ బలోపేతానికి కేంద్రం తీసుకునే చర్యలు అభినందనీయమేగానీ బ్లాక్‌మనీ, తమ ఖాతాల్లో రూ.15 లక్షలు పడతాయని ప్రజలు ఆశగా చూడడం వంటి విషయాలపై దృష్టి సారించాలన్నారు. కరోనా సమయంలో దెబ్బతిన్న చిన్న పరిశ్రమలను ఆదుకోవాలని, మూతపడిన చెరకు పరిశ్రమలకు ప్రత్యామ్నాయం చూపాలని ఆమె కోరారు.


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 320

శనివారం 10-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అయ్యర్ అవుట్!
గాయాలతో బ్యాటర్ సతమతం..మిగిలిన టెస్టులకు దూరయ్యే చాన్స్ - స్పోర్ట్స్‌లో



ఇక పాయ్ ప్లాట్‌ఫామ్స్
పేటీఎం ఈ-కామర్స్ పేరు మారుస్తూ ఆర్‌వోసీ ఆమోదం - బిజినెస్‌లో



దేశంలో 96.88 కోట్ల ఓటర్లు
రానున్న ఎన్నికల్లో ఈసారి 96.88 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారని ఎన్నికల సంఘం తెలిపింది.
వివరాలు 6లో ▸



ఉత్తరాఖండ్‌లో ఉద్రిక్తత
ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన మదరసా కూల్చివేతతో ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.
వివరాలు 6లో ▸



రఫాను ఖాళీ చేయించండి
గాజా దక్షిణ ప్రాంత పట్టణం రఫాను ఖాళీ చేయించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆర్మీని ఆదేశించారు.
వివరాలు 6లో ▸




పాకిస్తాన్‌లో హంగ్
పాక్ జాతీయ అసెంబ్లీలో హంగ్ నెలకొంది. గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టలేదు.
వివరాలు 6లో ▸

పీవీకి భారతరత్న

ఆర్థిక సంస్కరణల రూపశిల్పికి దేశ అత్యున్నత పౌర పురస్కారం

మాజీ ప్రధాని చరణ్‌సింగ్, ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా..



- 'ఎక్స్'వేదికగా వెల్లడించిన ప్రధాని మోదీ
- తెలుగు తేజానికి ఎట్టకేలకు సముచిత గౌరవం
- పార్టీలకతీతంగా స్వాగతించిన నేతలు, ప్రముఖులు
- దేశానికి వారి సేవలు చిరస్మరణీయం: ప్రధాని

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు తేజం, దివంగత ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావుకు ఎట్టకేలకు దేశ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. సార్వత్రిక ఎన్నికల వేళ ఆయనకు కేంద్రం భారతరత్న ప్రకటించింది. మరో దివంగత ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌లను కూడా ఈ అత్యున్నత పురస్కారంతో గౌరవించింది. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం 'ఎక్స్'వేదికగా ఈ మేరకు వెల్లడించారు. ఆ ముగ్గురు దిగ్గజాలూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివంటూ గుర్తు చేసుకున్నారు. ''పీవీ ఆర్థిక సంస్కరణలు దేశానికి కొత్త దిశను, ఆర్థిక రంగానికి నూతన జవసత్వాలను ప్రసాదించాయి. ఇక చరణ్‌సింగ్ రైతు సంక్షేమానికి ఆజన్మాంతం పాటుపడ్డారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ఆహార రంగంలో

మిగతా 2వ పేజీలో ▶

తెలుగు ప్రజలందరికీ గౌరవం
పీవీకి భారతరత్నపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హర్షం 2 లో





రైతు బాంధవుడు చరణ్‌సింగ్
- అన్నదాతల హక్కుల కోసం పోరాటం
- వారి సంక్షేమం, సాధికారతే ధ్యేయంగా చట్టాలకు రూపకల్పన

11 లో

హరిత విప్లవ సారథి
- దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఎంఎస్ స్వామినాథన్
- కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు

నవ్య 'ఆర్థిక' భారతానికి ఊపిరి పీవీ! - 11లో

న్యూస్‌రీల్

యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య విద్య



రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య విద్యను అందిస్తున్నామని మంత్రి బుగ్గన తెలిపారు. విశాఖలోని రుషికొండలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.0 పేరుతో నేషనల్ స్కిల్ కాంక్లేవ్-2024 శుక్రవారం ప్రారంభమైంది.
వివరాలు 10లో ▸

స్పేస్ రిఫార్మ్స్ ఇయర్‌గా 2024-25




ఈ ఏడాదిని 'స్పేస్ రిఫార్మ్ ఇయర్'గా ఇస్రో ప్రకటించింది. రాబోయే 14 నెలల్లో 30 ప్రయోగాలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. 2024-25 ఆర్థిక ఏడాదిని గగన్‌యాన్ సంవత్సరంగా ప్రకటించి 7 గగన్‌యాన్ ప్రయోగాత్మక పరీక్షలను నిర్వహించేందుకు ప్రణాళిక రచించినట్లు పేర్కొంది.
వివరాలు 12లో ▸

అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలు



'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు విశాఖలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 26 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు, అధికారులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో బెలూన్లను ఎగురవేసి మంత్రి ఆర్కే రోజా వీటిని ప్రారంభించారు.
వివరాలు 2లో ▸

సన్నగిల్లిన బైడెన్ జ్ఞాపకశక్తి



అమెరికా అధ్యక్షుడు బైడెన్ జ్ఞాపకశక్తి తగ్గిందనే విషయాన్ని ఒక నివేదిక తగిన సాక్ష్యాధారాలతో బహిర్గతం చేయడంతో ప్రస్తుతం ఈ అంశం అమెరికాలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే బైడెన్ వృద్ధాప్యాన్ని ఎన్నికల ప్రచారాస్త్రంగా మలుచుకున్న రిపబ్లికన్లకు ఈ నివేదిక మరో ప్రచారాస్త్రమైంది.
వివరాలు 6లో ▸



పోలవరానికి సహకరించండి

ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వినతి

నిధులు, పెండింగ్ అంశాలు, విభజన సమస్యలపై విజ్ఞాపనలు

ప్రాజెక్టు సాకారానికి కృషి చేయండి

- కాంపోనెంట్ వారీగా సీలింగ్ ఎత్తివేసి తొలివిడత నిధులను విడుదల చేయాలి.. కేంద్ర క్యాబినెట్ ద్వారా వెంటనే ఆమోదించాలి
- తెలంగాణ నుంచి రూ.7 వేల కోట్లకుపైగా విద్యుత్తు బకాయిలను ఇప్పించండి
- కొత్త మెడికల్ కాలేజీలు,
- భోగాపురానికి 6 లేన్ రహదారికి సహకారం కావాలి
- విశాఖ - కర్నూలు హైస్పీడ్ కారిడార్‌ను కడప మీదుగా బెంగళూరుకు పొడిగించాలి
- ఏపీ ఆర్థిక పురోగతికి ప్రత్యేక హోదానే కీలకం.. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చండి

- వివరాలు 2లో

ప్రధాని మోదీకి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

కేంద్ర ఆర్థిక మంత్రితో సీఎం జగన్ భేటీ
- నిధులు, పెండింగ్ అంశాలపై చర్చ
- పోలవరం సవరించిన అంచనాలకు ఆమోదం, బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

2లో



సామాజికరంగ వ్యయం రూ.3.06 లక్షల కోట్లు

- ఏటా పెరుగుతున్న వ్యయం
- 2022-23 కాగ్ అకౌంట్స్ నివేదిక వెల్లడి

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) అకౌంట్స్ నివేదిక-2022-23 స్పష్టం చేసింది. గత నాలుగేళ్ల నుంచి ఏటా సామాజిక రంగ వ్యయం పెరుగుతుండటమే ఇందుకు నిదర్శనమని వెల్లడించింది.
- వివరాలు 2లో



యూపీఏపై నిర్మల నిప్పులు
- నాటి ప్రభుత్వాలు దేశ ఆర్థికాన్ని దీనావస్థలోకి నెట్టాయి
- శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో నిర్మల వ్యాఖ్య

6 లో

ఎన్డీఏలోకి ఆరెల్డీ
- తాతకు భారతరత్నతో కేంద్రం నా మనసు గెలుచుకుంది
- చరణ్‌సింగ్ మనవడు, ఆరెల్డీ చీఫ్ జయంత్ వ్యాఖ్యలు

6 లో

సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు...


జస్టిస్ రాకేష్‌పై 'సుప్రీం' సీరియస్!

- 'మిషన్ బిల్డ్' కేసు తీర్పులో రాష్ట్ర ప్రభుత్వంపై జస్టిస్ రాకేష్ అనుచిత వ్యాఖ్యల తొలగింపు
- సీజేల బదిలీలను తప్పుబడుతూ కొలీజియంపైనా వ్యాఖ్యలు
- వాటిని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు
- పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయన్న వాదనతో ఏకీభవించిన ధర్మాసనం
- రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్న రాకేష్‌కుమార్
- వ్యవస్థను కుళ్లబెట్టారంటూ ఆయనపై గతంలోనే సుప్రీం ఆగ్రహం
- గత్యంతరం లేక ఎన్‌సీఎల్ఏటీ జ్యుడీషియల్ సభ్యుడి పదవికి రాజీనామా
- ఏపీ హైకోర్టు జడ్జిగా రిటైరైన రోజు పూలు చల్లి సాష్టాంగ నమస్కారాలతో వీడ్కోలు పలికిన టీడీపీ నేతలు, మద్దతుదారులు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా ఉన్న సమయంలో జస్టిస్ రాకేష్ కుమార్, జస్టిస్ దొనడి రమేష్ తమ తీర్పులో అటు అత్యున్నత న్యాయస్థానం ఇటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పక్షపాతంతో చేసిన ఆ అభ్యంతరకర, వివాదాస్పద వ్యాఖ్యలను ఆ తీర్పు నుంచి సుప్రీంకోర్టు తాజాగా తొలగించింది. ఇలాంటి అసంబద్ధ, పక్షపాత వ్యాఖ్యలతో

మిగతా 10వ పేజీలో ▶



ముందే వచ్చిన వేసవి!

- ఫిబ్రవరిలోనే ఏప్రిల్ నాటి ఎండలు
- సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలో కొన్నిచోట్ల 38 డిగ్రీలకు పైగా నమోదు
- ఈనెల 16 తర్వాత మరింత పెరిగే అవకాశం
- ఈ వేసవి మరింత తీవ్రంగా ఉంటుందంటున్న నిపుణులు

12 లో

రాష్ట్రంలో మూడు రెట్లు పెరిగిన స్టార్టప్‌లు

2019లో ఉన్నవి 161.. ఐదేళ్లలో మూడింతలు పెరుగుదల



- ఉద్యోగుల సంఖ్య 1,552 నుంచి 5,669కు పెరుగుదల
- ఇండస్ట్రీ4, ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలతో రాష్ట్రంలో పెరుగుతున్న స్టార్టప్‌లు
- డీపీఐఐటీ గణాంకాలు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యువత నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ సరికొత్త ఆలోచనలతో ఆవిష్కరణల దిశగా అడుగులు వేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలు చర్యలు చేపట్టారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల ద్వారా అందిస్తున్న సహకారంతో రాష్ట్రంలో స్టార్టప్‌ల సంఖ్య భారీగా పెరిగింది. వీటి ద్వారా సాంకేతిక నిపుణులైన యువత స్వయం ఉపాధి పొందడమే కాకుండా, వేలాది మందికి ఉద్యోగాలూ వస్తున్నాయి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో స్టార్టప్‌ల సంఖ్య మూడు రెట్లకు పైగా పెరిగినట్లు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) వెల్లడించింది. ఆ సంస్థ తాజా గణాంకాల ప్రకారం.. 2019లో రాష్ట్రంలో 161 స్టార్టప్‌లు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 586 దాటింది. వీటిలో పనిచేసే ప్రత్యక్ష ఉద్యోగుల సంఖ్య కూడా

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

తెలుగు ప్రజలందరికీ గౌరవం

పీవీకి భారతరత్నపై సీఎం జగన్ హర్షం

సాక్షి, అమరావతి: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించటంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 'పీవీ నరసింహారావు రాజనీతిజ్ఞుడు, ఉన్నత రాజకీయ, నైతిక విలువలు కలిగిన పండితుడు. ఆయనకు అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రకటించడం తెలుగు ప్రజలందరికీ గౌరవం' అని సీఎం పేర్కొన్నారు. అలాగే, రైతుల కోసం పాటుపడిన మాజీ ప్రధాని చరణ్‌సింగ్, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ, బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు కూడా భారతరత్న ప్రకటించడం యావత్ జాతి గర్వించదగ్గ విషయమని శుక్రవారం రాత్రి 'ఎక్స్'లో సీఎం ట్వీట్ చేశారు.

కమీషన్ విడుదలపై రేషన్ డీలర్ల హర్షం

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకంలో పాల్గొన్న రేషన్ డీలర్లు

పోలాకి: ఐసీడీఎస్, మిడ్ డే మీల్స్‌కు రేషన్ సరఫరా చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం డీలర్లకు కమీషన్ చెల్లిస్తోంది. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న కమీషన్‌ను విడుదల చేయటంపై రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పోలాకి మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు ఎం.జగన్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు సీఎం జగన్, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ రామకృష్ణలు మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న కమీషన్‌ల కోసం రూ.23.71 కోట్లు విడుదల చేయడంతోపాటు కోవిడ్ సమయంలో మృతి చెందిన డీలర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం మంచి పరిణామమన్నారు.

33 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో గ్రేడ్–2 అనలిస్టులు 18, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీసులో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 7, మెడికల్ ఎడ్యుకేషన్‌లో లైబ్రేరియన్ పోస్టులు 4, ట్రైబల్ వెల్ఫేర్ సర్వీసులో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టు 1, సీనియర్ సిటిజన్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ 2, గ్రౌండ్ వాటర్ సర్వీసెస్‌లో ఒక పోస్టు మొత్తం 33 పోస్టులను భర్తీచేయనున్నారు. ఈ మేరకు ఆయా వివరాలను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పూర్తి సమాచారం కోసం https://psc.ap.gov.inలో చూడవచ్చు.

పోలవరానికి సహకరించండి..

ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి జగన్ వినతి

- నిధులు, పెండింగ్ అంశాలు, విభజన సమస్యలపై విజ్ఞాపనలు
- ప్రాజెక్టు సాకారానికి సహకరించండి
- కాంపోనెంట్ వారీగా సీలింగ్ ఎత్తివేసి తొలివిడత నిధులను విడుదల చేయాలి
- కేంద్ర క్యాబినెట్ ద్వారా వెంటనే ఆమోదించాలి



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సీఎం వైఎస్ జగన్, ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణాధారమైన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ అంశాలు, విభజన సమస్యలపై చర్చించేందుకు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం ఉదయం పార్లమెంట్‌లోని కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో పలు అంశాలపై ప్రధానికి వినతిపత్రం అందజేశారు. పోలవరంలో కాంపొనెంట్ వారీగా సీలింగ్ ఎత్తివేతతోపాటు ప్రాజెక్టు తొలివిడతను సత్వరమే పూర్తి చేసేందుకు రూ.12,911 కోట్ల నిధుల విడుదలకు కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించిందని సీఎం జగన్ గుర్తు చేశారు. ఈ రెండు అంశాలు కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్న దృష్ట్యా తక్షణమే దీనిపై దృష్టి పెట్టాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం మొదటి విడత పూర్తికి దాదాపు రూ.17,144 కోట్లు ఖర్చు అవుతాయని, దీనికి సంబంధించిన ప్రతిపాదన ఇప్పటికే జలశక్తి శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నందున సత్వరమే పరిశీలించి ఆమోదం తెలపాలని అభ్యర్థించారు. పార్టీ పార్లమెంటరీ నేత వి.విజయసాయిరెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మార్గాని భరత్, రెడ్డప్ప, గోరంట్ల మాధవ్, వంగా గీత, గురుమూర్తి, సత్యవతి, మాధవి, చింతా అనురాధ, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు వెంటరాగా ప్రధాని కార్యాలయంలోకి వెళ్లిన సీఎం జగన్ సుమారు గంట పాటు సమావేశమయ్యారు.

ప్రధాని దృష్టికి తెచ్చిన ఇతర అంశాలివీ..

- ఏపీకి ప్రత్యేక హోదా సహా ఇతర విభజన హామీలన్నీ అమలు చేయాలి. రాష్ట్ర ఆర్థిక పురోగతికి ప్రత్యేక హోదా చాలా అవసరం. పెట్టుబడులు రావడమే కాకుండా మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కేందుకు ప్రత్యేక హోదా కీలకం.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించాం. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండేలా కొత్తగా 17 వైద్య కళాశాలలు నిర్మిస్తున్నాం. ఇప్పటికే కొన్ని కొత్త వైద్య కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభం అయ్యాయి. మిగతా కాలేజీల ఏర్పాటుకు తగిన సహాయ సహకారాలు అందించాలి.
- విశాఖ నగరాన్ని భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో అనుసంధానిస్తూ భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖ పోర్టులను కలిపే 55 కిలోమీటర్ల పొడవైన 6 లేన్ల రహదారి నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలి.
- విభజన చట్టంలో పొందుపరచిన విశాఖ–కర్నూలు హైస్పీడ్ కారిడార్‌ను వయా కడప మీదుగా బెంగళూరు వరకూ పొడిగించాలి. పరిశీలన పూర్తి చేసిన ఈ ప్రాజెక్టు సాకారమయ్యేలా చూడాలి. కడప–పులివెందుల–ముదిగుబ్బ–సత్యసాయి ప్రశాంతి నిలయం–హిందూపూర్ కొత్త రైల్వేలైన్‌ను దీంట్లో భాగంగా చేపట్టాలి. ఈ ప్రాజెక్టు వల్ల వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతానికి చక్కటి కనెక్టివిటీ ఏర్పడుతుంది.
- విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు త్వరగా ఆమోదం తెలపాలి.
- 2014 జూన్ నుంచి మూడేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రానికి ఏపీ జెన్‌కో విద్యుత్ సరఫరా చేసింది. దీనికి సంబంధించి రూ.7,230 కోట్ల బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం వీటిని వెంటనే చెల్లించేలా చూడాలి.

సీతారామన్‌తో సీఎం సమావేశం

రాష్ట్రాభివృద్ధికి చేయూత అందిస్తూ నిధులు త్వరితగతిన విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం జగన్ కోరారు. శుక్రవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం సమావేశమయ్యారు. నిధులు, పెండింగ్ అంశాలపై అరగంటకు పైగా చర్చించారు. ప్రధానికి నివేదించిన అంశాలను ఆర్థిక మంత్రి దృష్టికి తెచ్చారు. పోలవరం సవరించిన అంచనాలకు ఆమోదం, బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సామాజిక రంగ వ్యయం రూ.3.06 లక్షల కోట్లు

- ఏటా పెరుగుతున్న వ్యయం
- నాలుగేళ్లలో విద్య, వైద్యం, సంక్షేమం, గృహనిర్మాణానికి భారీగా ఖర్చు
- కాగ్ అకౌంట్స్ నివేదిక–2022–23 వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) అకౌంట్స్ నివేదిక–2022–23 స్పష్టం చేసింది. గత నాలుగేళ్ల నుంచి ఏటా సామాజిక రంగ వ్యయం పెరుగుతుండటమే ఇందుకు నిదర్శనమని వెల్లడించింది. గత నాలుగేళ్లలో సామాజిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.3.06 లక్షల కోట్లు వ్యయం చేసినట్లు పేర్కొంది. విద్య, వైద్య ఆరోగ్య– కుటుంబ సంక్షేమం, తాగునీరు, పారిశుధ్యం, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి, కార్మిక ఉపాధి, సంక్షేమం, సామాజిక భద్రతలను సామాజిక రంగంగా పరిగణిస్తారు. విద్య, వైద్య రంగాలకు, పౌష్టికాహారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆ రంగాలపై ఎక్కువ ఖర్చు చేసినట్లు కాగ్ అకౌంట్స్ నివేదిక తెలిపింది. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఇతర వర్గాల్లోని పేదల సంక్షేమానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో సామాజిక రంగం వ్యయం ఏటా పెరుగుతున్నట్లు నివేదిక వెల్లడించింది. అలాగే కార్మికుల సంక్షేమంతో పాటు తాగునీటి సరఫరాకు గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది.

కాగ్ అకౌంట్స్ ప్రకారం.. 2019-20 నుంచి 2022-23 వరకు సామాజిక రంగం వ్యయం ఇలా..

ఆర్థిక సంవత్సరం	సామాజిక రంగ వ్యయం (రూ.కోట్లలో)
2019-20	70,157
2020-21	71,194
2021-22	75,610
2022-23	89,096
మొత్తం	3,06,057

రాష్ట్రంలో మూడు రెట్లు పెరిగిన స్టార్టప్‌లు



▶ మొదటి పేజీ తరువాయి

అదే స్థాయిలో పెరిగింది. 2019లో 1,552 మంది వీటిలో పనిచేస్తుండగా, ఆ సంఖ్య ఇప్పుడు 5,669కు చేరింది. గత చంద్రబాబు ప్రభుత్వం కేవలం ఇంక్యుబేషన్ సెంటర్ పేరుతో ప్రచారానికే పరిమితమవడంతో స్టార్టప్‌లలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. వైఎస్ జగన్ ప్రభుత్వం దానికి భిన్నంగా స్టార్టప్‌ల ప్రోత్సాహానికి చర్యలు చేపట్టింది. స్టార్టప్‌లకు మెంటార్‌షిప్, ఫండింగ్, ఇండస్ట్రీ కనెక్ట్‌లతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ తెంటు 'సాక్షి'కి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తొలి నాలుగో తరం పారిశ్రామిక రంగం ఇండస్ట్రీ 4కు చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని కల్పతరువు పేరిట విశాఖలో ఏర్పాటు చేసింది. దీంతోపాటు నాస్కామ్ సహాయంతో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల స్టార్టప్‌ల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలను కూడా విశాఖలో ఏర్పాటు చేసింది. ఏయూలో ఏ హబ్, ఓడల నిర్మాణంపైన, మెడ్‌టెక్ జోన్‌లోనూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా పలు స్టార్టప్‌లు ఏర్పాటవుతున్నాయని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ.కృష్ణబాబు అన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం జరిగిన స్టేట్ వన్ హెల్త్ వర్క్‌షాప్‌లో మాట్లాడారు. జూనోటిక్ వ్యాధుల నుంచి యాంటీ మైక్రోబయల్ నిరోధకత వరకు, పర్యావరణ కాలుష్యం నుంచి ఆహార భద్రత వరకు సవాళ్లను పరిష్కరించడం ద్వారా ప్రభావవంతమైన వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ నియంత్రణ చర్యల్లో ఇండో–డచ్ పైలట్ ప్రాజెక్ట్ కింద సిద్ధార్థ వైద్య కళాశాల, విజయవాడ వెటర్నరీ సైన్స్ కళాశాలల మైక్రోబయాలజీ విభాగాలు భాగస్వామ్యమయ్యాయన్నారు. రేబీస్ నిర్ధారణ ప్రయోగశాలల ఏర్పాటుకు తిరుపతి స్విమ్స్, కాకినాడ రంగరాయ, విశాఖ ఆంధ్రా మెడికల్ కాలేజీ, గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అట్టహాసంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలు

- బెలూన్లు ఎగురవేసి ప్రారంభించిన మంత్రి ఆర్కే రోజా
- హాజరైన శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న
- ఏపీలో క్రీడా రంగానికి పెద్దపీట వేశామని ఉద్ఘాటన
- విశాఖ వేదికగా ఐదు రోజులపాటు సాగనున్న రాష్ట్రస్థాయి పోటీలు
- 13న సీఎం జగన్ చేతుల మీదుగా విజేతలకు టైటిల్స్ ప్రదానం
- దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.130 కోట్లతో పోటీల నిర్వహణ ఇదే తొలిసారి



మాట్లాడుతున్న మంత్రి రోజా, చిత్రంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

విశాఖ స్పోర్ట్స్ : 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు విశాఖ వేదికగా శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో 26 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు, అధికారులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో బెలూన్లను ఎగురవేసి రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముందుగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, స్పోర్ట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర, కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున ఇతర అధికార, రాజకీయ ప్రముఖులతో కలిసి జాతీయ పతాకాన్ని, శాప్ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. క్రీడాకారులందరితో ప్రతిజ్ఞ చేయించారు. శాప్ అధికారులు రూపొందించిన ప్రత్యేక ప్రకటనను చదవటం ద్వారా 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్రస్థాయి పోటీలు క్రీడాకారుల కేరింతలు మధ్య విశాఖ రైల్వే మైదానంలో మంత్రి రోజా ప్రారంభించారు. అనంతరం.. అధికారులతో కలిసి 26 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. యువతలో క్రీడానైపుణ్యాలను పెంపొందించడానికే ఆడుదాం ఆంధ్రా పోటీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. 'ఆడుదాం ఆంధ్ర' అనేది అందరి ఆట.. యువతకు భవిష్యత్తుకు బంగారు బాట అని కొనియాడారు. యువ ఆటగాళ్లలో దాగి ఉన్న టాలెంట్‌ను వెలికితీసే వేట అన్నారు. 15,400 సచివాలయాల పరిధిలోని ఎంతో మందిని ఈ క్రతువులో భాగస్వామ్యం చేశామన్నారు. ఈనెల 13న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజేతలకు వైఎస్సార్ స్టేడియంలో రాష్ట్ర టైటిల్స్ అందిస్తారన్నారు.

విజేతలకు ప్రత్యేక శిక్షణ : కలెక్టర్

ఈ క్రీడలకు విశాఖ మహానగరం వేదిక కావటం అదృష్టంగా భావిస్తున్నానని కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున చెప్పారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన జట్ల సభ్యులకు ఏపీఎ, ప్రొ కబడ్డీ, బ్లాక్ హాక్స్, శ్రీకాంత్, సింధు బ్యాడ్మింటన్, ఖోఖో అసోసియేషన్ల తరపున ప్రత్యేక శిక్షణ ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జేసీ కె. మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, జాతీయ క్రికెటర్ శ్రీకర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి: బైరెడ్డి

'ఆడుదాం–ఆంధ్ర' వేదికగా క్రీడాకారులు వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆకాంక్షించారు. జీవితంలో గెలుపు ఓటములు సహజమని.. కష్టం విలువ తెలుసుకున్న రోజు విజయాలు వాటంతట అవే వస్తాయని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా క్రీడల కోసం రూ.130 కోట్లు ఖర్చుపెట్టి గ్రామస్థాయి నుంచే ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేలా పోటీలు నిర్వహించడం ఇదే మొదటిసారన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న మాట్లాడుతూ.. క్రీడాకారులు పోటీతత్వాన్ని అలవర్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం.. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు, వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని, అందులో భాగంగానే 'ఆడుదాం ఆంధ్రా'ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర చెప్పారు. ఇక ఇప్పటివరకు జరిగిన క్రీడల్లో విజేతలకు రూ.12 కోట్లతో బహుమతులు అందజేశామని, రాష్ట్రస్థాయి విజేతలకు రూ.87 లక్షలతో బహుమతులు అందజేయనున్నామన్నారు.

ఆ బకాయిలు, ఆస్తులను రాబట్టండి..

- షర్మిలకు మంత్రి రోజా సూచన

అనంతరం.. మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నుంచి మనకు రావల్సిన రూ.ఆరువేల కోట్లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో ఏపీకి రావల్సిన రూ.లక్షా 80వేల కోట్ల ఆస్తులను కాంగ్రెస్ పార్టీకి చెందిన షర్మిల రాబట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో పోరాటం చేస్తా అని చెప్పి అక్కడ నేతలను ఆమె నిండా ముంచారని, పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి ఏపీలో ఎందుకు పోరాటం చేస్తున్నారో షర్మిల చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. చంద్రబాబు అమిత్ షా కాళ్లు పట్టుకోవడం సిగ్గుచేటన్నారు. రాజకీయంగా చంద్రబాబు రోజురోజుకి దిగజారిపోతున్నాడని రోజా ధ్వజమెత్తారు. ఇక 'ఆడుదాం ఆంధ్రా' కిట్లపై స్పందిస్తూ.. వాటిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో వేస్తే తప్పేంటని.. ఆంధ్రా దిష్టిబొమ్మ చంద్రబాబు ఫొటో వేయాలా అంటూ ప్రశ్నించారు.

పీవీకి భారతరత్న

▶ మొదటి పేజీ తరువాయి

భారత్ స్వయంసమృద్ధి సాధించడంలో కీలకపాత్ర పోషించారు''అంటూ ప్రధాని కొనియాడారు. తర్వాత కాసేపటికే వారు ముగ్గురికీ భారతరత్న ప్రకటిస్తూ రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడింది. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వేళ ప్రధాని పదవి చేపట్టి ఆర్థిక సంస్కరణలతో ప్రగతి బాట పట్టించిన రాజనీతిజ్ఞుడు పీవీ. అంతర్గత భద్రత మొదలుకుని విదేశాంగ విధానం దాకా, ఆర్థిక రంగం నుంచి రైతు సంక్షేమం దాకా అన్ని అంశాల్లోనూ చెరగని ముద్ర వేసిన ఆయన 2004లో మరణించారు. ఇక చరణ్‌సింగ్ పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాట్ నేత. కాంగ్రెస్ వ్యతిరేకరాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. రెండుసార్లు యూపీ సీఎంగా, అనంతరం కేంద్ర హోం మంత్రిగా రాణించారు. ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితం గడిపారు. 1979లో స్వల్పకాలం ప్రధానిగానూ చేశారు. 1987లో తుదిశ్వాస విడిచారు. ఆయనదీ, పీవీదీ పూర్తిగా బీజేపీయేతర నేపథ్యమే కావడం గమనార్హం. వారికి భారతరత్న పురస్కారం రాజకీయంగా, సామాజికంగా ఎంతో ప్రభావం చూపగల నిర్ణయమంటున్నారు. ముఖ్యంగా రాజకీయ జీవితాన్నంతా కాంగ్రెస్‌కే ధారపోసిన పీవీకి ఆ పార్టీ సరైన గుర్తింపు, గౌరవం ఇవ్వలేదని ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ తెలుగు రాష్ట్రాల్లో దీని ప్రభావం గణనీయంగా ఉంటుందన్న భావన వ్యక్తమవుతోంది. ఇక యూపీలో గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిన 16 స్థానాల్లో ఆరు చరణ్‌సింగ్ మనవడైన జయంత్ సింగ్ సారథ్యంలోని ఆర్‌ఎల్‌డీ ప్రాబల్యమున్నవే. ఆయనను ఎన్డీఏలో చేర్చుకునేందుకు బీజేపీ కొంతకాలంగా గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించగానే జయంత్ ఎన్డీయేలో చేరుతున్నట్టు వెల్లడించడం విశేషం! ఇక మన్కొంబు సాంబశివన్ స్వామినాథన్ ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త. తన విశేష పరిశోధనలతో భారత్‌ను స్వయంసమృద్ధంగా తీర్చిదిద్ది కరువు మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టిన దార్శనికుడు. ఆయన 2023లో మృతి చెందారు. బిహార్ దివంగత ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌తో పాటు బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీలకు కూడా ఇటీవలే భారతరత్న ప్రకటించడం తెలిసిందే. దాంతో ఈ ఏడాది ఈ పురస్కార గ్రహీతల సంఖ్య ఐదుకు చేరింది. ఒకే ఏడాదిలో ఇంత మందికి భారతరత్న ఇవ్వడం ఇదే తొలిసారి. 1999లో అత్యధికంగా నలుగురికి ఈ గౌరవం దక్కింది. 1954 నుంచి ఇప్పటిదాకా మొత్తమ్మీద ఇప్పటిదాకా 53 మందికి భారతరత్న పురస్కారం అందజేశారు. ఈసారి ఈ అవార్డు ప్రకటించిన వారిలో అద్వానీ (96) మాత్రమే జీవించి ఉన్నారు.

సంస్కరణల రూపశిల్పి పీవీ...

మాజీ ప్రధాని పీవీని భారతరత్నతో సత్కరిస్తున్నందుకు సంతోషిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. ''ఆయన విశిష్ట పండితుడు. గొప్ప రాజనీతిజ్ఞుడు. పలు హోదాలలో దేశానికి అసమాన సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, అనేక ఏళ్ల పాటు లోక్‌సభ, శాసనసభ సభ్యునిగా ఆయన చేసిన కృషి మరులేనిది. దేశ ఆర్థికాభివృద్ధిలో దూరదృష్టితో కూడిన ఆయన నాయకత్వం అతి కీలకపాత్ర పోషించింది. దేశ శ్రేయస్సుకు, అభివృద్ధికి బలమైన పునాది వేసింది. భారత మార్కెట్లను ప్రపంచానికి తెరుస్తూ ప్రధానిగా పీవీ తెచ్చిన సంస్కరణలు చాలా కీలకమైనవి. తద్వారా ఆర్థిక రంగంలో నూతన శకానికి తెరతీశారు పీవీ. విదేశాంగ విధానాన్ని సమూలంగా మార్చేయడమే గాక భాష, విద్య తదితర రంగాలెన్నింటిపైనో చెరగని ముద్ర వేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశ సాంస్కృతిక, మేధో వారసత్వాన్ని సుసంపన్నం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ''అంటూ ప్రస్తుతించారు.

మార్గదర్శకుడు స్వామినాథన్...

వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి స్వామినాథన్ చేసిన సేవలు మరవలేనివని మోదీ అన్నారు. ''క్లిష్ట సమయంలో దేశం వ్యవసాయ స్వావలంబన సాధించడంలో ఆయనది కీలక పాత్ర. దేశ వ్యవసాయాన్ని ఆధునీకరించే దిశగా అద్భుతమైన ప్రయోగాలు చేశారు. స్వామినాథన్ దార్శనికత సాగు తీరుతెన్నులనే సమూలంగా మార్చడమే గాక దేశ ఆహార భద్రతకు, శ్రేయస్సుకు బాటలు పరిచింది. నాకాయన ఎంతగానో తెలుసు. ఆయన అంతర్ దృష్టిని నేనెప్పుడూ గౌరవిస్తాను. స్వామినాథన్ బాటలో యువతను, విద్యార్థులను పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తున్నాం''అని వివరించారు.

రైతు సంక్షేమానికి అంకితం...

దివంగత ప్రధాని చరణ్‌సింగ్‌ను భారతరత్నతో సత్కరించడం తమ ప్రభుత్వ అదృష్టమని మోదీ అన్నారు. ''దేశానికి ఆయన చేసిన సాటిలేని కృషికి ఈ గౌరవం అంకితం. ఆయన జీవితమంతా రైతుల హక్కులు, సంక్షేమానికే అంకితం చేశారు. దేశ నిర్మాణంలో తనదైన ముద్ర వేశారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిలిచారు. ప్రజాస్వామ్యం పట్ల ఆయన నిబద్ధత యావత్ జాతికి స్ఫూర్తిదాయకం'' అంటూ కొనియాడారు.

స్వాగతించిన పార్టీలు

పీవీ, చరణ్‌సింగ్, ఎంఎస్‌లకు భారతరత్న ప్రకటించడంపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయాన్ని పార్టీలకు అతీతంగా నేతలంతా స్వాగతించారు. వారు ముగ్గురూ ఎప్పటికీ భారతరత్నాలేనని కాంగ్రెస్ పేర్కొంది. కాంగ్రెస్ తరపున ఈ నిర్ణయాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జాతి నిర్మాణానికి పీవీ చేసిన కృషి ఎనలేనిదని ప్రస్తుతించారు. ఆర్థికం, విదేశాంగం, వ్యవసాయం, అణు శక్తి మొదలుకుని లుక్ ఈస్ట్ పాలసీ దాకా ఆయన కృషిని ఒక్కొక్కటిగా ఖర్గే ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. మరోవైపు, పీవీకి భారతరత్న రావడంపై ఏమంటారని కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీని పార్లమెంటు బయట మీడియా ప్రత్యేకంగా ప్రశ్నించడం విశేషం. ''నేను స్వాగతిస్తున్నా. కచ్చితంగా''అంటూ ముక్తసరి స్పందనతో సరిపెట్టారామె. స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించిన మోదీ, ఆయన ఫార్ములా ఆధారంగా రూపొందిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంపై మాత్రం మూగనోము పట్టారంటూ కాంగ్రెస్ విమర్శించింది. ఇలాంటి నిర్ణయాల్లో బీజేపీ పార్టీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తుందని మరోసారి రుజువైందని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. వారికి ఎప్పుడో ఈ గౌరవం దక్కి ఉండాల్సిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. పీవీకి భారతరత్న ఇవ్వడాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రస్తుతించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటేషనల్ థింకింగ్

21వ శతాబ్దపు నైపుణ్యాలు కూడా..

- అమెజాన్ ఇండియాతో భాగస్వామ్యం
- సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బ్లెండెడ్ లెర్నింగ్ కోర్సుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటేషనల్ థింకింగ్, 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించేందుకు అమెజాన్ ఇండియా.. అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. అమెజాన్ భాగస్వామ్యంతో తరగతి గదుల్లో కంప్యూటర్ సైన్స్ పాఠ్యాంశాలను సమర్థవంతంగా అందించడంలో భాగంగా ఉపాధ్యాయులకు బోధన, సాంకేతికత, నాయకత్వ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. విజయవాడలోని సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యాలయంలో శుక్రవారం అమెజాన్ ఇండియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో 10 వేల మంది విద్యార్థులు, 500 మంది ఉపాధ్యాయులకు కంప్యూటర్ సైన్స్ విద్యను అందజేస్తామన్నారు. 2026–27 నాటికి 21వ శతాబ్దపు నైపుణ్య పాఠ్యాంశాల ద్వారా రాష్ట్రంలోని లక్షమంది విద్యార్థులు ప్రయోజనం పొందేలా కార్యాచరణ రూపొందించామన్నారు. అమెజాన్ ఇండియా ప్రతినిధి అక్షయ్ కశ్యప్ మాట్లాడుతూ.. గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా 1.5 మిలియన్ల మంది విద్యార్థులు, 8,000 మంది అధ్యాపకులకు కంప్యూటర్ సైన్స్ విద్యను అందించామన్నారు.

డీఎస్సీ–2024కు జీవో జారీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఈ నెల 12న డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. ఇందులో 6,100 పోస్టుల భర్తీకి అనుమతినిచ్చింది. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ జీవో నంబర్ 56 జారీ చేశారు. ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల పాటు అప్రెంటీస్‌షిప్ ఉంటుందని పేర్కొన్నారు. మొదటి ఏడాది బేసిక్ వేతనంలో 50 శాతం, రెండో ఏడాది 60 శాతం చెల్లించనున్నారు. రెండేళ్ల అప్రెంటీస్‌షిప్ పూర్తిచేసినవారికి రెగ్యులర్ వేతన స్కేల్ అమలు చేస్తారు. ఈ అప్రెంటీస్‌షిప్ కాలంలో ఉపాధ్యాయులకు ఐబీ కరిక్యులం, డిజిటల్ టెక్నాలజీ బోధన, టోఫెల్, ఇంగ్లిష్ మీడియం బోధన వంటివాటిలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

విద్యా శాఖలోకి 'పురపాలక' టీచర్లు

ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ

ఇకపై జిల్లా యూనిట్‌గా నియామకాలు, బదిలీలు



సాక్షి, అమరావతి: ఎంతోకాలంగా నలుగుతున్న పురపాలక ఉపాధ్యాయుల సర్వీసు బదలాయింపు ఎట్టకేలకు పూర్తయింది. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసును ప్రభుత్వం పాఠశాల విద్యా శాఖలో విలీనం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీవో నం.7, నగరపాలక సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీవో నం.8, జీవీఎంసీ ఉపాధ్యాయులకు జీవో నం.9, విజయవాడ నగరపాలక సంస్థ ఉపాధ్యాయులకు జీవో నం.10 జారీ చేశారు. దీంతో పురపాలక ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అంశం పూర్తిగా విద్యా శాఖకు అప్పగించినట్టయింది. గతంలో నగర, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేర్వేరు సర్వీసు నిబంధనలు ఉండేవి. దాంతో వారు ఆ సంస్థ పరిధిలోని పాఠశాలలకు మాత్రమే బదిలీ అయ్యేవారు. ఇకపై జిల్లా యూనిట్‌గా వారి నియామకాలు, బదిలీలు చేపడతారు. ఈ ప్రక్రియను కూడా పాఠశాల విద్యా శాఖ నిర్వహిస్తుంది.

పదోన్నతులు కల్పించి, బదిలీలు చేపట్టాలి: ఎస్టీయూ

పురపాలక సంఘాల ఉపాధ్యాయులకు ప్రభుత్వం సర్వీస్ రూల్స్ విడుదల చేసినందున మున్సిపల్ టీచర్లకు పదోన్నతులిచ్చి, బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. వీరికి గత నాలుగేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేవని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

● తెలంగాణ

ఏపీని ఎందుకు అడ్డుకోలేదు?

- వాళ్లక్కడ ప్రాజెక్టులు కడుతుంటే.. బీఆర్ఎస్ చేసిందేంటి?
- వైఎస్ జగన్ సర్కార్ ఏకే 47లతో పోలీసులను పంపితే ఏం చేశారు?
- వాళ్లు నాగార్జున సాగర్ మీద పహారా కాస్తున్నా కిమ్మనలేదు
- ఆంధ్రప్రదేశ్ 12.5 టీఎంసీల నీటికి సరిపడా ప్రాజెక్టులు కట్టింది
- తెలంగాణాలో కట్టింది 2 టీఎంసీలకు తగ్గవి కూడా లేవు
- బీఆర్ఎస్‌పై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మండిపాటు

సాక్షి, హైదరాబాద్ :తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏకే 47 తుపాకులతో ఆ రాష్ట్ర పోలీసులను నాగార్జున సాగర్ డ్యాంపైకి పంపినప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చేష్టలుడిగి చూసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కృష్ణా జలాలను ఏపీకి తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వమే సహకరించిందని, కేంద్రం వద్ద ఈ దిశగా సానుకూల సంకేతాలు ఇచ్చిందని మండిపడ్డారు. ఏపీ 12.5 టీఎంసీల నీళ్ల వాడుకునేందుకు ప్రాజెక్టులు కడితే, తెలంగాణలో కనీసం 2 టీఎంసీలు కూడా వాడుకునే పరిస్థితి లేదని, రాష్ట్ర ప్రయోజనాలను కేసీఆర్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని విమర్శించారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు శుక్రవారం రేవంత్ బదులిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు మేడిపండు అయిందని, అన్నారం ఎప్పుడేమి అవుతుందో తెలియదన్నారు. 'కాళేశ్వరం అవినీతిపై మాట్లాడితే, కృష్ణానదిపై ప్రాజెక్టులు అప్పగించారని చెబుతున్నారు. రూ.80 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. లక్షా 47 వేల కోట్ల అంచనాలు వచ్చాయని, రూ.97,500 కోట్లు ఇప్పటికే కాంట్రాక్టర్లకు ఇచ్చారని, ఇంకో రూ.10 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కాళేశ్వరంలో 90 వేల ఎకరాలకు కూడా నీళ్లు అందలేదన్నది వాస్తవం కాదా? దీనిపై విజిలెన్స్ నివేదికలు సభలో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నాం. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ కేంద్రానికి అప్పగించిందనే వాదనలో అర్థం లేదు' అని స్పష్టం చేశారు.

వాళ్ల పులుసు తిని అలుసిచ్చారు..

ఇంటి దొంగల సహకారం లేకుండా ఆంధ్రప్రదేశ్ పోలీసులు తుపాకులు పట్టుకుని సాగర్‌పైకి ఎలా వచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'పహారా కాసే పరిస్థితి వచ్చినా ఎందుకు మాట్లాడలేదు? రాయలసీమకు వెళ్లి మంత్రి రోజా పెట్టిన రాగి సంగటి, రొయ్యల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తా.. అన్నది వాళ్లు (బీఆర్ఎస్) కాదా? వాళ్ల పులుసు తిని అలుసు ఇచ్చింది బీఆర్ఎస్. బేసిన్‌లు లేవు, భేషజాలు లేవు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులు పూర్తవుతుంటే వీళ్లు చేసిందేమిటి? రాజీవ్ గాంధీ టన్నెల్ ప్రాజెక్టులో ఒక్క కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదు. కల్వకుర్తి లిఫ్ట్ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎస్ఎల్‌బీసీ పరిస్థితీ ఇంతే. కృష్ణానది జలాలపై మరణ శాసనం రాసింది బీఆర్ఎస్ సర్కారే. సెంటిమెంట్ రగిలించడానికే కృష్ణానది జలాలను వాడుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణా నది జలాలను 2015లోనే కేంద్రానికి అప్పగించింది. 811 టీఎంసీల నికర జలాలు ఉమ్మడి ఏపీకి కేటాయిస్తే, 512 టీఎంసీలు ఏపీకి ఇవ్వడానికి అధికారికంగా సంతకం పెట్టింది' అని మండిపడ్డారు.

● తిరుపతి నగరంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తిరుపతి డీఎస్పీ సురేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు.

క్లుప్తంగా...

6 లక్షల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం రాత్రికి ఆరు లక్షల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30.65 లక్షల ఇళ్ల పట్టాలను పేదలకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. వాటిని కేటాయించిన వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్లు ఇస్తున్నారు. ఈనెల 2వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రారంభమైన ఈ రిజిస్ట్రేషన్లు శుక్రవారం రాత్రికి 6 లక్షలు దాటాయి. ప్రస్తుతం రోజుకు సుమారు లక్ష రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 65 శాతానికిపైగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. నంద్యాల, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో 55 శాతానికిపైగా రిజిస్ట్రేషన్లను పూర్తి చేశారు. విజయనగరం, పశ్చిమగోదావరి, అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, పల్నాడు, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 45 శాతానికిపైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. మిగిలిన జిల్లాల్లో చాలావరకు 30 శాతానికిపైగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇంకా వేగంగా రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రోజూ అర్ధరాత్రి వరకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సెలవురోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అందుకనుగుణంగా సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల సిబ్బంది శని, ఆదివారాల్లోనూ ఆ పని మీదే ఉన్నారు. మరో 10 రోజుల్లో మొత్తం రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

13న గోదావరి బోర్డు సమావేశం

ప్రాజెక్టుల డీపీఆర్‌ల పరిశీలనే అజెండా

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాలు కొత్తగా చేపట్టిన ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ల పరిశీలన, 2021, జూలై 15న కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలే అజెండాగా ఈనెల 13న గోదావరి బోర్డు సమావేశమవుతోంది. హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో చైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ముఖ్య కార్యదర్శులు, ఈఎన్సీలు పాల్గొంటారు. ఉమ్మడి రాష్ట్ర పరిధిలో గోదావరిలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) చేసిన అధ్యయనం లోపభూయిష్టంగా ఉందని.. ఈ అంశంపై చర్చించేలా అజెండాలో చేర్చాలని ఇప్పటికే రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, బోర్డు చైర్మన్ ఎంకే సిన్హాకు లేఖ రాశారు.

బురదచల్లడమే సోమిరెడ్డి పని: మంత్రి కాకాణి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/సాక్షి, అమరావతి: తన మీద బురద చల్లడమే పనిగా టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలిపోతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. అయితే కంటైనర్ టెర్మినల్‌ను తరలించేది లేదని పోర్టు సీఈవో జీజే రావు ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఈ విషయమై తాను చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలివ్వడాన్ని తట్టుకోలేక సోమిరెడ్డి అబద్ధాలు వల్లిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోర్టు ప్రతినిధులను బ్లాక్‌మెయిల్ చేసేందుకే అఖిలపక్షాన్ని తోడు తెచ్చుకున్నారన్నారు. తనకు సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చినా ఆయన ఇంకా పిచ్చికుక్కలా వాగుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో పోర్టుకు శంకుస్థాపన చేసి పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. అసలు విషయాన్ని పక్కనపెట్టి సోమిరెడ్డి పొలిటికల్ డ్రామా ఆడుతున్నాడని మంత్రి అన్నారు.

స్వామినాథన్‌కు అరుదైన గౌరవం

హరిత విప్లవ పితామహుడు దివంగత ఎంఎస్ స్వామినాథన్‌కు అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వడం.. దేశంలోని ప్రతీ రైతును గౌరవించుకున్నట్టేనని మంత్రి కాకాణి పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చిన వ్యవసాయ విప్లవకారుడు స్వామినాథన్ అని కొనియాడారు.

కాంగ్రెస్‌తోనే అన్ని రంగాల అభివృద్ధి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

తుని/చాగల్లు: రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కోరారు. కాకినాడ జిల్లా తునిలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా ప్రత్యేక హోదా రాలేదని, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయలేదని, రాజధాని లేదని అన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పే చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి, స్వప్రయోజనాల కోసం బీజేపీ పెద్దలచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ మధ్య ట్రయాంగిల్ లవ్‌స్టోరీ నడుస్తోందన్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే రచ్చబండ

తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో రచ్చబండ కార్యక్రమంలో షర్మిల పాల్గొన్నారు. దళితులకు రక్షణ కల్పించలేనప్పుడు హోం మంత్రి రాజీనామా చేసేయాలన్నారు. పథకాలపై మాటతప్పారని, రైతులను ఇబ్బందులకు గురిచేశారని, నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని ప్రభుత్వంపై ఆమె విమర్శించారు.

రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం. సదస్సుకు హాజరైన విద్యార్థులు

- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులు
- విద్యా, వైద్య, పారిశ్రామిక రంగాల్లో ప్రగతి
- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులవల్ల రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. ఓపెన్ మైండ్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యాన 'ప్రభుత్వ పాలనా విధానంలో విప్లవాత్మక మార్పులు–ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి' అనే అంశంపై కాకినాడలోని జేఎన్‌టీయూ(కే)లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, పరిపాలన, భూ సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న చర్యలను గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టలేదన్నారు. రూ.13వేల కోట్లతో చిన్న, పెద్ద పరిశ్రమల ఏర్పాటు వల్ల 10వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. రూ.11,753 కోట్లతో ఆరు ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధిద్వారా రూ.2.272 కోట్ల విదేశీ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు పెరిగాయని చెప్పారు. ఒకే మూసలో 1980కి పూర్వం నుంచి కొనసాగుతున్న ప్రభుత్వ విధానాలను జగన్ సర్కార్ సమూలంగా మార్చిందని తెలిపారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, ఇరిగేషన్ ప్రాజెక్టులు, పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, హైవేలు తదితర రంగాల్లో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించిందని వివరించారు. పెన్షన్ల నుంచి సర్టిఫికెట్ల వరకు పేదలకు అవసరమైన అన్ని సేవలను వారి ఇళ్లకే వెళ్లి ఇవ్వడం ద్వారా దేశవ్యాప్తంగా రికార్డు నెలకొల్పిందన్నారు. డ్రోన్, శాటిలైట్ సర్వేల ద్వారా భూ సమస్యలకు ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. గ్రామీణ స్థాయి నుంచే వైద్యసేవలు అందించేలా విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వంటివి అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు.

నాడు ఎన్‌టీఆర్.. నేడు జగన్..



నాడు ఎన్‌టీ రామారావు హయాంలో సంక్షేమం, పరిపాలనలో మార్పు చూశాం. మళ్లీ ఇప్పుడు వైఎస్ జగన్ పాలనలో గొప్ప సంక్షేమ పథకాలు చూస్తున్నాం. గ్రామ స్థాయి నుంచే ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పిల్లల భవిష్యత్‌కు బంగారుబాట వేశారు.

– కేవీ రమణ, రెక్టార్, జేఎన్‌టీయూకే

తేడాను గుర్తించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలన్నీ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే. ఈ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను ఎంతో అభివృద్ధి చేసింది. ఉచితాలకు, సంక్షేమానికి తేడాను ప్రతి ఒక్కరూ గమనించాలి.

– రాజశేఖరరెడ్డి, అధ్యక్షుడు, ఓపెన్ మైండ్ ఫర్ బెటర్ సొసైటీ

ఉన్నత విద్యకు బాటలు



ప్రభుత్వం అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేయడం ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తోంది. నాలుగేళ్ల డిగ్రీ కోర్సుతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు సైతం అందుబాటులోకి తీసుకురావడం విద్యార్థులకు వరం. ప్రభుత్వ సహకారంతో జేఎన్‌టీయూకేలో రూ.100 కోట్లతో రోడ్లు, భవనాల వంటి పనులు చేపట్టగలిగాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉప కులపతి, జేఎన్‌టీయూకే

విద్యపై ఖర్చు అభివృద్ధే



విద్యపై ఖర్చు చేసే ప్రతి రూపాయి అభివృద్ధి కిందకే వస్తుంది. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్, సీబీఎస్‌ఈ కరిక్యులం వంటివి చూస్తుంటే కార్పొరేట్ తరహాలో ఉన్నాయి. గతంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.35వేలు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేవారు. ఇవాళ ఫీజు మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తోంది.

– నల్లమిల్లి శేషారెడ్డి, చైర్మన్, ఆదిత్య విద్యాసంస్థలు

పేదలకు నాణ్యమైన విద్య



సీఎం వైఎస్ జగన్ ఉన్నత విద్యలో సంస్కరణలు తీసుకువచ్చి విదేశీ వర్సిటీలతో ఒప్పందాలు చేసుకోవడం గొప్ప విషయం. దీనివల్ల పేదలకు నాణ్యమైన విద్యను మరింత చేరువ అవుతుంది. పేదల తలరాతను మార్చేది విద్య ఒక్కటేనని గట్టిగా నమ్మి, దాని అభివృద్ధి కోసం ఖర్చుకు వెనుకాడని సీఎంగా జగన్ నిలిచారు.

– డాక్టర్ మురళీకృష్ణ, డైరెక్టర్, జేఎన్‌టీయూకే

పేదలకు న్యాయం



జగన్ ప్రభుత్వంలో పేదలందరికీ న్యాయం జరుగుతోంది. ఏ కోర్సు అభ్యసించినా పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. నాలాంటి పేద విద్యార్థులం కార్పొరేట్ కళాశాలల్లో చదవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే కారణం. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో మాకు ఎంతో మేలు కలుగుతోంది.

– కె.వసంత, బీసీఏ విద్యార్థిని

పేదవాడికి అండగా..



సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పేదవాడికి అండగా నిలిచింది. గత పాలనకు, ఇప్పటి పాలనకు ఉన్న తేడాను ప్రతి ఒక్కరూ గమనించారు. ముఖ్యంగా చదువుకున్న యువత ఒకసారి ఆలోచించాలి. కేవలం విద్య కోసమే ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టిందో గ్రహించాలి.

– ఎం.విజయరెడ్డి, ప్రెసిడెంట్, రాష్ట్ర డీఈడీ కళాశాలల అసోసియేషన్

రాష్ట్రంలో విద్యా విప్లవం



జగనన్న కాలేజ్ కెప్టెన్స్ విద్యార్థులతో పానుగంటి చైతన్య తదితరులు



విద్యార్థులకు టీషర్ట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, మార్కెట్‌యార్డు చైర్మన్ తదితరులు

- మళ్లీ జగన్ సీఎం కావడం ఖాయం
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య

పులివెందుల టౌన్: రాష్ట్రంలో విద్యా విప్లవం సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రమంతటా విద్యా వెలుగుల వ్యాప్తితోనే సీఎం జగన్ పేదరికానికి స్వస్తి పలకనున్నట్లు వెల్లడించారు. విద్యార్థి విభాగం వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామలక్ష్మణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆధ్వర్యంలో శుక్రవారం పులివెందులలో జగనన్న కాలేజ్ కెప్టెన్స్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన పానుగంటి చైతన్య మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జగనన్న రుణాన్ని కొంతైనా తీర్చుకునేందుకు ఎన్నికల రణరంగంలో ఆయనకు అండగా నిలవాలని విద్యార్థి లోకం యావత్తు సమష్టిగా, స్వచ్ఛందంగా నిర్ణయించుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అనంతరం పలు కళాశాలలకు చెందిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న కాలేజ్ కెప్టెన్స్ విద్యార్థులతో మమేకమై జగనన్న హయాంలో జరిగిన మేలుపై వారిలో అవగాహన పెంచారు. జగనన్న హయాంలో మారిన విద్యారంగ పరిస్థితులను సమగ్రంగా వివరించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన విద్యారంగం నాడు–నేడు కార్యక్రమాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం పులివెందుల మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న కాలేజ్ కెప్టెన్ టీషర్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నేతలు శ్రీకాంత్‌రెడ్డి, సాయి, శివ, మోహన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే 'ఉండి'... రాజుల రగడ!

- తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య ముదిరిన వర్గవిభేదాలు
- పరస్పరం విమర్శలకు దిగుతున్న రామరాజు, శివరామరాజు
- ఒకరికి తండ్రి, మరొకరికి కొడుకుల మద్దతు





మంతెన రామరాజు, వేటుకూరి శివరామరాజు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ తెలుగుదేశంలో వర్గవిభేదాలు తారస్థాయికి చేరాయి. తాజా మాజీ ఎమ్మెల్యేల మధ్య విభేదాలు రోజురోజుకూ ముదురుపాకాన పడుతున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యే మంతెన రామరాజుకు లోకేశ్, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజుకు చంద్రబాబు కొమ్ముకాస్తుండటంతో వారిద్దరి సిగపట్లు పత్రికలకెక్కుతున్నాయి. 2009, 2014 ఎన్నికల్లో వరుసగా రెండు పర్యాయాలు వేటుకూరి శివరామరాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన అనుచరుడుగా గుర్తింపు పొందిన మంతెన రామరాజుకు 2019లో ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. అయితే అనుకోకుండా రాజకీయ సమీకరణాలు మారడంతో శివరామరాజు నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా, రామరాజు ఉండి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఎంపీ అభ్యర్థి ఓడిపోగా, ఆయన శిష్యుడు మాత్రం ఎమ్మెల్యేగా గెలవడంతో రాజకీయ రగడకు బీజం పడింది.

కార్యాలయం సాక్షిగా వర్గపోరు

భీమవరంలోని ఒకే కార్యాలయంలో ఉండే ఈ ఇద్దరు రాజుల మధ్య వర్గపోరు ఇటీవల మరింత తీవ్రమైంది. తనకు ప్రాధాన్యమివ్వకుండా... కార్యక్రమాలకు పిలవకుండా... తనను అసలు పట్టించుకోకుండా మంతెన అవమానిస్తున్నాడని ఆయన్ను కార్యాలయం నుంచి వేటుకూరి ఖాళీ చేయించి పంపేశారు. అదిగో అప్పటినుంచే విభేదాలు బహిర్గతమయ్యాయి. తాజాగా చంద్రబాబు తనకు టికెట్ హామీ ఇచ్చారని వేటుకూరి శివరామరాజు ప్రచారం చేసుకుంటూ నియోజకవర్గంలో తన వర్గంతో కార్యక్రమాలు నిర్వహిస్తుండగా... మంతెన రామరాజు టికెట్ తనకే ఇస్తామని లోకేశ్ హామీ ఇచ్చినట్టు క్యాడర్‌కు చెప్పుకుంటూ ఇటీవలే నియోజకవర్గమంతా కంచాలు పంపిణీ చేశారు.

విమర్శల వివాదం

గత వారం మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు కొన్ని మీడియా ఛానళ్లకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇస్తూ ఎమ్మెల్యే రామరాజుపై విమర్శలు గుప్పించారు. 2019లో నర్సాపురం ఎంపీ అభ్యర్థిగా ఆయనకు అవకాశం ఇవ్వమని చంద్రబాబు వద్దకు తీసుకువెళితే 10వ తరగతి కూడా పాస్ కాని వాడికి ఎంపీ ఏంటి.. అని ఎద్దేవా చేశారనీ, అందువల్ల తాను ఎంపీగా పోటీచేసి, అతనికి ఎమ్మెల్యేగా టికెట్ ఇప్పించి గెలిపించుకున్నాననీ ఇప్పుడు ఆయన విశ్వాసం లేకుండా వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. దీనిపై ఎమ్మెల్యే రామరాజు వర్గం రెచ్చిపోయింది. పార్టీ మండల అధ్యక్షులు, టీడీపీ రాష్ట్ర నాయకులు కొందరు ఉండిలో సమావేశం నిర్వహించి వేటుకూరి నియోజకవర్గానికి ఏం చేశాడు.. బీసీలకు ఏం చేశాడు.. అసలు ఆయన అభ్యర్థే కాదు.. అసలు టికెట్ ఇస్తామని ఆయనకు ఎవరూ చెప్పలేదని ఎదురు దాడి చేయడంతో రగడ తారస్థాయికి చేరింది.

టీడీపీ టికెట్ నాకే...

ఆకివీడు : ఉండి టీడీపీ టికెట్ తనకే వస్తుందని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి బహిరంగంగా ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం తన సేవా సంస్థ తలుపులు తెరిచి నియోజకవర్గంలో తన సత్తా చూపిస్తానని విలేకర్లకు వివరించారు. తనకు చెందిన శివ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను పునరుద్ధరించేందుకు శుక్రవారం శాంతి హోమం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సహకారంతో పోటీ చేయడం తథ్యమని ఘంటాపథంగా చెప్పారు.

విజయపథంలో అక్క చెల్లెమ్మలు

- పొదుపు సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో దేశంలోనే ఏపీ ఫస్ట్
- మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు
- వాటిని సద్వినియోగం చేసుకొంటున్న మహిళలు
- పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న అక్కచెల్లెమ్మలు
- రాష్ట్ర మహిళల విజయగాథలతో సెర్ప్ పుస్తకం
- ఆవిష్కరించిన ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయి. వీటిని సద్వినియోగించుకుంటూ అక్కచెల్లెమ్మలు వారి కాళ్లపై వారు నిలదొక్కుకోవడమే కాకుండా, మరికొందరికి ఉపాధి కూడా చూపిస్తున్నారు. ఇదే క్రమంలో పొదుపు సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా కూడా రూపుదిద్దుకుంటున్నారు. పొదుపు సంఘాల మహిళలు రాష్ట్ర ప్రథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలనూ సద్వినియోగం చేసుకొంటున్నారు. ఇలా పొదుపు సంఘాల మహిళలను హయ్యర్ ఆర్డర్ ఎంటర్‌ప్రెన్యూర్ (ఉన్నతస్థాయి పారిశ్రామికవేత్తలు)గా తీర్చిదిద్దడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2021 – 2023 ఆర్థిక సంవత్సరాల మధ్య 1,126 మంది పేద పొదుపు సంఘాల మహిళలు ఉన్నత స్థాయి పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. వారు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడంతో పాటు పెద్ద సంఖ్యలో తోటి మహిళలకు ఉపాధిని కూడా కల్పిస్తున్నారు. వీరు ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణిస్తున్నారు. ధాన్యాలు, చిరు ధాన్యాలతో కూడిన వివిధ రకాల ఆహార ఉత్పత్తులు, నూనె, బెల్లం తయారీ, పిండిమర, పచ్చళ్ళు, కారం పొడులు తదితర యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. వీరి వివరాలు, విజయగాథలతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) «ఆంధ్రప్రదేశ్ కొత్త తరం మహిళా పారిశ్రామికవేత్తలు» పేరుతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఓ పుస్తకాన్ని ప్రచురించింది. శుక్రవారం ఈ పుస్తకాన్ని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్, ఆర్.వై.ఎస్.ఎస్ సీఈవో విజయ్ కుమార్ ఆవిష్కరించారు. గ్రామాల్లో మహిళా శక్తిని, గ్రామీణాభివృద్ధి రెండూ విడదీయరానివని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చెప్పారు. పేదరికంలో నివసిస్తున్న గ్రామీణ నిరక్ష్యరాస్యులైన సామాన్య మహిళలు తగిన ప్రేరణతో మార్పును తేగలరనే నమ్మకంతోనే సెర్ప్ సంస్థ ప్రారంభమైందని తెలిపారు. మహిళలు నూతన శిఖరాలను అధిరోహించే క్రమం, వారు సాధించిన విజయాలు, ఆర్థికంగా ఎదుగుతున్న వైనాన్ని ఈ పుస్తకంలో ప్రచురించినట్టు సెర్ప్ సీఈవో ఇంతియాజ్ తెలిపారు.

టీడీపీలో వెధవలు ఉన్నారు

తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటయ్య



సభలో మాట్లాడుతున్న తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్ల కోటయ్య

యర్రగొండపాలెం: టీడీపీలో వెధలు ఉన్నారని ఆపార్టీ తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్ల కోటయ్య తీవ్ర విమర్శలు చేశారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం మండల కేంద్రమైన పుల్లల చెరువులో శుక్రవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమం సభలో బహిరంగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం పార్టీలో చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో టీడీపీ నేతలు కొంతకాలంగా రెండు వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు చేసుకుంటున్న నేపథ్యమే ఈ వాఖ్యలకు కారణమన్న వాఖ్యలు వినిపిస్తున్నాయి. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబును రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నే రవీంద్ర వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఆయనకు టికెట్ ఇచ్చినట్లయితే మద్దతు ఇవ్వబోమని అధిష్టానానికి సంకేతాలు కూడా పంపారు. గత నెల 28వ తేదీన పుల్లలచెరువు మండలంలోని చాపలమడుగులో జరిగిన తిరునాళ్ల సందర్భంగా టీడీపీ వర్గీయులు రెండు వర్గాలుగా విడిపోయి రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత రవీంద్ర వర్గం యర్రగొండపాలెం మండలం మురారిపల్లె పంచాయతీలోని వేగినాటి కోటయ్య నగర్‌లో ఈ నెల 7న బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరయ్యారు. అయితే దీనిపై ఎరిక్షన్ బాబుకు సమాచారం ఇవ్వలేదు. కార్యక్రమానికి ముందుగా రవీంద్ర వైద్యశాల నుంచి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో బలప్రదర్శన నిర్వహించారు. దీనికి ప్రతిగా ఎరిక్షన్‌బాబు వర్గీయులు ఎస్సీ కాలనీలను టార్గెట్ చేసుకొని టీడీపీ కార్యకర్తల మెళ్లో మళ్లీ పచ్చకండువాలు కప్పి వైఎస్సార్ సీపీ నుంచి చేరినట్లు వార్తలు రాయించుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కాకర్ల కోటయ్య వ్యాఖ్యలు టీడీపీని నవ్వులపాలు చేశాయని ఆ పార్టీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

బెయిల్‌పై శ్రీనివాస్ విడుదల

ఆరిలోవ (విశాఖజిల్లా): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో అరెస్టు అయి విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న శ్రీనివాస్ శుక్రవారం బెయిల్‌పై విడుదలయ్యాడు. 2018 అక్టోబర్‌లో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో కత్తితో దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో శ్రీనివాస్ విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నాడు. అప్పటి నుంచి శ్రీనివాస్ బెయిల్ కోసం ప్రయత్నం చేస్తూ వచ్చాడు. గురువారం హైకోర్టు శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన తరఫు న్యాయవాది సలీం హైకోర్టు నుంచి బెయిల్ పేపర్లు కేంద్ర కారాగారంలో అధికారులకు అందజేశారు. బెయిల్ పరిశీలించిన జైల్ అధికారులు సాయంత్రం బెయిల్‌పై శ్రీనివాస్‌ను విడుదల చేశారు. దీంతో బయటకు వచ్చిన శ్రీనివాస్‌కు తండ్రి తాతారావు, న్యాయవాది సలీం, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు ఆహ్వానం పలికారు. విదసం ప్రతినిధులు, ముస్లిం నాయకులు, ఎస్సీ సంఘాల నాయకులు శ్రీనివాస్‌కు పూల మాలతో స్వాగతం పలికి స్వీట్లు తినిపించారు. అనంతరం న్యాయవాది సలీం మాట్లాడుతూ బాహ్య ప్రపంచంలో శ్రీనివాస్‌కు ఏదైనా ఆపద తలెత్తితే దాని బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.

టీడీపీ శవ రాజకీయం

- వైఎస్సార్‌సీపీ నేత చంద్రశేఖర్ భౌతికకాయంపై పచ్చజెండా
- మాజీ మంత్రి ఉమా కపట ప్రేమ
- మృతుడి కుటుంబ సభ్యులకు భువనేశ్వరి పరామర్శ
- పార్టీ టికెట్ ఉమాకు ఇవ్వాలని డిమాండ్

కంచికచర్ల: తెలుగుదేశం పార్టీ శవరాజకీయాలకు తెరతీస్తోంది. కాదేదీ ప్రచారానికి అనర్హం అన్నట్టు ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా రాజకీయ లబ్ధి పొందడానికి అశుభ కార్యాలయాలను కూడా ఉపయోగించుకొంటున్నారు. మాజీ మంత్రి దేవినేని వెంకటరమణ తమ్ముడు వైఎస్సార్‌సీపీ నేత దేవినేని చంద్రశేఖర్ (52) అనారోగ్యకారణంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మృతుని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించేందుకు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల విచ్చేశారు. ఈ సమయంలో తమ నాయకుడు ఉమా మంచి వాడని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. దీంతో అక్కడ జరుగుతున్న విషయం అర్థంకాక భువనేశ్వరి కొన్ని నిముషాలు ఖిన్నులయ్యారు. చంద్రశేఖర్ మృతి చెంది రెండు రోజులయినప్పటికీ రాజకీయ రంగు అంటుకోవటం పట్ల కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా శుక్రవారం, అమావాస్య రోజు పరామర్శించే కార్యక్రమం ఏర్పాటు చేయటం పట్ల కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తమ్ముడి మరణాన్ని కూడా ఉమా తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవటం చూస్తుంటే సిగ్గేస్తోందని ప్రజలు అనుకుంటున్నారు.

మృతిచెందే వరకూ వైఎస్సార్‌సీపీలోనే

దశాబ్దం క్రితం దేవినేని చంద్రశేఖర్ వైఎస్సార్‌సీపీలో చేరి మరణించే వరకు పార్టీలో కొనసాగారు. పది రోజుల క్రితం ఆయన బతికి ఉన్న సమయంలోనూ తన సహచరులతో 2024లో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కుర్చీలో కూర్చుంటారని అన్నట్టు అనుచరులు చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో తన అన్న దేవినేని ఉమా మహేశ్వరరావు ఓటమి కోసం మైలవరంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్‌తో కలసి ఎన్నికలలో క్రియాశీలక పాత్ర పోషించారు. అలాంటి నేత భౌతిక కాయానికి గురువారం టీడీపీ జెండా కప్పటం పట్ల ఆయన అభిమానులు, సహచరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం చంద్రశేఖర్ తన పిల్లల నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమానికి ఉమాను ఆహ్వానిస్తే ఆయన వెళ్లలేదు. పక్షం రోజుల క్రింత చంద్రశేఖర్‌ను టీడీపీ నాయకులు టీడీపీలోకి రావాలని ఆహ్వానించగా ఉమా మహేశ్వరరావు ఆ పార్టీలో ఉన్నంతకాలం రానని కరాఖండిగా చెప్పినట్లు సమాచారం. అటువంటి చంద్రశేఖర్ భౌతికకాయంపై ఉమా మహేశ్వరరావు పచ్చ జెండా కప్పటంపై రాజకీయ ప్రయోజనం కాక మరొకటి లేదని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. లేని ప్రేమను తెచ్చుకుని రాజకీయ లబ్ది కోసం ఉమా చేస్తున్న ఉబలాటం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

42 శాతం

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి

సరికొత్త ఫీచర్లు, విస్తరించిన ప్రయోజనాలతో కూడిన కార్డులు ఇస్తున్న ప్రభుత్వం

- 1.43 కోట్లకు గాను 60.43 లక్షల కార్డుల పంపిణీ పూర్తి
- కార్డులు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, ఫొటోలు
- కార్డుతో పాటు సేవల వివరాలతో బ్రోచర్
- నెట్‌వర్క్ ఆస్పత్రులు, అందే సేవలతో కూడిన సిటిజన్ యాప్ అందుబాటులోకి
- లబ్ధిదారుల ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయిస్తున్న సిబ్బంది
- యాప్ ద్వారా త్వరితగతిన సేవలు పొందే అవకాశం

సాక్షి, అమరావతి: ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం సరికొత్త ఆరోగ్య శ్రీ కార్డులను అందిస్తోంది. విస్తరించిన ప్రయోజనాలు, సరికొత్త ఫీచర్‌లతో కూడిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కార్డుల పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా వేగంగా సాగుతోంది. ఇప్పటికే 42 శాతం లబ్ధిదారులకు కార్డులు అందాయి. రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం కలిగిన 1.43 కోట్ల కుటుంబాలు ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తున్నాయి. వీరికి నూతన కార్డుల పంపిణీ డిసెంబరు నెలలో మొదలైంది. ఇప్పటివరకు 60,43,902 కుటుంబాలకు కార్డులను అందజేశారు. అత్యధికంగా పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో 7.16 లక్షల కార్డులు ఉండగా 3.45 లక్షలు, ప్రకాశం జిల్లాలో 6.45 లక్షలకు గాను 2.54 లక్షలు, కాకినాడ జిల్లాలో 4.67లక్షలకు గాను 4.67 లక్షల కార్డుల పంపిణీ పూర్తయింది. కొత్త కార్డులు అందజేయడంతోపాటు పథకం కింద ఉచితంగా పొందే వైద్య సేవలు, వాటిని ఎలా పొందాలో కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రజల ఆరోగ్యానికి అత్యంత కీలకమైన ఈ పథకానికి ఊపిరి లూదారు. మరింత మెరుగ్గా, సమర్థవంతంగా పని చేసేలా తీర్చిదిద్దారు. గతంలో కేవలం తెల్లరేషన్ కార్డుదారులు మాత్రమే పథకం పరిధిలోకి వస్తుండగా, రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న మధ్యతరగతి కుటుంబాలను కూడా పథకం పరిధిలోకి తెచ్చారు. అంతేకాకుండా పథకం కింద రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. వందలాది చికిత్సలను కొత్తగా ఇందులో చేర్చారు. ఈ తరహా ప్రయోజనాలన్నింటితో కూడిన కార్డులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు పంపిణీ చేస్తోంది.

సిటిజన్ యాప్‌పై అవగాహన

కార్డులు పంపిణీ సమయంలోనే ప్రతి కుటుంబానికి పథకం సేవలను సులువుగా ఎలా పొందాలో వివరిస్తూ బ్రోచర్‌ను అందజేస్తున్నారు. పథకం సమగ్ర సమాచారం ఈ బ్రోచర్‌లో ఉంది. ఇది ప్రజలకు ఒక గైడ్‌లా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా లబ్ధిదారుల మొబైల్ ఫోన్‌లలో ఆరోగ్యశ్రీ సిటిజెన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయిస్తున్నారు. అందులో లాగిన్ అయి ఎలా వినియోగించాలో అవగాహన కల్పిస్తున్నారు. వైద్య సేవలు, రాష్ట్రంలో, రాష్ట్రం వెలుపల ఉండే నెట్‌వర్క్ ఆస్పత్రులు, వాటిల్లో ఏ ప్రొసీజర్స్‌కు వైద్యం చేస్తారనే సమాచారాన్ని యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. తాముంటున్న ప్రాంతానికి చేరువలో ఏ ఆస్పత్రి ఉందో కూడా తెలుసుకోవచ్చు. అక్కడకు చేరుకోవడానికి జీపీఆర్ఎస్ సౌకర్యం కూడా ఉంది. ఇక గతంలో పథకం ద్వారా పొందిన చికిత్సలు, రిపోర్ట్‌లను ఒక్క క్లిక్‌తో పొందడానికి వీలుంటుంది.



కార్డులో ఉండేవివీ..

- కుటుంబ యజమాని పేరు, జిల్లా, మండలం, గ్రామ/వార్డు సచివాలయం వివరాలు
- కుటుంబ సభ్యుల ఫోటోలు, వారి పేర్లు, ఇతర వివరాలు
- యూనిక్ హెల్త్ ఐడెంటిటి నంబర్ (యూహెచ్‌ఐడీ)
- క్యూఆర్ కోడ్ (వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లినప్పుడు ఆరోగ్యమిత్ర, వైద్యులు సులువుగా కేస్ రిజిస్ట్రేషన్ చేయడానికి క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుంది.
- దీనివల్ల మరింత వేగంగా, సులభంగా వైద్య సేవలు అందుతాయి)

11న 'శరత్‌చంద్ర' స్కాలర్‌షిప్ పరీక్ష

- అత్యుత్తమ మార్కులు సాధిస్తే ఉచిత శిక్షణ

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పదో తరగతి తర్వాత ఇంజనీరింగ్, మెడిసిన్ మాత్రమే కాకుండా మరెన్నో అవకాశాలు ఉన్నాయని శరత్ చంద్ర ఐఏఎస్–ఐఐటీ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకునే వారి కోసం ఈ నెల 11న స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇంటర్‌తో పాటు ఐఐటీ–జేఈఈ, లా కోసం క్లాట్, సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాల కోసం సీయూఈటీ, ఐఐఎంల్లో ఐపీఎంఏటీ, రక్షణ రంగంలోకి వెళ్లడానికి ఎన్డీఏ, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇంటర్ నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ వరకు తమ కళాశాలలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 11న స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ఉచిత శిక్షణతో పాటు కోర్సులో ఫీజు రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వారు 9494188688ను సంప్రదించవచ్చని తెలిపారు.

కోర్టు ముందు హాజరుకండి

- ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని ప్రభుత్వ భవనాలు, రహదారులను నిర్మించిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు వ్యవహారంలో తమ ఆదేశాలు పాటించలేదని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్‌పై హైకోర్టు ఒకింత ఆగ్రహం వ్యక్తంచేసింది. తదుపరి విచారణకు తప్పనిసరిగా కోర్టు ముందు హాజరు కావాలని ఆయన్ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని ప్రభుత్వ భవనాలు, రహదారులను నిర్మించిన తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ పలువురు కాంట్రాక్టర్లు గత ఏడాది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు మూడు నెలల్లో వారికి బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలను అమలు చేయడం లేదంటూ అధికారులపై కాంట్రాక్టర్లు కోర్టు ధిక్కార వ్యాజ్యా లు దాఖలుచేశారు. వీటిపై విచారణ జరిపిన జస్టిస్ సుజాత... ఈ నెల 9వ తేదీలోపు వారికి చెల్లించాల్సిన బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో స్వయంగా కోర్టు ముందు హాజరు కావాలని ఎస్ఎస్ రావత్‌ను ఆదేశించారు. ఈ ధిక్కరణ వ్యాజ్యాలు శుక్రవారం మరోసారి విచారణకు రాగా, పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదన్నారు. రావత్ కోర్టు ముందు హాజరు కూడా కాలేదని తెలిపారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణకు తప్పనిసరిగా కోర్టు ముందు హాజరుకావాలని రావత్‌ను ఆదేశిస్తూ ఫాం–1 నోటీసు జారీచేశారు. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

ఘనంగా మేరీమాత ఉత్సవాలు ప్రారంభం



గురువులతో విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రం విజయవాడ గుణదలలోని మేరీమాత ఆలయంలో ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధానాలయం దిగువన ఉన్న బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కతోలిక గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను లాంఛన ప్రాయంగా ప్రారంభించారు. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ.. భక్తుల పాలిట కల్పతరువుగా మేరీమాత కొలువుదీరిందన్నారు. దేవుని రక్షణ ప్రణాళికలో భాగంగా లోక రక్షకుడైన క్రీస్తును ఈ లోకానికి అందించి లోకమాతగా కీర్తించబడిన మరియతల్లిని ఆశ్రయించిన భక్తుల జీవితాలు దీవెనకరంగా ఉంటాయని తెలిపారు. గుణదల పుణ్యక్షేత్రం స్థాపించబడి నూరు వసంతాలు పూర్తి కావడం హర్షణీయమన్నారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు హాజరై భక్తులు మరియమాత ఆశీర్వాదాలు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ సునీల్ రాజు, ఫాదర్ పసల థామస్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల తొలిరోజున యాత్రికులు పెద్ద సంఖ్యలో పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు.

నారాయణ వైద్య కళాశాలలో డ్రగ్స్ అధికారుల సోదాలు

నిషేధిత మందులు విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణకు చెందిన నారాయణ వైద్య కళాశాలలో ఔషధ నియంత్రణ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశా రు. నెల్లూరు నగరం చింతారెడ్డిపాలెంలోని ఈ వైద్య కళాశాలలో నిషేధిత మందుల విక్రయాలు జరుపుతున్నట్లు అందిన సమాచా రం మేరకు పోలీసు బలగాలతో కలిసి అధికారులు తనిఖీలు జరిపారు. ఔషధ నియంత్రణ శాఖ ఐజీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ సోదాలు జరిగాయి. కళాశాల భవనం, అక్కడి కి వచ్చిన వాహనాలను తనిఖీ చేశారు. నారాయణ మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో మేనేజరు శ్రీనివాసులు, నారాయణ భార్య రమాదేవి అనుమతి తీసుకుని డ్రగ్స్ అధికారులు వైద్య కళాశాల, డెంటల్ కళాశాలకు మధ్యలో ఉన్న డూప్లెక్స్ భవనంలో సోదాలు జరిపారు. భవనం పై అంతస్తులో తనిఖీ చేసేందుకు వీలు లేకుండా తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. తాళం తీయాలని అధికారులు కోరగా, తాళం తమ వద్ద లేదని అక్కడున్న వారు చెప్పారు. దీంతో కార్పెంటర్‌ను పిలిపించి తాళం తీశారు. ఔషధ నియంత్రణ అధికారులు ఆ అంతస్తులోని గదులు, కప్‌బోర్డులు అన్నింటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సోదాలలో ఔషధ నియంత్రణ శాఖ ఏడీ వీరశివారెడ్డి, నెల్లూరు, కావలి, గుంటూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కీర్తి పవిత్ర, వెంకటకృష్ణ, విజయ భాస్కర్‌తో పాటు వీఆర్‌వోలు సుబ్రహ్మణ్యం, దేవదానం, రమేష్ పాల్గొన్నారు.

మత్తు మందులున్నట్లు ఫిర్యాదులు

2016లో నారాయణ వైద్యకళాశాలలో పనిచేసే ఓ వైద్యుడు స్వయంగా మత్తు ఇంజక్షన్ చేసుకుని మృతి చెందారు. అంతేకాకుండా కళాశాలలో వైద్య విద్యనభ్యసిస్తున్న కొందరు విద్యార్థులు మత్తు మందులు వాడుతూ వాటికి బానిసలవుతున్నారని తల్లితండ్రులు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వర్సిటీలు..ఆధునిక విద్యాభాండాగారాలు

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/ఒంగోలు: నేటి విశ్వవిద్యాలయాలు ఆధునిక విద్యాభాండాగారాలని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఆంధ్ర కేసరి వర్సిటీలో 3 రోజులపాటు జరగనున్న జాతీయ సెమినార్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వీసీ మారెడ్డి అంజిరెడ్డి సేవలను ప్రశంసించారు. వీసీ మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ వర్సిటీ పరిధిలో 229 కాలేజీలు ఉన్నాయని, మరో 45 రోజుల్లో ఏకేయూ పరిపాలనా భవనం పేర్నమిట్ట క్యాంపస్‌కు తరలించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ ప్రత్యేకంగా మంజూరు చేసిన నిధుల ద్వారా పేర్నమిట్ట క్యాంపస్ వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మారెడ్డి అంజిరెడ్డి వీసీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం అంజిరెడ్డిని హేమచంద్రారెడ్డి సత్కరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, మనసు ఫౌండేషన్ నిర్వాహకులు మన్నం వెంకటరాయుడు, మైసూర్‌కు చెందిన బి.రామచంద్రారెడ్డితోపాటు పలువురు వక్తలు ప్రసంగించారు. 48వ ఈఎస్ఐ, 42వ పీఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభమైన తొలి రోజు సమావేశానికి 15 రాష్ట్రాలకు చెందిన 85 మంది డెలిగేట్లు హాజరయ్యారు.

న్యాక్ రీ–అక్రెడిటేషన్ దిశగా దృష్టి పెట్టాలి

ఉన్నత విద్యా సంస్థలు న్యాక్ రీ–అక్రెడిటేషన్ దిశగా దృష్టి సారించాలని హేమచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని నిర్మలా కాలేజీలో 'న్యాక్ రీ–అక్రెడిటేషన్, ఇష్యూస్, చాలెంజస్'పై జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యా సంస్థ అత్యుత్తమ విద్యను అందించే వాతావరణాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. న్యాక్ గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసిన నేపథ్యంలో కొత్త విధానంలో గుర్తింపు సాధించడంలో అవసరమైన సహాయాన్ని ఉన్నత విద్యా మండలిలోని క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ద్వారా అందిస్తామన్నారు.



ఒంగోలులో మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

వివాహితలు 500 గ్రాముల బంగారం కలిగి ఉండొచ్చు

సాక్షి, అమరావతి: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో బంగారు ఆభరణాల తనిఖీ, స్వాధీనం విషయంలో ఆదాయపన్ను శాఖ స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఎన్నికల తనిఖీల్లో భాగంగా పెళ్లయిన మహిళలు 500 గ్రాములు, పెళ్లికాని మహిళలు 250 గ్రాములు, పురుషులు 100 గ్రాములు బంగారం కలిగి ఉండవచ్చని స్పష్టం చేసింది. ఈ పరిమితిలోపు ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకోకూడదని వెల్లడించింది. ఆ పరిమితి దాటితేనే స్వాధీనం చేసుకోవాలని తెలిపింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పోలీసులు 250 గ్రాముల బంగారం కలిగి ఉన్నా స్వాధీనం చేసుకుంటున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో విజయవాడ ఆదాయపన్ను శాఖ అడిషనల్ డైరెక్టర్, ఎన్నికల నోడల్ ఆఫీసర్ కె.వినోద్ కన్నన్ స్పందించారు. ఆయన పోలీసులకు అవగాహన కల్పిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీని ఆక్వాహబ్‌గా తీర్చిదిద్దిన ప్రభుత్వం

- జగన్ సీఎంగా ఉన్నందునే కోవిడ్ సమయంలో ఆక్వా బతికింది
- ఆక్వారైతుల సదస్సులో మంత్రి సీదిరి

నరసాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీని ఆక్వాహబ్‌గా తీర్చిదిద్దినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఏర్పాటైన ఫిషరీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మొదటిసారిగా మెగా ఆక్వామేళా పేరుతో శుక్రవారం పట్టణంలో ఆక్వారైతుల వర్క్‌షాప్ నిర్వహించారు. గోదావరి జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్న ఈ సదస్సును ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలసి మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆక్వాసాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా చెరువులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్‌ను సబ్సిడీపై ఇస్తున్నారని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.720 కోట్లు చెల్లిస్తోందన్నారు. కోవిడ్ సమయంలో ఆక్వారంగం సంక్షోభంలోకి వెళ్లకుండా మన రాష్ట్రం నుంచి ఎగుమతులు సవ్యంగా సాగేలా, రేటు పతనం కాకుండా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని వివరించారు. జగన్ ముఖ్యమంత్రిగా లేకుంటే కోవిడ్ సమయంలో ఆక్వారంగం కుదేలయ్యేదని వివరించారు. ఆక్వా ఎగుమతుల్లో దేశంలో మొదటిస్థానంలో ఏపీ ఉందంటే సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలే కారణమని చెప్పారు. ప్రస్తుతం 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే నినాదంతో పాటుగా 'ఆక్వా నీడ్స్ జగన్' అనే నినాదం కూడా వినిపిస్తోందని తెలిపారు. ప్రతిపక్షాల వారు, ముఖ్యంగా చంద్రబాబునాయుడు జగన్ వచ్చిన తరువాత ఆక్వారైతులు కష్టపడుతున్నారని మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆక్వారంగానికి పైసా ఖర్చుచేయలేదని తెలిపారు. ఈ విషయమై టీడీపీ నాయకులను నిలదీయాలని ఆయన ఆక్వా రైతులకు సూచించారు.



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

దేశంలో మూడోదిగా ఫిషరీస్ యూనివర్సిటీ

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ తమిళనాడు, కేరళల్లో మాత్రమే ప్రస్తుతం ఫిషరీస్ యూనివర్సిటీలున్నాయని, మూడోదిగా నరసాపురంలో ఫిషరీస్ విశ్వవిద్యాలయం సుమారు రూ.350 కోట్లతో ఏర్పాటైందని చెప్పారు. పనులు కొనసాగుతున్నాయని, ఈ విద్యాసంవత్సరం తుపాన్ షెల్టర్ భవనంలో తరగతులు కొనసాగిస్తున్నామని తెలిపారు. బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, ఫిషరీస్ యూనివర్సిటీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ముందుచూపుతో ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేయించారని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఏర్పాటుచేసిన స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాలాజీ, వన్నెకుల కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, జిల్లా చేపలసాగు రైతుల సంఘం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, రొయ్యల సాగు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ రాజు, ఫిషరీస్ యూనివర్సిటీ డీన్ రవీంద్రకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నీరజ పాల్గొన్నారు.

ఓటుకు కోట్లు కేసు.. సీఎం రేవంత్‌కు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున, కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలుకు ఆదేశించింది. బీఆర్ఎస్ మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ల తరఫున అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ పి.మోహిత్‌రావు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఓటుకు కోట్లు.. సంబంధిత కేసులను తెలంగాణలోని ఏసీబీ కోర్టు విచారణ జరుపుతోందని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నందున, హోం శాఖ కూడా ఆయన వద్దే ఉన్నందున రాష్ట్రంలో న్యాయపరమైన విచారణ సాధ్యం కాదని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ లేదా ఛత్తీస్‌గఢ్‌లోని తత్సమాన కోర్టుకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. తెలంగాణలో 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అనుకూలంగా ఓటు వేసేందుకు గాను నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్‌రెడ్డి రూ.కోట్లు లంచం ఆశ చూపి అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇవ్వజూపారనేది ప్రధాన ఆరోపణ అని తెలిపారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్ల జాబితా విడుదల

సాక్షి, అమరావతి: ఏపీ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ శుక్రవారం ప్రకటించింది. సీబీటీ విధానంలో గతేడాది సెప్టెంబర్ 27, అక్టోబర్ 3వ తేదీల్లో పరీక్షలు నిర్వహించింది. అనంతరం ధ్రువప త్రాల పరిశీలన పూర్తి చేసి తాజాగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

16న అరసవల్లిలో రథసప్తమి వేడుకలు

అరసవల్లి: ప్రముఖ ఆదిత్య క్షేత్రం అరసవల్లిలో ఈనెల 16న రథసప్తమి మహోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఆలయంలో శుక్రవారం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి 12.20 గంటలకు (16వ తేదీ) స్వామి వారికి నిత్యార్చన, అనంతరం ఒంటిగంట నుంచి మూలవిరాట్టుకు శేషవస్త్రాల సమర్పణ, తర్వాత పంచామృతాలతో అభిషేక సేవ ప్రారంభమై ఉదయం 7 గంటల వరకు జరుగుతుందని వివరించారు. అనంతరం నిజరూపదర్శనం సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అలంకరణ, ఏకాంత, పవళింపు సేవలతో ఉత్సవం ముగుస్తుందని వివరించారు.

భూగర్భంలో భుగభుగలు

పరవళ్లు తొక్కుతున్న లావా రాశి ● ఐస్‌లాండ్‌లో భయపెడుతున్న అగ్నిపర్వతం ● 800 ఏళ్ల తర్వాత ఒళ్లు విరుచుకుంటున్న వైనం

అనగనగా ఒక చిన్న పల్లెపట్టు. అంతా సజావుగా సాగిపోతున్న వేళ. ఉన్నట్టుండి ఎటు చూస్తే అటు భూమిపై పగుళ్లు. చూస్తుండగానే అందులోంచి ఫౌంటేన్‌లా విరజిమ్ముతూ లావా ప్రవాహాలు. బిక్కచచ్చిపోయి కకావికలమవుతున్న జనం. ఏదో హాలీవుడ్ సినిమాలా ఉంది కదూ! ఐస్‌లాండ్‌లో పశ్చిమ రెగ్జానెస్ ద్వీపకల్పంలోని గ్రెంతావిక్ అనే బుల్లి బెస్త గ్రామం, దాని పరిసర ప్రాంతాలు ఇప్పుడు అచ్చం అలాంటి భయానక పరిస్థితినే ఎదుర్కొంటున్నాయి. అక్కడ భూగర్భంలో 800 ఏళ్లుగా నిద్రాణంగా ఉన్న అపారమైన లావా రాశి కొన్నాళ్లుగా ఒళ్లు విరుచుకుంటోంది. భారీ ప్రవాహంగా మారి భయపెడుతోంది...!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఐస్‌లాండ్ అగ్నిపర్వతాలకు పెట్టింది పేరు. అక్కడి రెగ్జానెస్ ద్వీపకల్పమైతే అందమైన అగ్నిపర్వతాలకు నిలయం. పెద్ద టూరిస్టు స్పాట్ కూడా. గత 800 ఏళ్లలో ఈ ప్రాంతంలో ఒక్క అగ్నిపర్వతం కూడా బద్దలవలేదు. అలాంటిది గతేడాది నుంచి ఇక్కడ పరిస్థితులు మారుతున్నాయి. కొద్ది రోజులుగా భయానక స్థాయికి చేరాయి. ముఖ్యంగా గ్రెంతావిక్, పరిసర ప్రాంతాల్లో గత నెల రోజుల్లోపే ఏకంగా మూడుసార్లు అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. లావా ప్రవాహాలు ఉవ్వెత్తున ఎగజిమ్మి భయభ్రాంతులను చేశాయి. దాంతో ఆ ప్రాంతాలవారిని ఖాళీ చేయించాల్సి వచ్చింది. ఇదంతా టీజర్ మాత్రమేనని అసలు ముప్పు ముందుందని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. గ్రెంతావిక్ కింద భూగర్భంలో మాగ్మా (శిలాద్రవం) పూర్తిగా కరిగి అపార లావా ప్రవహంగా మారిందని తేల్చారు! దాని పరిమాణం రికార్డు స్థాయిలో ఏకంగా 65 లక్షల క్యూబిక్ మీటర్లని లెక్కగట్టారు! అంతేకాదు, ఈ లావా భూగర్భంలో ఏకంగా సెకనుకు 7,400 క్యూబిక్ మీటర్ల వేగంతో ప్రవహిస్తోందట. ఇది డాన్యూబ్ వంటి భారీ నదుల ప్రవాహ వేగం కంటే కూడా చాలా ఎక్కువ. 2021–23 మధ్య ఇక్కడ భూగర్భంలో నమోదైన లావా ప్రవాహ రేటు కంటే ఇది 100 రెట్లు ఎక్కువని అధ్యయన సారథి యూనివర్సిటీ ఆఫ్ ఐస్‌లాండ్‌లోని నోర్డిక్ వోల్కెనోలాజికల్ సెంటర్‌కు చెందిన ప్రొఫెసర్ ఫ్రెస్టెనిస్ సిగ్మండ్సన్ లెక్కగట్టారు. ఈ లావా ప్రవాహం ఉజ్జాయింపుగా 15 కిలోమీటర్ల పొడవు, నాలుగు కిలోమీటర్ల ఎత్తు, కేవలం కొన్ని మీటర్ల వెడల్పున్నట్టు తేల్చారు. ఈ గణాంకాలు, హెచ్చరికలతో కూడిన అధ్యయనం జర్నల్‌సైన్స్‌లో గురువారం ప్రచురితమైంది. అందుకు కేవలం కొన్ని గంటల ముందే ఆ ప్రాంతమంతటా అగ్నిపర్వతం బద్దలవడంతో పాటు భూగర్భం నుంచి కూడా లావా ఎగజిమ్మిన ఉదంతాలు నమోదయ్యాయి! ఇలా జరగడం గత రెండు నెలల్లో మూడో సారి. గతేడాది డిసెంబర్ 18 నుంచి ఈ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు లావా ఎగజిమ్మింది. మళ్లీ ఈ ఏడాది జనవరి 14న కూడా రెండుసార్లు లావా పెల్లుబికింది. దాంతో ప్రభుత్వం హుటాహుటిన రంగంలోకి దిగింది. ఈ ద్వీపకల్పమంతటా ఎమర్జెన్సీ ప్రకటించింది.



బ్లూ లగూన్ రిసార్టు ప్రాంతం దిశగా రోడ్డుపై లావా ప్రవాహం

భవిష్యత్తుపై ఆందోళన

తాజా పరిస్థితుల నేపథ్యంలో రెగ్జానెస్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కొద్ది రోజులుగా గ్రెంతావిక్‌తో పాటు ఇక్కడి పలు ఆవాస ప్రాంతాల్లో భూగర్భంపై ఒత్తిడి తీవ్రతరమవుతున్న సూచనలు ప్రస్ఫుటమవుతున్నాయి. భూమిలోంచి లావా ప్రవాహాలు ఎగజిమ్ముతుండటమే గాక ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద పగుళ్లు కనిపిస్తున్నాయి. భారీ సంఖ్యలో భూప్రకంపనలూ నమోదవుతున్నాయి. ఒక పెద్ద క్రీడా మైదానంలో సగానికి పైగా భారీ పగులు ఏర్పడటం వణికిస్తోంది. ప్రస్తుతానికైతే మొత్తం ద్వీపకల్పం భవిష్యత్తు పైనే నీలినీడలు కమ్ముకున్నాయని ప్రొఫెసర్ సిగ్మండ్సన్ ఆవేదనగా చెబుతున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ లావా ప్రవాహం మరింతగా పెరిగేలా ఉందని కూడా ఆయన హెచ్చరించారు.

అగ్నిపర్వతాల పుట్టిల్లు

ప్రపంచంలోకెల్లా అత్యధిక సంఖ్యలో చురుకైన అగ్నిపర్వతాలు ఉన్న దేశంగా ఐస్‌లాండ్‌కు పేరుంది. అందుకే దాన్ని లాండ్ ఆఫ్ ఫైర్ అండ్ ఐస్ అని చమత్కరిస్తుంటారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30కి పైగా అగ్నిపర్వతాలు చురుగ్గా ఉన్నాయి. ఇవి భారీ పర్యాటక ఆకర్షణలు కూడా. వీటిని చూసేందుకు ఏటా విదేశీయులు వస్తుంటారు. ఐస్‌లాండ్ మిడ్ అట్లాంటిక్ రిడ్జ్ ప్రాంతంలో ఉండటమే అక్కడ ఇన్ని అగ్నిపర్వాతల పుట్టుకకు ప్రధాన కారణమన్నది సైంటిస్టుల అభిప్రాయం.

ఎన్డీఏలోకి ఆరెల్డీ

● తాతకు భారతరత్నతో కేంద్రం నా మనసు గెలుచుకుంది
● చరణ్‌సింగ్ మనవడు, ఆరెల్డీ చీఫ్ జయంత్ వ్యాఖ్యలు

లఖ్‌నవూ: చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడం ద్వారా నరేంద్ర మోదీ సర్కారు తన మనసు గెలుచుకుందని ఆయన మనవడు, ఇండియా కూటమి భాగస్వామి రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆరెల్డీ) అధ్యక్షుడు జయంత్‌సింగ్ అన్నారు. 'దిల్ జీత్ లియా (మనసు గెలుచుకుంది)' అంటూ శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ తర్వాత కొద్ది గంటలకే వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం ఉత్తరప్రదేశ్‌లో బీజేపీతో పొత్తు పెట్టుకుంటున్నట్టు మీడియాకు వెల్లడించారు. ''మా తాతయ్యకు భారతరత్న ప్రకటించారు. ఎన్డీఏలో చేరాలన్న బీజేపీ ఆహ్వానాన్ని నేనెలా తిరస్కరించగలను?'' అన్నారు. ''ప్రధాని మోదీ ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్నారు. మన దేశ స్వభావాన్ని, మౌలిక భావోద్వేగాలను తాను బాగా అర్థం చేసుకున్నానని నిరూపించుకున్నారు. కనుక సీట్లు, ఓట్ల చర్చ ఇప్పుడిక అప్రస్తుతం'' అని జయంత్ స్పష్టం చేశారు. సర్దుబాటులో భాగంగా యూపీలో భాగ్‌పత్, బిజ్నోర్ లోక్‌సభ స్థానాలు ఆరెల్డీకి దక్కుతాయి. అలాగే ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా బీజేపీ వాగ్దానం చేసినట్టు చెబుతున్నారు. ఉత్తర యూపీలో ఆరెల్డీకి చెప్పుకోదగ్గ పట్టుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ ఓడిన 16 స్థానాల్లో ఏడు అక్కడే ఉన్నాయి. జయంత్ నిర్ణయంతో యూపీలో సమాజ్‌వాదీ పార్టీకి షాక్ తగిలింది.



దేశంలో 96.88 కోట్ల ఓటర్లు

న్యూఢిల్లీ: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి 96.88 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓటర్ల జాబితాలో 18–29 ఏళ్ల యువ ఓటర్లు రెండు కోట్ల మందికిపైగా ఉన్నారు. గత లోక్‌సభ ఎన్నికల జరిగిన 2019 ఏడాది నుంచి చూస్తే ఓటర్ల సంఖ్య ఆరు శాతం పెరిగిందని ఈసీ పేర్కొంది. ఓటర్లలో లింగనిష్పత్తిని పరిశీలిస్తే 2023 ఏడాదిలో ప్రతి వేయి మంది పురుషులకు 940 మంది స్త్రీలు ఉండగా 2024 ఏడాదిలో ప్రతి వేయి మంది పురుషులకు 948 మంది స్త్రీలు ఉన్నారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత సాధించే ప్రక్రియలో భాగంగా సవరించిన జాబితాను బహిర్గతంచేస్తున్నట్లు ఈసీ స్పష్టంచేసింది. మొత్తంగా 2.63 కోట్లకుపైగా ఉన్న కొత్త ఓటర్లలో1.22 కోట్లమంది పురుషులు కాగా 1.141 కోట్ల మంది స్త్రీలు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లసంఖ్య ఏకంగా 1.85 కోట్లు ఉండటం విశేషం. ఇందులో శతాధిక ఓటర్లు ఏకంగా 2.38 లక్షల మంది ఉన్నారు. ఫిబ్రవరి 8నాటి తాజా గణాంకాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 15.3 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. లక్షద్వీప్‌లో కనిష్టంగా కేవలం 57వేల మంది ఓటర్లు ఉన్నారు. తొలిసారిగా 1951వ సంవత్సరంలో ఎన్నికల వేళ 17.32 కోట్ల మంది ఓటర్లుగానమోదుచేయించుకున్నారు. 1957లో ఈ సంఖ్య 19 కోట్లు దాటింది. తొలి సార్వత్రిక ఎన్నికల్లో 45 శాతం పోలింగ్ నమోదైంది.

మరో ప్రైమరీలో ట్రంప్ గెలుపు



లాస్‌వెగాస్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ ప్రైమరీ ఎన్నికల్లో దూసుకుపోతున్నారు. మరో రాష్ట్రంలో గెలుపు సొంతం చేసుకున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడడానికి ట్రంప్ అవకాశాలు మెరుగవుతున్నాయి. గురువారం నెవడా రాష్ట్రంలో జరిగిన ప్రైమరీ ఎన్నికలో ఆయన విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీ పడుతున్న మరో నేత నిక్కీ హేలీ ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు. నెవడాలోని మొత్తం 26 మంది డెలిగేట్లు ట్రంప్‌నకు మద్దతు ప్రకటించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలవాలంటే మొత్తం 1,215 మంది డెలిగేట్ల మద్దతు అవసరం. ఇప్పటిదాకా ట్రంప్ 62 మంది, నిక్కీ హేలీ 17 మంది డెలిగేట్ల మద్దతు కూడగట్టారు.

ప్రత్యేక కోర్టులో రబ్డీదేవికి ఊరట

న్యూఢిల్లీ: రైల్వే శాఖలో ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో బిహార్ మాజీ సీఎం రబ్డీ దేవి, ఆమె ఇద్దరు కుమార్తెలు మిసా భారతి, హేమా యాదవ్‌లకు ప్రత్యేక కోర్టు ఈ నెల 28వ తేదీ వరకు మధ్యంతర బెయిలిచ్చింది. రెగ్యులర్ బెయిల్ కోసం వీరు పెట్టుకున్న పిటిషన్‌పై స్పందన తెలపాలంటూ ఈడీని ఆదేశిస్తూ స్పెషల్ జడ్జి విశాల్ గొగ్నె తీర్పు వెలువరించారు. కేసు దర్యాప్తు సమయంలో నిందితులను అరెస్ట్ చేయకుండా ఇప్పుడు కస్టడీకి కోరడమెందుకని జడ్జి ఈ సందర్భంగా ఈడీని ప్రశ్నించారు.

యూపీఏపై నిర్మల నిప్పులు

నాటి ప్రభుత్వాలు దేశార్థికాన్ని దీనావస్థలోకి నెట్టాయి ● శ్వేతపత్రంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో నిర్మల వ్యాఖ్య

న్యూఢిల్లీ: యూపీఏ హయాంలో ఒక్క కుటుంబానికే ప్రాధాన్యమిచ్చి, దేశ ఆర్థిక పరిస్థితిని దయనీయ స్థితికి దిగజార్చారంటూ కాంగ్రెస్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దుమ్మెత్తిపోశారు. ''దేశ ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం, భారతీయులపై దాని ప్రభావం' అంశంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. ''మోదీ ప్రభుత్వానికి దేశమే తొలి ప్రాధాన్యం. యూపీఏకు మాత్రం ఆ ఒక్క (గాంధీ) కుటుంబమే ముఖ్యం. 2008లో దేశం ఆర్థికమాంద్యం కోరల్లో చిక్కుకుంటే జాతి ప్రయోజనాల పరిరక్షణకు యూపీఏ ప్రభుత్వాలు ముందుకు రాలేదు. ఆర్థిక వ్యవస్థను కాపాడే ప్రయత్నాలు చేయకపోగా కాంగ్రెస్ చేతులెత్తేసింది. పలు స్కామ్‌లతో దేశార్థికాన్ని దీనావస్థలోకి నెట్టి 2014లో నిష్క్రమించారు. వాళ్లు అధికారంలో కొనసాగితే ఇంకెన్ని దారుణాలు జరిగేవో దేవుడికే తెలుసు. సోనియా గాంధీ సూపర్ పీఎంగా ఉండటం వల్లే యూపీఏ హయాంలో ఆర్థికవ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండేది. వాళ్లిప్పుడు మాకు సంక్షోభాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తున్నారా?'' అంటూ ఆగ్రహించారు. కోవిడ్ సంక్షోభంలో మోదీ సర్కార్ ఎంతటి సమర్థతతో, అంకిత భావంతో పనిచేసిందో, పరిస్థితిని చక్కదిద్దిందో అంతా చూశారన్నారు.

వరుస కుంభకోణాలు

''బొగ్గు కుంభకోణం కారణంగా దేశం రూ.1.86 లక్షల కోట్ల ఆదాయం కోల్పోయిందని కాగ్ ఆక్షేపించింది. సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వాన్ని తలంటి ఏకంగా 214 బొగ్గు బ్లాకుల లైసెన్స్‌ను రద్దుచేసింది. కోల్‌స్కామ్ ధాటికి చివరకు చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. బొగ్గు కొరత ఏర్పడింది. విద్యుదుత్పత్తి తగ్గింది. మొత్తంగా పెట్టుబడులూ దెబ్బతిన్నాయి. అదే మోదీ ప్రభుత్వ పాలనలో పారదర్శకంగా బొగ్గు బ్లాకుల వేలం జరిగింది. వాళ్లు బొగ్గును బూడిదగా మార్చారు. మా మోదీ సర్కార్ లాభసాటి విధానాలతో బొగ్గును వజ్రాల వ్యాపారమంత విలువైనదిగా మార్చింది'' అన్నారు.

నాడు పరువు పోతే నేడు ప్రతిష్ట పెరిగింది

''యూపీఏ హయాంలో కామన్వెల్త్ క్రీడల కుంభకోణంతో దేశం పరువు పోయింది. ఇప్పుడు ప్రతిష్టాత్మక జీ20 శిఖరాగ్ర సదస్సును ఔరా అనిపించేలా నిర్వహించి దేశ ప్రతిష్టను అంతర్జాతీయంగా పెంచాం. బ్యాంకింగ్ రంగమంటే మాకు గౌరవం. కానీ యూపీఏ హయంలో ప్రభుత్వ పెద్దలు తాము చెప్పిన వారికి రుణాలొచ్చేలా చేసి మొండిబకాయిలు పెరగడానికి కారకులయ్యారు. మోదీ హయాంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండి బకాయిలు 3.2 శాతానికి దిగొచ్చాయి'' అన్నారు. యూపీఏ పాలనపై బురదజల్లుతున్నారంటూ నిర్మల ప్రసంగానికి విపక్ష సభ్యులు అడ్డుతగిలారు.

అమెరికా అధ్యక్షురాలిగా కమల లేదా నేను!

రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని నిక్కీ హేలీ వ్యాఖ్య



వాషింగ్టన్: 2024లో అమెరికా అధ్యక్ష పీఠాన్ని మొట్టమొదటిసారిగా మహిళ అధిరోహించనున్నారని ఐరాస మాజీ రాయబారి నిక్కీ హేలీ జోస్యం చెప్పారు. ఆ అవకాశం ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు లేదా తమ ఇద్దరిలో ఎవరో ఒకరికి దక్కనుందని ఆమె చెప్పారు. తాజాగా ఫాక్స్ న్యూస్‌తో నిక్కీ హేలీ ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ అధ్యక్షుడు ట్రంప్ వరుసగా విజయాలు సాధిస్తున్నప్పటికీ ఎన్నికల బరిలో కొనసాగుతానన్నారు. 24న జరిగే సౌత్ కరోలినా ప్రైమరీపైనే తన దృష్టంతా ఉందని నిక్కీ హేలీ చెప్పారు. రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్‌తోపాటు అధ్యక్ష బరిలో నిలిచిన ఆ పార్టీకి చెందిన ఏకైక అభ్యర్థి నిక్కీ హేలీ కావడం గమనార్హం.



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు బైడెన్ జ్ఞాపకశక్తి తగ్గిందనే విషయాన్ని ఒక నివేదిక తగిన సాక్ష్యాధారాలతో బహిర్గతం చేయడంతో ప్రస్తుతం ఈ అంశం అమెరికాలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే బైడెన్ వృద్ధాప్యాన్ని ఎన్నికల ప్రచారాస్త్రంగా మలుచు కున్న రిపబ్లికన్లకు తాజా నివేదిక మరో శక్తివంతమైన ప్రచారాస్త్రమైంది. అయితే ఈ నివేదికలోని అంశాలన్నీ తప్పు అని 81 ఏళ్ల బైడెన్ ఖండించినా ఆ నివేదికలో పేర్కొన్న విషయాలను గమనిస్తే అవన్నీ నిజాలే అని అనిపించకమానవు. తక్కువ జ్ఞాపకశక్తి ఉన్న వృద్ధుడు అని బైడెన్‌ను నివేదిక అభివర్ణించింది. గత జనవరిలో వాషింగ్టన్‌లోని బైడెన్ కార్యాలయంలో రహస్య పత్రాలను సిబ్బంది కనిపెట్టడంతో ఆ విషయం అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్‌దాకా వెళ్లింది. దీంతో ఆయన న్యాయశాఖ స్పెషల్ కౌన్సిల్‌గా రాబర్ట్ హుర్‌ను నియమించారు. ఈయన ఇటీవల బైడెన్‌ను ఏకధాటిగా ఐదు గంటలపాటు ఇంటర్వ్యూ చేసి ఆయన జ్ఞాపకశక్తిపై ఒక అంచనాకొచ్చారు. ఇదిగాక ఇతరత్రా సాక్ష్యాధారాలను ఆయన తన నివేదికలో వెల్లడించారు. గురువారం విడుదలైన ఆ 345 పేజీల నివేదికలో ఏమన్నాయంటే..

- బరాక్ ఒబామా హయాంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసినకాలంలో అఫ్గానిస్తాన్ లో అమెరికా స్థావరాలు, సైన్యం మొహరింపు రహస్యాలను ఒక ప్రైవేట్ వ్యక్తితో బైడెన్ పంచుకున్నారు. సంబంధిత రహస్య పత్రాలను డెలావర్‌లోని తన గ్యారేజీలో మర్చిపోయారు.
- తన కుమారుడు బ్యూ బైడెన్ క్యాన్సర్‌తో ఏ సంవత్సరంలో చనిపోయిందీ బైడెన్ ఠక్కున చెప్పలేకపోయారు
- ఉపాధ్యక్షుడిగా ఏ సంవత్సరంలో దిగిపోయారు అనేదీ ఈయనకు సరిగా గుర్తులేదు
- తన జీవితచరిత్ర రాస్తున్న ఒక రచయితకు సున్నితమైన అంశాలున్న ఒక నోటు పుస్తకం ఇచ్చారు. అందులో అఫ్గానిస్తాన్‌కు సంబంధించిన రహస్య సమాచారం ఉంది.

అవన్నీ అబద్ధాలు: బైడెన్

'దాదాపు 40 సంవత్సరాల క్రితం విషయాలను ఠక్కున చెప్పాలంటే ఎలా?. నా కుమారుడి మరణాన్ని చర్చించకూడదనే ఆ ప్రశ్న సమయంలో స్పందించలేదు. రెండోసారీ అమెరికాకు అధ్యక్షుడిగా కొనసాగే శక్తిసామర్థ్యాలు నాకున్నాయి''అని బైడెన్ పునరుద్ఘాటించారు. అయితే ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొన్ని విషయాలపై తడబడుతూ, పొరబడటం గమనార్హం.

ఉత్తరాఖండ్‌లో ఉద్రిక్తత

● ప్రభుత్వ స్థలంలోని మదర్సా కూల్చివేతకు యత్నం
● పోలీసులు, మున్సిపల్ యంత్రాంగంపై స్థానికుల దాడి
● పోలీసులు కాల్పుల్లో ఆరుగురు మృతి, పలువురికి గాయాలు

హల్ద్వానీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన మదరసా కూల్చివేతకు స్థానిక యంత్రాంగం ప్రయత్నించడం ఇందుకు కారణం. ఈ సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితు లను అదుపులోకి తెచ్చేందుకు అధికారులు పట్టణంలో కర్ఫ్యూ విధించడంతోపాటు కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని బన్‌భూల్‌పూర్ ప్రాంతంలో మదరసా, ప్రార్థనలకు వినియోగించే ఒక నిర్మాణం ఉన్నాయి. ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా కట్టిన ఆ నిర్మాణాలను కూల్చివేసేందుకు గురువారం సాయంత్రం మున్సిపల్ సిబ్బంది ప్రయత్నించారు. పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేత ప్రక్రియ మొదలైంది. అరగంటలోపే భారీ సంఖ్యలో జనం అక్కడికి చేరుకున్నారు. కొందరు చుట్టుపక్కల భవనాలపైకెక్కి మున్సిపల్ సిబ్బంది, పోలీసులపైకి రాళ్లు రువ్వడం ప్రారంభించారు. సంఘటన స్థలంలో గుమికూడిన వారు రాళ్లు, కర్రలు, పెట్రోలు బాంబులు, దేశవాళీ తుపాకులతో అధికారులు, సిబ్బందిని ఆగ్రహంతో ప్రశ్నిస్తూ దాడికి యత్నించారు. వారిని పోలీసులు చెదరగొట్టారు. ఆందోళనకారుల ఒక గుంపు వెంటబడగా పోలీసులు సమీపంలోని పోలీస్‌స్టేషన్ లోపలికి వెళ్లారు. అక్కడికి చేరుకున్న గుంపు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టింది. పోలీస్ స్టేషన్‌కు సైతం నిప్పుపెట్టేందుకు ప్రయత్నించగా లోపలున్న పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చిందని నైనిటాల్ జిల్లా మేజిస్ట్రేట్ వందనా సింగ్ చెప్పారు. పోలీస్ స్టేషన్‌తోపాటు సిబ్బందిపై దాడికి యత్నించినట్లు గుర్తించిన సుమారు 20 మందిలో నలుగురిని అరెస్ట్ చేసి, మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. మృతి చెందిన ఆరుగురిలో ముగ్గురికి బుల్లెట్ గాయాలు, మరో ముగ్గురికి ఇతర గాయాలయ్యాయని చెప్పారు. క్షతగాత్రులైన 60 మందిలో చాలా మంది ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారని ఎస్పీ(సిటీ) హర్బన్స్ సింగ్ చెప్పారు. ఒక జర్నలిస్ట్ సహా గాయపడిన ఏడుగురు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు.

లంచ్ విత్ మోదీ!



న్యూఢిల్లీ: సమయం మధ్యాహ్నం 2.30 గంటలు. పార్లమెంట్‌లో వాడీవేడి చర్చలతో అలసి మధ్యాహ్నం భోజనానికి సిద్ధమవుతున్న పలువురు విపక్ష ఎంపీలకు హఠాత్తుగా పిలుపు వచ్చింది. ప్రధాని మోదీ కలవాలనుకుంటున్నారని దాని సారాంశం. అంతా లిఫ్ట్ ఎక్కారు. సరిగ్గా పార్లమెంట్ క్యాంటీన్ వద్ద దిగి విజిటర్స్ లాంజ్‌లో వేచి చూస్తున్నారు. ''పదండి. మీకో శిక్ష విధిస్తాను' అని చమత్కరిస్తూ వారందరితో కలిసి భోజనానికి కూర్చున్నారు. 45 నిమిషాలపాటు కబుర్లు చెప్పుకున్నారు. వారిలో బీజేపీ ఎంపీలతో పాటు విపక్ష సభ్యులు కె.రామ్మోహన్ నాయుడు (టీడీపీ), సస్మిత్ పాత్రా (బీజేడీ), ఎన్‌కే ప్రేమచంద్రన్ (ఆర్ఎస్పీ), రితేశ్ పాండే (బీఎస్పీ) ఉన్నారు.

నిద్ర ఎప్పుడు లేస్తారు?

ఆహార అలవాట్లు మొదలుకుని అంతర్జాతీయ వ్యవహారాలదాకా అన్ని అంశాలు అక్కడ చర్చకొచ్చాయి. రోజూ ఎన్నింటికి నిద్ర లేస్తారు బిజీ షెడ్యూల్‌ను ఎలా అలసిపోకుండా నిర్వహిస్తారు వంటి ఎంపీల ప్రశ్నలకు మోదీ సరదాగా సమాధానాలిచ్చారు. ''నేనెప్పుడూ ప్రధానిని అన్న మూడ్‌లో ఉండను. మంచి ఆహారం తినాలనే మూడ్‌లోనూ ఉంటాను'' అని చమత్కరించారు. కిచిడీ తన ఫేవరెట్ ఫుడ్ అని చెప్పారు. ఒకే రోజులో వేర్వేరు రాష్ట్రాల పర్యటనలు, విదేశీ ప్రయాణాలు, గుజరాత్ గురించి పట్టింపుల వంటివెన్నో విషయాలు చర్చకొచ్చాయని ఒక ఎంపీ వెల్లడించారు. ప్రాణహాని ఉందంటూ ఎస్పీజీ హెచ్చరించినా 2015లో పాకిస్తాన్‌కు వెళ్లి నాటి పీఎం నవాజ్ షరీఫ్‌ను ఎందుకు కలవాల్సి వచ్చిందో మోదీ వివరించారు. అందరూ అన్నం, పప్పు, కిచిడీ తిన్నాక రాగి లడ్డూ రుచిచూశారు. తామంతా కూర్చున్నది మోదీతోనేనా అనే అనుమానం ఒక్కసారిగా కల్గిందని ఒక ఎంపీ చెప్పారు. '' ప్రధానితో కలిసి భోజనం చేయడం అరుదైన అనుభవం. మేం చకచక ప్రశ్నలు అడుగుతుంటే ఆయన టకటక సమాధానాలిస్తున్నారు'' అని మరో ఎంపీ చెప్పారు.

బీజేపీ ఎంపీలకు విప్

న్యూఢిల్లీ: అధికార బీజేపీ తమ పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు శుక్రవారం విప్ జారీ చేసింది. శనివారం పార్లమెంట్‌లో చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశపెట్టనున్నందున చర్చ, ఆమోదం నిమిత్తం పార్టీ సభ్యులంతా తప్పక హాజరుకావాలని అందులో కోరింది. దీంతో, పార్లమెంట్ సమావేశాల్లో ఆఖరి రోజైన శనివారం ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపడుతుందోనన్న చర్చ మొదలైంది.

ఈసీపై పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ఓటరు గుర్తింపు కార్డు అప్‌డేట్, కొత్త ఓటరు నమోదు దరఖాస్తుల్లో ఆధార్ సంఖ్యను జత చేయడానికి సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పష్టమైన మార్పులను చేపట్టనందుకు ఎన్నికల సంఘం అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టేసింది. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ వేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం విచారించింది. ఈ విషయంలో ఈసీకి మేం డెడ్‌లైనేదీ పెట్టలేదని పేర్కొంది.

రఫాను ఖాళీ చేయించండి

రఫా: గాజా దక్షిణ ప్రాంత పట్టణం రఫాను ఖాళీ చేయించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు శుక్రవారం ఆర్మీని ఆదేశించారు. మిగిలి ఉన్న హమాస్ మిలిటెంట్లను పూర్తిస్థాయిలో ఏరివేసేందుకు సైతం వ్యూహాన్ని సిద్ధం చేయాలన్నారు. దీంతో, ఈజిప్ట్ సరిహద్దులకు సమీపంలోని రఫాలో తలదాచుకుంటున్న 15 లక్షల మంది ప్రజల భద్రతపై అమెరికాతోపాటు అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

'పబ్లిక్ పరీక్షల'బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: పోటీ పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలను అరికట్టే బిల్లును పార్లమెంట్ ఆమోదిచింది. ఈ నెల 6న లోక్‌సభ ఆమోదించిన పబ్లిక్ పరీక్షల (ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్) బిల్లు–2024ను రాజ్యసభ శుక్రవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. బిల్లుకు విపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆప్ సభ్యులు కూడా మద్దతివ్వడం విశేషం.

'జీవితఖైదు కాలపరిమితి'పై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: జీవితఖైదు పడిన దోషి చనిపోయేదాకా జైలు శిక్ష అనుభవించాలా అంటూ ఒక యావజ్జీవ ఖైదీ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. 'యావజ్జీవశిక్ష అంటే ఎంత కాలం? నేర శిక్షా స్మృతి(సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 432 కింద శిక్షా కాలాన్ని తగ్గించడమో, రద్దుచేయడమో చేయొచ్చా?' అన్న అంశాలపై విచారిస్తామని జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల ధర్మాసనం తెలిపింది.

పాకిస్తాన్‌లో హంగ్

ఇస్లామాబాద్/లాహోర్: పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీలో హంగ్ నెలకొంది. గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టలేదు. పోరు ఏకపక్షమేనని, సైన్యం దన్నుతో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పీఎంఎల్ (ఎన్) విజయం ఖాయమని వెలువడ్డ ముందస్తు అంచనాలన్నీ తలకిందులయ్యాయి. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ స్థాపించిన పాకిస్తాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. శుక్రవారం రాత్రికల్లా ఫలితాల సరళి దాదాపుగా ముగింపుకు వచ్చింది. మెజారిటీ మార్కు 133 కాగా పీటీఐ 97 సీట్లు నెగ్గి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. ఇమ్రాన్ జైలుపాలై పోటీకే దూరమైనా, ఎన్నికల గుర్తు రద్దై అభ్యర్థులంతా స్వతంత్రులుగా నానారకాల గుర్తులపై పోటీ చేయాల్సి వచ్చినా దేశవ్యాప్తంగా వారి జోరు కొనసాగడం విశేషం. నవాజ్ పార్టీకి 66, బిలావల్ భుట్టో సారథ్యంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీకి 51 స్థానాలు దక్కాయి. మిగతా పార్టీలకు 24 సీట్లొచ్చాయి. మరో 27 స్థానాల ఫలితాలు వెల్లడవాల్సి ఉంది. పాక్ జాతీయ అసెంబ్లీలో మొత్తం స్థానాలు 336 కాగా 266 సీట్లకే ఎన్నికలు జరుగుతాయి. మహిళలకు, మైనారిటీలకు రిజర్వు చేసిన 70 సీట్లను పార్టీలు గెలుచుకునే స్థానాల ఆధారంగా వాటికి దామాషా పద్ధతిలో కేటాయిస్తారు. ఒక అభ్యర్థి మృతి నేపథ్యంలో ఈసారి 265 స్థానాల్లో పోలింగ్ జరగ్గా ఇప్పటిదాకా 238 స్థానాల ఫలితాలు వెల్లడయ్యాయి. ఈసారి ఎన్నికల్లో భారీగా రిగ్గింగ్ జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దానికి తోడు ఫలితాల వెల్లడి విపరీతంగా ఆలస్యమవుతుండటంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల అధికారులే ఫలితాలను పీఎంఎల్‌కు అనుకూలంగా మార్చేస్తున్నారని పీటీఐ దుమ్మెత్తిపోస్తోంది. లాహోర్ స్థానంలో చాలాసేపటిదాకా వెనకబడి ఉన్న నవాజ్ చివరికి మంచి మెజారిటీతో నెగ్గినట్టు ప్రకటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లాహోర్‌లోని మరో మూడు స్థానాల్లో ఆయన కూతురు, సోదరుడు, మరో బంధువు గెలిచినట్టు ఈసీ ప్రకటించింది. అయితే మరో స్థానంలో మాత్రం పీటీఐ మద్దతుతో బరిలో దిగిన స్వతంత్ర అభ్యర్థి చేతిలో నవాజ్ ఓటమి చవిచూడటం విశేషం. ఈ నేపథ్యంలో పీటీఐ ప్రదర్శనను షరీఫ్ అభినందించడం విశేషం. కాకపోతే పీఎంఎల్ అత్యధిక స్థానాల్లో నెగ్గి అతి పెద్ద పార్టీగా అవతరించిందని ఆయన చెప్పుకొచ్చారు. దేశ ప్రయోజనాల రీత్యా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామంటూ పిలుపునిచ్చారు. పీటీఐ చైర్మన్ గోహర్ ఖాన్ మాత్రం ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమంటూ కుండబద్దలు కొట్టారు. స్వతంత్రులుగా నెగ్గిన ఆ పార్టీ అభ్యర్థులకు ఎర వేసి లాక్కునేందుకు పీఎంఎల్ జోరుగా ప్రయత్నిస్తోందని వార్తలొస్తున్నాయి.

ఇమ్రాన్ మద్దతుదార్ల జోరు
● ఇప్పటికి 97 స్థానాల్లో గెలుపు
● 66 సీట్లకు పీఎంఎల్ పరిమితం
● పీపీపీకి 51, ఇతరులకు 24
● సంకీర్ణానికి నవాజ్ పిలుపు
● 'ఇమ్రాన్' అభ్యర్థులకు ఎర!

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



సందేశాత్మకంగా సాగిన..

విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్న భారత్ రంగస్థల మహోత్సవ్ జాతీయ సమైకత్యను చాటుతోంది. -8లో▸



మెగా టోర్నీకి విశాఖ వేదిక

ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నీకి విశాఖ వేదికైంది. శుక్రవారం తుది దశ పోటీలను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అక్కడి రైల్వే స్టేడియంలో ప్రారంభించారు. -8లో▸



కార్మికులకు చేతినిండా పని

ట్రాన్స్‌పోర్టు రంగానికి మళ్లీ మంచి రోజులు వచ్చాయి. కొత్త లారీల కొనుగోలు పెరిగింది. కరోనా సమయంలో మూలపడిన ఈ రంగం వేగంగా పుంజుకుంది. -8లో▸

న్యూస్‌రీల్

రేపు జాతీయ శతాధిక కవి సమ్మేళనం

విజయవాడ కల్చరల్: మల్లెతీగ సాహిత్యవేదిక, నవభారత నిర్మాణ సంఘం, స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మల్లెతీగ సాహిత్యవేదిక వ్యవస్థాపకుడు కలిమిశ్రీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో 'పుణ్యభూమి నాదేశం నమోనమామి' అంశంగా ఈ సమ్మేళనం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి, భాషావేత్త డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సాహితీవేత్తలు డాక్టర్ ఎం. ప్రభాకర్, సాగర్ శ్రీరామ కవచం,స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడు వైడీ ఆనంద్ పాల్గొంటారని, కవి పండిత సత్కారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేటకు మణిహారంగా ఊర చెరువు



చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జిల్లాలోనే మేటి పర్యాటక కేంద్రంగా పేట ఊర చెరువును అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. శరవేగంగా జరుగుతున్న చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు చుట్టూ తిరిగి కంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా జగ్గయ్యపేటలో పర్యాటక కేంద్రంగా రూ.3 కోట్లతో చెరువును అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే చెరువు చుట్టూ ప్రహరీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం సైడ్ గ్రిల్స్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే రూ. 45 లక్షల వ్యయంతో ఫుట్‌పాత్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, గుంజ లక్ష్మణ్, రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి ఫిరోజ్‌ఖాన్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు ఉత్సవాలకు సర్వం సిద్ధం

హెలికాప్టర్ ట్రయల్ రన్ వేసిన కలెక్టర్ శివశంకర్ లోతేటి

యడ్లపాడు: చారిత్రక, పర్యాటక కేంద్రం కొండవీడు ఫెస్ట్ –2024కు సర్వం సిద్ధమైంది. కోటపై ఏర్పాట్లను వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పుట్టకోట(కొత్తపాలెం) గ్రామం ప్రారంభంలోనే ఏడు ఎకరాల్లో పారా మోటరింగ్, హాట్ ఎయిర్ బెలూన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అన వేమారెడ్డి విగ్రహం పక్కనే కొండవీడుకోటలో సందర్శించదగ్గ ప్రదేశాలు, మ్యాప్ బోర్డు గ్యాలరీ ఉంది. వాటి ఎదురుగానే ఫ్లవర్‌షో, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, దేశనాయకులు, అంబేడ్కర్ జీవిత విశేషాలు, స్వాతంత్య్ర పోరాట ఘట్టాల గ్యాలరీ సిద్ధం చేశారు. బెంగళూరు నుంచి తెప్పించిన ఎయిర్ బస్(హెలికాప్టర్)తో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులతో ట్రయల్ రన్ నిర్వహించారు. 30 కి.మీ మేర కొండవీడు కోట, ఫిరంగిపురం, అమీనాబాద్ ప్రాంతాల మీదుగా ట్రిప్ సాగుతుందన్నారు.

108లో డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : 108 అంబులెన్సుల్లో డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ నాగదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంగ్లిషు చదవడం, రాయడం తెలిసి ఉండి, డ్రైవింగ్ హెవీ లైసెన్సు కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు ప్రాంతాల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం రెండో అంతస్తులోని 108 కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9121892889 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ భక్తులు, (ఇన్‌సెట్లో) మేరీమాత విగ్రహం

నిష్కళంక మాతా.. వందనం

ఘనంగా గుణదల మేరీమాత తిరునాళ్ల ప్రారంభం

జననీ లోకమాతా వందనం.. దయచూపే మా తల్లీ ధన్యులమయ్యామంటూ క్రైస్తవ భక్త లోకం కీర్తించింది. లోక రక్షకుడికి జన్మనిచ్చిన ఆ తల్లి పవిత్రతకు, పరిశుద్ధతకు సమమైనది ఏదీ లేదని చాటి చెబుతూ.. ప్రశస్తమైన ఆ నిష్కళంకమాత ఒడిలో సాంత్వన పొందేందుకు పోటీ పడింది. శుక్రవారం గుణదల మేరీమాత తిరునాళ్ల వైభవంగా ప్రారంభమైంది. ఉదయం, సాయంత్ర వేళల్లో గురువుల సమష్టి దివ్య పూజాబలి.. భక్తుల ప్రార్థనలు, మొక్కుబడుల స్తుతి ధూపం శిఖరాగ్రానికి చేరింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన యాత్రికులను ఉత్సాహపరిచే పాటలు, నాటికలు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని కల్గించాయి.

గుణదల (విజయవాడ తూర్పు): క్రైస్తవ ఆధ్యాత్మిక శిఖరం గుణదల పుణ్యక్షేత్రంలో మేరీమాత శతాబ్ది మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్ర ప్రధానాలయం దిగువన ఉన్న బిషప్‌గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విజయవాడ మేత్రాసన గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ఆరంభించారు. పుణ్యక్షేత్ర గురువులు, మఠకన్యలు, వేలాది మంది భక్తుల సమక్షంలో తొలి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ, భారత దేశంలో అతి పెద్ద రెండో క్రైస్తవ క్షేత్రంగా గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోందన్నారు. మరియమాతను ఆశ్రయించిన భక్తుల జీవితాలు శాంతి సమాధానాలతో ఉంటాయని తెలిపారు. కుల మతాలకు అతీతంగా మరియమాత అందరినీ అక్కున చేర్చుకుంటుందని పేర్కొన్నారు. ఫ్రాన్సు దేశంలో లూర్దుమాతగా దర్శనమిచ్చిన మరియతల్లి లోకమాతగా భక్తుల నీరాజనాలు అందుకుంటోందని చెప్పారు. లోక రక్షకుడైన క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడుచుకోవాలన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం స్థాపించి నూరు వసంతాలు పూర్తవటం ఆనందదాయకమన్నారు. మరియతల్లి దీవెనలతో ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. లక్షలాది మంది భక్తులు ఈ వేడుకలకు హాజరై మరియమాతను దర్శించుకుని ఆమె దీవెనలు పొందాలని ఆశీర్వదించారు. అనంతరం డయాసిస్ మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ సునీల్‌రాజు, తదితర గురువులతో కలసి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. ఇదే వేదికపై జుబిలేరియన్ గురువులను ఘనంగా సత్కరించారు.



మేరీమాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న బిషప్ రాజారావు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న యువతులు

శతాబ్ది సందడి..

గుణదల ఉత్సవాల తొలిరోజైన శుక్రవారం మేరీమాత పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఈ ఏడాది పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో అనేక ప్రాంతాల నుంచి యాత్రికులు లక్షలాదిగా తరలివస్తున్నారు. కొండపై మరియమాతను దర్శించుకుని భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. శిఖరాగ్రం వరకు వెళ్లి క్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం పుణ్యక్షేత్ర గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు పలికారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటయిన వేదికపై కళాకారులు చేస్తున్న ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలతో భక్తులు తన్మయం చెందుతున్నారు. సంసోను దెలీలా, లాజరు జీవిత విశేషాలను వివరిస్తూ చేసిన నృత్య రూపకాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పటిష్ట బందోబస్తు



విజయవాడస్పోర్ట్స్: గుణదల మేరీ మాత తిరునాళ్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా తెలిపారు. మేరీమాత తిరునాళ్లను సీపీ రాణా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ తేదీ వరకు జరిగే తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. 1,500 మంది లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తు విధులు కేటాయించామన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడంతో పాటు రద్దీని నివారించేందుకు ప్రత్యేకంగా మూవింగ్‌పార్టీలను నియమించామన్నారు. సీపీ వెంట డీసీపీలు కృష్ణకాంత్‌పాటిల్, కె.శ్రీనివాసరావు, ఏసీపీ భాస్కరరావు ఉన్నారు.



గోల్డెన్, సిల్వర్ జుబిలేరియన్స్‌ను సత్కరిస్తున్న బిషప్ రాజారావు

బాలల రక్షణపై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాల కార్మిక చట్టాలను సమర్థంగా అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాలల సంరక్షణ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల చట్టాల అమలు వంటి అంశాలలో తీసుకుంటున్న చర్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా 907 మంది బాలలకు రక్షణ కల్పించామన్నారు. వీరిలో ఇంటి నుంచి పారిపోయి వచ్చిన 299 మంది బాలలు, బాల్య వివాహాలలో గుర్తించిన 22 మంది మైనర్ బాలలు, అత్యాచారాలకు గురైన 11 మంది బాలికలు, మిస్సింగ్ కేసులకు సంబంధించి 28 మంది బాలలు, 155 మందికి బాలకార్మికులకు రక్షణ కల్పించామన్నారు. వీరిని పూర్తి స్థాయిలో సంరక్షించి ప్రయోజకులను చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాలలు వారి బాల్యాన్ని స్వేచ్ఛగా అనుభవించే వాతావరణం కల్పించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రణాళికలు రచించుకుని విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, పోలీస్, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్ జె. సత్యవతి, ఏడీపీవో టి.జ్యోతి, ఆరపి వెంకటపతిరాజు, ఏసీపీ కె. వెంకటేశ్వరరావు, దిశ సీఐ అహ్మదున్నీసా, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విత్తు తెస్తున్న విత్తం



పామర్రులోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

వైఎస్సార్ అగ్రి ప్రయోగశాలల ప్రతిఫలమిది

- నకిలీలకు ముకుతాడు
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్న ప్రభుత్వం
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- రూ.7.70 కోట్లతో భవనాల నిర్మాణం
- ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లాలో 11 ల్యాబ్‌లు

సాక్షి, మచిలీపట్నం: నకిలీ విత్తును చిత్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. వివిధ కంపెనీలు తయారు చేసిన విత్తనాలు, ఎరువులు రైతులకు చేరకముందు ల్యాబ్‌లో పరీక్షించి.. వాటిని నాణ్యతను పరీక్షిస్తుండటంతో నకిలీల బెడద నుంచి అన్నదాతలు గట్టెక్కుతున్నారు. అంతేకాక సమయానికి నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు కూడా వారికి అందుతున్నాయి. దీంతో పంటలు ఎటువంటి చీడపీడల బారిన పడకుండా రైతులకు ఫలప్రదంగా మారుతున్నాయి.

నియోజకవర్గానికి ఒకటి..

పంట దిగుబడి బాగా రావాలంటే నకిలీ విత్తు, ఎరువులు, పురుగు మందులను అరికట్టాలి. గతంలో వీటిని పరీక్షించే ల్యాబ్‌లు కేవలం జిల్లా కేంద్రంలో మాత్రమే ఉండేవి. రైతులు తమ ఊరి నుంచి వెళ్లి పరీక్షలు చేయించుకునేందుకు వీలు పడేది కాదు. అయితే ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఒక్కో ల్యాబ్‌కు రూ.70లక్షల వరకు పైగా వెచ్చించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో 11 ల్యాబ్‌లు నిర్మించింది. మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, పెనమలూరు, పెడన, పామర్రు, నూజివీడు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరులో నిర్మించగా గన్నవరంలో జిల్లా స్థాయి ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నారు.

ఉద్యోగులు, పరికరాలు..

ప్రతి ల్యాబ్‌లో ఏఓ, ఇద్దరు ఏఈఓలను నియమించగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పరీక్షలు చేస్తున్నారు. వీటి వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీతో సరఫరా చేస్తోంది. అవి కాకుండా ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారుల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువుల నాణ్యతపై అనుమానం వస్తే ల్యాబుల్లో పరీక్షించుకోవచ్చు. అలాగే రైతులు పండించిన పంట విత్తనాల నాణ్యతను పరీక్షించి, తిరిగి విత్తుకొనే అవకాశం కల్పిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఇలా..

ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకునే గత ప్రభుత్వంలో అవకాశం ఉండేది కాదు. దీంతో ఏది నాణ్యమైనదో.. లేని నకిలీదో తెలుసుకోలేక రైతులు నష్టాలపాలయ్యారు. 2014–19 వరకు విత్తనాలపై అనేక ఫిర్యాదులు వచ్చినా ఎలాంటి చర్యలు ఉండేవి కావు.

పరీక్షలు ఇలా..

విత్తనాలు, ఎరువులను అగ్రిల్యాబుల్లో పరీక్షించుకోగా, పురుగు మందులను జిల్లా ల్యాబ్‌కు తరలిస్తారు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, భౌతిక స్వచ్ఛతలను పరీక్షించి 28రోజుల్లో నివేదికలిస్తారు. ఎరువుల్లో ఎన్‌పీకే కాంప్లెక్స్, ఎన్‌పీకే మిశ్రమం, సూక్ష్మ పోషకాల్లో తేమ శాతం, పోషకాల శాతం, కణ పరిణామాలను పరీక్షించి 14రోజుల్లో నివేదికలు ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకున్న విత్తనాలు, ఎరువులను ఉచితంగా, ప్రైవేట్ వ్యాపారుల నుంచి కొన్న విత్తనాలు, ఎరువులకు నిర్ణీత ఫీజు చెల్లించాలి. కృష్ణా జిల్లాలో 2,007, ఎన్టీఆర్ జిల్లాలో 1,762 శ్యాంపిళ్లను పరీక్షించారు.

యూరియా టెస్టింగ్ చేయించా..



ఇటీవలే ఓ కంపెనీకి చెందిన యూరియాను కొనుగోలు చేశాను. అయితే నాణ్యత పట్ల అనుమానం రావడంతో సమీపంలోని అగ్రి ల్యాబ్‌లో పరీక్షించాలని ఇచ్చా. అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా దానిని వాడాను. ఈ ల్యాబ్‌ల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

– ఎస్. నాగార్జునరెడ్డి, పామర్రు

రైతులకు మేలు..



వైఎస్సార్ టెస్టింగ్ ల్యాబ్‌లు రైతులకు ఎంతో మంచి చేస్తున్నాయి. గతంలో విత్తనాలు నాణ్యతతో లేకపోవడంతో చాలా నష్టపోయాం. ప్రభుత్వం మా నష్ట, కష్టాలు గుర్తించి నియోజకవర్గ కేంద్రంలో ఒక ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించి ధ్రువీకరించుకుంటున్నాం.

– ఎస్‌కే అబ్దుల్ సత్తార్, కొలవెన్ను, కంకిపాడు మండలం

ఉచితంగా పరీక్షలు..



రైతులు తీసుకెళ్లే శ్యాంపిళ్లకు ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. లూజు విత్తనాలకు మాత్రం పరీక్షలు చేయరు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, విత్తనం స్వచ్ఛతను ధ్రువీకరిస్తారు. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం వీటిని నిర్మించింది. వాడే ముందు నాణ్యతను పరీక్షించుకుంటే నకిలీల బెడద చాలా వరకు తగ్గుతుంది.

– ఎస్. పద్మావతి, వ్యవసాయశాఖ జేడీ

ఆరోగ్యకర సమాజమే లక్ష్యం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్



చిన్నారులకు మాత్రలను వేస్తున్న కమిషనర్ నివాస్, చిత్రంలో కలెక్టర్ ఢిల్లీరావు

పటమట(విజయవాడతూర్పు): ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, వీటిని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ అన్నారు. పటమట లంక శ్రీ కొమ్మా సీతారామయ్య బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఆర్బీఎస్‌కే స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ఇ.ప్రశాంత్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ తదితరులతో కలిసి కమిషనర్ నివాస్ చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు.

- అనంతరం కమిషనర్ నివాస్ మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత అనేది లేకుండా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.29 లక్షల సంస్థల్లో దాదాపు 1.32 కోట్ల మంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు.
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ శుక్రవారం 1–19 ఏళ్ల వయసు వారందరికీ, ఫిబ్రవరి 16వ తేదీన మాత్రలు ఇస్తామని పేర్కొన్నారు.
- మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మీరు తినే తిండి ఒంటికి పట్టి ఎదుగుదల బాగుండాలంటే తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.
- వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ రక్తహీనత సమస్య నుంచి బయటపడేందుకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, పాఠశాల హెచ్ఎం ఎ.లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

సాగు ఖర్చులకు అనుగుణంగా పంట రుణాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు

డీఎల్‌టీసీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో సాగు ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంట రుణాల మంజూరుకు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్–ఎన్టీఆర్ జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు ఎకరా విస్తీర్ణానికి రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై ప్రతిపాదనల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ ద్వారా 2024–25కు గాను వరికి రుణ పరిమితి రూ. 42 వేలు, మిరప (డ్రై)కు రూ. 95 వేలు, మిరప (ఇరిగేటెడ్)కు రూ. లక్ష, మామిడికి రూ. 41 వేలు, ఆయిల్‌పామ్‌కు రూ. 75 వేలు, పట్టు పురుగుల పెంపకానికి రూ.లక్ష రుణపరిమితిని ప్రతిపాదించామన్నారు. వీటిని రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీకి పంపనున్నట్లు తెలిపారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి)కు అదనంగా 30 శాతం వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశముందన్నారు. సమావేశంలో ఎల్డీఎం కె.ప్రియాంక, కేడీసీసీ బ్యాంకు సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.పెద్దిబాబు, జిల్లా సెరీకల్చర్ అధికారి ఎస్.సత్యనారాయణ ఆయా బ్యాంకుల జీఎంలు, మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు

పొడి చెత్తను సంపదగా మార్చాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ శ్రీనివాసన్

చల్లపల్లి(అవనిగడ్డ): రోజూ సేకరించే పొడి చెత్తను సంపదగా మార్చుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్, పర్యావరణవేత్త వేలేరు శ్రీనివాసన్ అన్నారు. శుక్రవారం రాష్ట్రంలోనే తొలిసారిగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంను శ్రీనివాసన్ చల్లపల్లిలో నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్‌లో పొడి చెత్త విభజన, ప్లాస్టిక్ వ్యర్థాల విభజనపై శ్రీనివాసన్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యక్ష అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆకుల చెత్త, అరటి గెలలు, పేపర్ వేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్, తడి చెత్త, గాజు పెంకులు, సీసాలను ఎన్ని రకాలుగా విడదీయాలి అనే అంశంపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, పారిశుద్ధ్య అధికారి కలతోటి సుధాకర్ పాల్గొన్నారు.



చెత్త విభజిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

క్లుప్తంగా

నేటి నుంచి దుర్గగుడిపై మాఘ మాస పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మాఘమాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శనివారం నుంచి ప్రత్యేక ఆర్జిత సేవలు ప్రారంభం కానున్నాయి. లోక కల్యాణార్థం, భక్త జన శ్రేయస్సును కాంక్షిస్తూ విశేష పర్వదినాల్లో అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి వారి వారి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 11వ తేదీ ఆదివారం నిర్వహించే సూర్యోపాసన సేవతో పాటు విశేష పర్వదినాల్లో పూజాది కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. 14వ తేదీ బుధవారం శ్రీపంచమి, 16వ తేదీ శుక్రవారం రథసప్తమి, 18వ తేదీ ఆదివారం సూర్యోపాసన సేవ, 20వ తేదీ మంగళవారం భీష్మ ఏకాదశి, 24వ తేదీ శనివారం మాఘ పౌర్ణమి, 25వ తేదీ ఆదివారం సూర్యోపాసన సేవ, మార్చి 3 ఆదివారం మాఘ బహుళ అష్టమి సూర్యోపాసన సేవ, మార్చి 6వ తేదీ బుధవారం మాఘ బహుళ ఏకాదశి, మార్చి 10వ తేదీ ఆదివారం మాఘ బహుళ అమావాస్య విశేష పూజలు నిర్వహిస్తారు. సేవలో పాల్గొనే ఉభయదాతలు రూ.వెయ్యి ప్రత్యేక టికెట్ కొనుగోలు చేసి సేవలో పాల్గొనవచ్చునని అధికారులు పేర్కొన్నారు.

14 నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునరుద్ధరణ పూజలు

ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి దేవాలయ పునరుద్ధరణ, నూతన ధ్వజ స్తంభ సహిత స్వర్ణ శిఖర ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. 5 రోజుల పాటు పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

బంటుమిల్లి: స్థానిక ఏజీపీ ఈవీఎస్ రాయుడు ఇంటి ముందు ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొర్లపాడు పంచాయతీ శివారు నారాయణపురం గ్రామానికి చెందిన బొమ్మిడి రామాంజనేయులు అనే వ్యక్తి న్యాయవాది రాయుడు ఇంటి ముందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులకు సమాచారం అందడంతో వారు రక్షించే ప్రయత్నం చేయగా రామాంజనేయులు కత్తితో పోలీసులను బెదిరించడమే కాకుండా ఉరి వేసుకోబోయాడు. పోలీసులు మాటలతో అతన్ని మభ్యపెడుతూ వెనుకగా వెళ్లి రామాంజనేయులను పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. రామాంజనేయులు మానసిక స్థితి బాగా లేదని గుర్తించిన పోలీసులు వైద్యం నిమిత్తం అతడిని మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రామాంజనేయులును ఆత్మహత్యాయత్నం నుంచి రక్షించిన కానిస్టేబుళ్లు చందు, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వరావులను ఎస్‌ఐ రాజు అభినందించారు.

కార్మికులకు చేతినిండా పని

- తెలుగు రాష్ట్రాల నుంచి కోకొల్లలుగా కొత్త లారీలు
- బెజవాడ ఆటోనగర్‌లో కళకళలాడుతున్న లారీ బాడీ బిల్డింగ్ షెడ్‌లు



కొత్త లారీకి క్యాబిన్ పని చేస్తున్న కార్పెంటర్లు



లారీకి స్టిక్కరింగ్ పని చేస్తున్న కార్మికులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ట్రాన్స్‌పోర్టు రంగానికి మళ్లీ మంచి రోజులువచ్చాయి. కొత్త లారీల కొనుగోలు పెరిగింది. కరోనా సమయంలో దెబ్బతిన్న ఈ రంగం అనంతరం పుంజుకుని గాడిన పడింది. తత్ఫలితంగా విజయవాడ ఆటోనగర్‌లోని లారీ బాడీ బిల్డింగ్ షెడ్‌లు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మూడు నెలలపాటు పాటు వీరికి సీజన్ ఉంటుంది. ప్రస్తుతం ఏ షెడ్‌లో చూసినా కొత్త లారీలు దర్శనమిస్తున్నాయి. బెజవాడ ఆటోనగర్‌లో కొత్త లారీలకు బాడీబిల్డింగ్ పనులు చేయించుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి లారీలను ఇక్కడకు తీసుకువస్తారు. ఇక్కడ సుమారు 100కు పైగా ఇలాంటి షెడ్‌లు ఉన్నాయి. వీటిలో సుమారు 300 మందికి పైగా కార్మికులకు ప్రస్తుతం చేతినిండా పని దొరుకుతోంది.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి...

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 16 టైర్ల కొత్తలారీలు వస్తున్నాయి. (బీఎస్ 6.2) ఇవి కాలుష్యాన్ని నియంత్రించే వాహనాలు. ఈ లారీల్లో సుమారు 35 టన్నులకు పైగా లోడు వేసుకోవచ్చని మేస్త్రీలు చెబుతున్నారు. మెయింటినెన్స్ కూడా తక్కువగా ఉండటం వల్ల వీటిని లారీ యజమానులు కొనుగోలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ఏపీలోని నెల్లూరు, కడప, కర్నూలు, ఉమ్మడి కృష్ణా జిల్లాలతో పాటు తెలంగాణలోని నల్లగొండ, కోదాడ, ఖమ్మం నుంచి లారీలు ఎక్కువగా ఇక్కడకు వస్తున్నాయి.

చేపల ఎగుమతులు బాగా ఉన్నాయి...

గత నాలుగు నెలల నుంచి వివిధ రాష్ట్రాలకు చేపల ఎగుమతి బాగా ఉండటం వల్ల ఈ లారీలకు గిరాకీ బాగా పెరిగిందని లారీ యజమానులు పలువురు చెబుతున్నారు. గుజరాత్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో పాటు పలు రాష్ట్రాలకు కోనసీమ, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి చేపలు వెళుతున్నట్టు చెబుతున్నారు. ఏపీలోని పలు జిల్లాల నుంచి వివిధ రాష్ట్రాలకు సుమారు 100 లారీలకు పైగా కేవలం చేపల సరుకు వెళుతున్నట్టు లారీల యజమానులు తెలిపారు.

సగానికి పైగా షెడ్‌లు అద్దెకు...

సుమారు 15 సంవత్సరాల క్రితం సొంత షెడ్‌ల యజమానులు లారీ బాడీబిల్డింగ్ పనులు చేయించేవారు. గత కొద్ది సంవత్సరాల నుంచి సుమారు 80 శాతానికి పైగా షెడ్ యజమానులు ఈ షెడ్‌లను అద్దెకు ఇచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన వారు, అనుభవం, నైపుణ్యం ఉన్న మేస్త్రీలే వీటిని అద్దెకు తీసుకుంటున్నారు. వీరే సొంతంగా నైపుణ్యం కలిగిన కార్మికులను పెట్టుకుని లారీ బాడీ బిల్డింగ్ పనులు చేయిస్తున్నారు.

ఈ మూడు నెలలు పని బాగా ఉంటుంది



ఈ ఏడాది జనవరి నుంచి 16 టైర్ల లారీలు వస్తున్నాయి. లారీ బాడీ బిల్డింగ్ పనులు చేయించుకునేందుకు కొత్త లారీలు ఇక్కడకు వస్తున్నాయి. కార్మికులకు చేతినిండా పని కల్పిస్తున్నాం.

– బి.వెంకటేశ్వరరావు, లారీ బాడీ బిల్డింగ్ మేస్త్రీ, కొత్త ఆటోనగర్

40 ఏళ్ల నుంచి పని చేస్తున్నా



40 ఏళ్లగా లారీ బాడీ బిల్డింగ్ పని చేస్తున్నా. ప్రస్తుతం అద్దెకు షెడ్‌ను తీసుకుని నడిపిస్తున్నా. 10 ఏళ్ల క్రితానికి ఇప్పటికి లారీ బాడీ బిల్డింగ్ పనికి కూలీ మూడు రెట్లు పెరిగింది. కార్మికులకు రోజువారీ ఇస్తున్నాం.

– గాబ్రియేలు, లారీ బాడీ బిల్డింగ్ షెడ్ మేస్త్రీ

పేటకు త్వరలో ప్యాసింజర్ రైలు

- తీరనున్న ఆ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం
- ప్రజల చూపు అభివృద్ధి వైపు
- ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వ విప్ ఉదయభాను



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సుమారు అయిదు దశాబ్దాలుగా జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం అయిన ప్యాసింజర్ రైలు కల నెరవేరే సమయం ఆసన్నమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. రైలు త్వరలోనే పట్టాలెక్కబోతోందన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్ల 10 నెలల కాలంలో జగ్గయ్యపేట పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ప్రజల మద్దతు ఉందన్నారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ప్యాసింజర్ రైలు త్వరలో పట్టాలెక్కబోతోందన్నారు. ఈ రైల్వే లైనుకు సంబంధించి మోటమర్రి–విష్ణుపురం డబుల్ లైన్, మోటమర్రి వద్ద రైలు ఓవర్ రైలుకు రూ.1,746 కోట్లు అంచనా వ్యయానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. దీంతో పేటకు ప్యాసింజర్ రైలు కల త్వరలో సాకారం కానుందన్నారు.

ఈ అయిదేళ్లలో పేటలో అభివృద్ధి గణాంకాలు

- రూ.కోటి నిధులతో జాతీయ రహదారికి ఆనుకుని హైవే బస్టాండ్ నిర్మాణం.
- రూ.3.5 కోట్లతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ కల్యాణమండపం నిర్మాణం.
- రూ.65 కోట్లతో కృష్ణానదిపై ముక్త్యాల వద్ద వంతెన నిర్మాణం.
- నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం.
- రూ.14 కోట్లతో జగ్గయ్యపేట–చిల్లకల్లు మధ్య 5 కి.మీ మేర ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం.
- రూ.3 కోట్లతో పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి, ఉక్కు కళావేదిక, షాదీఖానా నిర్మాణం.
- రూ.4 కోట్లతో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి.

పదేళ్లు పాలించిన తెలుగుదేశం ఎమ్మెల్యే నియోజకవర్గానికి ఎటువంటి మేలు చేయలేదని ఆరోపించారు. పైగా ఇప్పుడు తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కోర్టులో కేసులు వేస్తూ అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. కేసులతో అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. తన కుటుంబంపై నిరాధార ఆరోపణలతో కథనాలు రాయించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలను నిరూపించాల్సిందిగా ఆయన సవాల్ విసిరారు. ప్రజాసేవకే రాజకీయాల్లో ఉన్నాను తప్ప స్వలాభం కోసం కాదని చెప్పారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి రాంబాబు, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ కొమరగిరి భరద్వాజ్ పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన నాటకం ఖోనా



బంగ్లాదేశ్ వారి నాటకం ఖోనాలోని రసవత్తర సన్నివేశం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్న భారత్ రంగస్థల మహోత్సవ్ జాతీయ సమైకత్యను చాటుతోంది. శుక్రవారం నాటి ప్రదర్శనలో ఎ ఫెర్మామెన్స్ స్పేస్ ఢాకా వారి బంగ్లా భాషలో ప్రదర్శించిన ఖోనా నాటకం సందేశాత్మకంగా సాగింది. బంగ్లా దేశపు వారి సంస్కృతి సంప్రదాయాలు, సంగీతం, ఆట పాటలు, రాజ్యాధికారం కోసం జరిగే ఎత్తులు పై ఎత్తులు, స్త్రీల జీవన విధానం అంశాలతో నాటకం సాగుతుంది. దర్శకుడు మహ్మద్ అలీ హైదర్. కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫ్యాకల్టీ వివేక్ ఇమ్మనేని మాట్లాడుతూ భారతీయ నాటక వైభవం నేటి తరాలకు అందించాలని సూచించారు. వందే భారతం వసుధైక కుటుంబం నినాదంతో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్.మల్లికార్జునరావు, సాంస్కృతిక శాఖ మేనేజర్లు సీహెచ్ శ్రీనివాస్, సుమన్ నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

ఖడ్గమాలార్చన, చండీ హోమాలకు డిమాండ్



అమ్మవారి ఉత్సవ మూర్తి



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమావాస్య నేపథ్యంలో శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారి ఆంతరాలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, చండీ హోమాలకు డిమాండ్ అధికంగా కనిపించింది. చండీహోమంకు రికార్డు స్థాయిలో ఉభయదాతలు తరలివచ్చి తమ నామ, గోత్రాలతో హోమం జరిపించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణంలోనూ ఉభయదాతల తాకిడి కనిపించింది. మరో వైపున అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి తరలివచ్చారు. మహా నివేదన నేపథ్యంలో 11:40 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహా నివేదన అనంతరం దర్శనాలు తిరిగి ప్రారంభం కాగా మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు రమేష్‌బాబు, చంద్రశేఖర్ క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గౌరవరంలో పెట్రోల్ బంక్



పెట్రోల్ బంకు స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ స్నిగ్ధ

గౌరవరం(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ తెలిపారు. పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన నిమిత్తం శుక్రవారం ఆమె ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో తొలిసారిగా గౌరవరంలో భారత్ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఇందునిమిత్తం స్థలాన్ని కూడా సేకరించామని, మరికొద్ది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. డీసీఎంఎస్ ద్వారా విజయవాడలో జనరిక్ మందుల కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. డీసీఎంఎస్ ద్వారా జిల్లాలో 104 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ డీవీ ప్రసాదరావు, సొసైటీ జిల్లా సభ్యుడు గింజుపల్లి రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ సూర్యప్రకాష్, భారత్ పెట్రోలియం ప్రతినిధులు రాందాస్, గురు ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ చర్యలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహనరావు అన్నారు. కొండపల్లి ఐడీఏలో మూడు రోజులపాటు జరిగిన ప్రమాదాల నివారణ, ప్రాథమిక చికిత్స శిక్షణ శిబిరం ముగింపు సభలో జిల్లా అగ్నిమాపక అధికారి శంకరరావుతో కలసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ చేపడుతున్న ప్రమాదాల నివారణ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మైలవరం అగ్నిమాపక అధికారి నరేష్, ఐలా చైర్మన్ ఎంవీ రామలింగేశ్వరరావు, కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా తుది దశ పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి విశాఖ వేదికైంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం విశాఖ రైల్వే స్టేడియంలో ప్రారంభించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, కలెక్టర్ మల్లికార్జున పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 26 జిల్లాలకు చెందిన జట్ల చేత క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. తొలుత రైల్వే స్టేడియంలోని వేదిక వద్ద శాప్ పతాకాన్ని ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, జాతీయ పతాకాన్ని మంత్రి రోజా ఆవిష్కరించగా అతిథులు గౌరవవందనం సమర్పించారు. పోటీలను ప్రారంభిస్తున్నట్టు మంత్రి ప్రకటించి గాల్లోకి బెలూన్లను విడిచారు. అనంతరం అతిథులు క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు. తొలిరోజు బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన హాసిత–రమ్య జోడీ 21–09, 21–11తో సత్యప్రియ–రోహిత జోడీపై విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈనెల 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. 13న ముగింపు వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు.



పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల జట్లు

తూర్పున అద్దంలా రహదారులు

- వేగంగా కాలనీలు అభివృద్ధి
- రూ.150 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పన
- సీసీ, బీటీ రోడ్లుతో పాటు సైడు డ్రెయిన్‌లు నిర్మాణం
- ఎన్నడూ లేనంతగా అభివృద్ధి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమర్థవంతమైన నాయకుడు ఉంటే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో ఈ నాలుగున్నరేళ్లలో చేసి చూపించారు. ప్రచారం కోసం షో రాజకీయాలకు తావులేకుండా ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడుంటే నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందుతుందో తూర్పును చూస్తే తెలుస్తుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఏకంగా రూ.650 కోట్లు అభివృద్ధి జరగ్గా రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కోసమే రూ.150 కోట్లు ఖర్చు చేశారు. ఒకప్పుడు గుంతల మయంగా, వర్షం వస్తే నీళ్లు నిలిచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉండే కాలనీల్లోని రోడ్లు, నేడు రివ్వున దూసుకుపోయే విధంగా అభివృద్ధి చెందాయి. అందుకు వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కృషి ఎంతో ఉందని నియోజకవర్గ ప్రజలే అంటున్నారు.

కాలనీలు బాగుపడ్డాయి....

ఒకప్పుడు మూడో డివిజన్‌లోని కనకదుర్గనగర్, కరెన్సీనగర్, కామినేనినగర్ వెళ్లాలంటే రోడ్లు దుమ్ముకొట్టుకుపోయేవి. వర్షం వస్తే నీరు నిలిచి ఇబ్బందులు పడేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి మారింది. రోడ్లన్నీ బీటీ, సిమెంటు రోడ్లు వేసారు. ఆ రోడ్లపై కాలనీ వాసులు హాయిగా వెళుతున్నారు. సుమారు ఆ డివిజన్‌లో ఏకంగా రూ.18 కోట్లు అభివృద్ధి జరిగింది. అంతేకాదు నాలుగో డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీలో ఒకప్పుడు రోడ్లు గుంతల మయంగా ఉండేవి. దేవినేని అవినాష్ చొరవతో రూ.4.50 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు వేశారు. ఇప్పుడు కాలనీలోని రోడ్లు మిళమిళ మెరుస్తున్నాయి. ఇలా అన్నీ కాలనీల్లో ఇదే పరిస్థితి.


పిన్నమనేని పాలిక్లినిక్ రహదారి


బృందావనకాలనీలో వేసిన రోడ్డు


కామినేని నగర్‌లో వేసిన రహదారి

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం....

గత ప్రభుత్వంలో కాలనీల్లోని రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని, వర్షం వస్తే నీళ్లు నిలిచి నడవలేకున్నా పాలకులు స్పందించలేదు. ప్రజలు ఎన్నిసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడమే కాకుండా నియోజకవర్గంలోని రోడ్లు అభివృద్ధి చేశారు. దీంతో ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వమని ప్రజలు కొనియాడుతున్నారు.

మౌలిక సదుపాయాలకు రూ.150 కోట్లు

కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏకంగా రూ.150 కోట్లు వెచ్చించారు. అందులో పెద్ద మొత్తంగా రోడ్డు నిర్మాణాలకు ఖర్చు చేయగా, మంచినీటి సరఫరా, యూజీడీ లైన్లు, సైడు డ్రెయిన్ నిర్మాణ పనులు కూడా చేశారు. కొండ ప్రాంతాల్లో మెట్లు నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారు.



కాలనీలు అభివృద్ధి చెందాయి

గతంలో కాలనీల్లో రోడ్లు గుంతలు మయంగా ఉండి ప్రజలు ఎంతో ఇబ్బంది పడేవాళ్లు. కాలనీల్లో రోడ్లు వేయాలని ఎమ్మెల్యే వద్దకు వెళితే పట్టించుకోక పోవడంతో, వాళ్లు దేవినేని అవినాష్‌ను కలిసారు. ఆయన చొరవతో కాలనీల్లో రోడ్లు అన్నీ సీసీ, బీటీ రోడ్లు వేశారు. నిరంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న నాయకుడు దేవినేని అవినాష్. ఆయన సారథ్యంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందింది.

–గల్లా పద్మావతి, నాలుగో డివిజన్ ఇన్‌చార్జి



అభివృద్ధి చేసి చూపించాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తాను ఉంటున్న సొంత డివిజన్‌లోనూ అభివృద్ధి చేయలేకపోయాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అయ్యప్పనగర్‌లో రోడ్లు వేశారు. అంతేకాదు ఎమ్మెల్యే గద్దె దత్తత తీసుకున్న డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అభివృద్ధి చేసింది. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో ఈ నాలుగున్నరేళ్లలో చేసి చూపించడం జరిగింది.

–ఎండీ రిజ్వాన్, అయ్యప్పనగర్

భక్తులతో పోటెత్తిన గుణదల కొండ


సమిష్టి దివ్యబలిపూజ నిర్వహిస్తున్న రెవరెండ్ ఫాదర్ లూయిస్‌రాజు


ప్రార్థనలు నిర్వహిస్తున్న గురువులు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- తిరునాళ్ల సందడి
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహణ

గుణదల(విజయవాడ తూర్పు): మేరీమాత ఉత్సవాల ప్రారంభంతో గుణదల కొండ భక్తులతో పోటెత్తింది. మరియతల్లి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మేరీమాతను దర్శించుకున్న భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కరుణించు మేరీమాతా అంటూ ప్రార్థించారు. కొవ్వొత్తులు వెలిగిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ, ఉయ్యాలలు కడుతూ మరియతల్లిని వేడుకుంటున్నారు. తిరునాళ్లలో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు యాత్రికులకు నోరూరించే విధంగా ఉన్నాయి. ఏడాదికొక్కసారి మాత్రమే కనిపించే బెల్లపు బూందీ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నల్లని బెల్లపు చెరకులు, పిల్లలు అమితంగా ఇష్టపడే పీసు మిఠాయిలు, అందరూ ఇష్టపడే ఖర్జూరాలు , వేడి వేడి జిలేబీలు ఇలా పలు రకాల రుచులు ఆకట్టుకుంటున్నాయి. వీటిని ఆస్వాదిస్తూ యాత్రికులు సందడి చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటయిన వేదిక పై కళాకారులు చేస్తున్న ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలకు భక్తులు తన్మయం పొందుతున్నారు. సంసోను డెలీల, లాజరు జీవిత సువిశేషాలను వివరిస్తూ చేసిన నృత్య రూపకాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొండపై మరియతల్లిని దర్శించుకుని వచ్చిన భక్తులను ఆధ్యాత్మికంగా ప్రేరేపించి సేదదీర్చే విధంగా ప్రదర్శనలు సాగుతున్నాయి.


విద్యుద్దీపకాంతులతో గుణదల మేరీమాత గుడి

పుణ్యక్షేత్రంలో నేటి కార్యక్రమాలు

ఉదయం
6 గంటలకు – ఉదయకాల ప్రార్థన
7 గంటలకు – సమిష్టి దివ్యబలి పూజ
10 గంటలకు– పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్థనలు
11 గంటలకు– భక్తి గీతాలు
11:30 లకు – దివ్యబలిపూజ దేవాలయములో

మద్యాహ్నం
12 గంటలకు– కోలాటం
1 గంటలకు – సాంస్కృతిక కార్యక్రమాలు
2 గంటలకు – కోలాటం
3 గంటలకు – దివ్యబలిపూజ దేవాలయములో

సాయంత్రం
5 గంటలకు – పరిశుద్ధ జపమాల
6 గంటలకు – సమిష్టి దివ్యబలిపూజ

రాత్రి
8:30 గంటలకు– గుణదలమాత సంక్షిప్త చరిత్ర
9 గంటలకు – అమృత వర్షిణి నృత్య రూపకం
10:30 గంటలకు – సౌలు మనోపరివర్తనం ఏక పాత్రాభినయం
11:30 గంటలకు– పూల గంప – బుర్రకథ
ఒంటి గంటకు – లాజరు ధనవంతుడు – నాటకం


ప్రార్థనలో పాల్గొన్న భక్తులు


గురువులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు


మరియమ్మ తల్లి విగ్రహం

బెంజ్‌సర్కిల్ సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తేవాలి


నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని బెంజ్ సర్కిల్ సర్వీస్ రోడ్డు త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బెంజ్ సర్కిల్ సర్వీస్ రోడ్డును నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) మేనేజర్, ఏపీసీపీడీసీఎల్ ఏఈ, పోలీస్ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరగా రోడ్లు పూర్తి చేయాలని సూచించారు. వర్షపు నీరు నిలువకుండా ఉండేందుకు డ్రెయిన్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించే దిశగా సర్వీస్ రోడ్డు నుంచి బెంజ్ సర్కిల్ హైవే లోకి వెళ్లేలా రహదారులను అనుసంధానం చేయాలని సూచించారు. రోడ్లు వేస్తున్న తరుణంలో ఎలక్ట్రిసిటీ పోల్స్ తో ఇబ్బంది ఉంటే ఏపీ సీపీడీసీఎల్ సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల్లో రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లు, రోడ్లు పూర్తి చేసిన తర్వాత కాలుష్యాన్ని తగ్గించేలా గ్రీనరీ ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ–3 చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (పార్క్స్) ఏఎస్ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, జాతీయ రహదారి మేనేజర్, ఏపీ సీపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో భూమిక ప్రతిభ


భూమికను సత్కరిస్తున్న సిద్ధార్థ మహిళా కళాశాల కన్వీనర్ లలిత్‌ప్రసాద్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఢిల్లీలో గత నెల జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గన్న విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ కె.భూమికను ఆ కళాశాల యాజమాన్యం శుక్రవారం అభినందించింది. ఆ కళాశాల కన్వీనర్ ఎస్.లలిత్‌ప్రసాద్, డైరెక్టర్ టి. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పనలు సత్కరించారు. కాగా భూమిక ఎన్‌సీసీలో 4వ ఆంధ్రా బెటాలియన్ (ఆర్మీ) తరపున ఆర్‌డీసీ క్యాంపుకు ఎంపికై, సత్తా చాటింది. ఆర్డీసీ (రిపబ్లిక్ డే క్యాంప్)లో ఆమె ఉన్న గ్రూప్ సాంగ్‌కు మొదటి బహుమతితో నాటు నేషనల్ ఇంటిగ్రేషన్ ఎవేర్‌నెస్ ప్రోగ్రామ్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ క్యాంప్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖర్, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్‌పాండే సమక్షంలో భూమిక బృందం గ్రూప్‌సాంగ్‌ను ప్రదర్శించినట్లు ఆ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పీవీ దుర్గావతి హర్షం వ్యక్తం చేశారు. అంతేకాక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీలను కలిసే అవకాశం కూడా లభించినట్లు ఆమె తెలిపారు. భూమికను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అకాడమీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని కళాశాలలోని సాంస్కృతిక వేదికపై గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆపాత మధురలో పేరుతో సాగిన కార్యక్రమంలో ఘంటసాల, బాలుతో పాటు సుశీల, ఎస్.జానకి, చిత్ర ఆలపించిన గీతాలను రమణ శీలం, నందితా జ్యోతి, గాగర్లపూడి నాగార్జున ఆలపించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ ఎన్.లలిత్ ప్రసాద్, ఎగ్జిగ్యూటివ్ కమిటీ సభ్యులు తాతినేని శ్రీహరిరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా రాణిగారితోటలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణలంక సబ్‌స్టేషన్ రాణిగారితోట ఫీడర్ పరిధిలోని ఆంటోనీ స్ట్రీట్, గంగానమ్మ గుడి ఏరియా, వారధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీవనోపాధి నిమిత్తం బండ్లు పంపిణీ



గుణదల (విజయవాడ తూర్పు): పేదలకు జీవనోపాధి నిమిత్తం దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐదుగురు పేదలకు లక్ష రూపాయలు విలువ చేసే రెండు టిఫిన్ బండ్లు, రెండు తోపుడు బండ్లు, ఒక ఇస్త్రీ బండి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు బాసటగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తాము సమాజ సేవ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలో అనేక మందికి జీవనోపాధి నిమిత్తం బడ్డీ కొట్లు, తోపుడు బండ్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, దేవినేని నెహ్రూ ట్రస్ట్ చైర్మన్ దేవినేని సుధీర, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ఎంపీ కేశినేని నాని

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని విజయవాడ ఎంపీ కేశినేని నాని ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీని అభ్యర్థించారు. దేశ ప్రజలు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తిగా ఎన్టీఆర్ సామాన్య కుటుంబం నుంచి ఎదిగారని తెలిపారు. ప్రఖ్యాత సినీ నటుడుగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తికి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఇవ్వడమే నిజమైన నివాళి అన్నారు.

ఉత్సాహంగా ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పోటీలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు వృత్తి విద్యాకోర్సులను నేర్చుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని పారిశ్రామికవేత్త సీహెచ్.సత్యశ్రీ చెప్పారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా ఉత్సవ్–2024లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 12 మంది మహిళలు పాల్గొన్నారు. జనశిక్షణ సంస్థాన్ రిసోర్స్ పర్సన్స్ పి.వరలక్ష్మి, ఎన్.సునీత వ్యవహరించారు. పి.రాజేశ్వరి ప్రథమ, ద్వితీయ బహుమతిని సీహెచ్ సుశీల గెలుపొందారు. విజేతలకు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ, సీహెచ్ సత్యశ్రీ జ్ఞాపికలను అందచేశారు. జనశిక్షణ సంస్థాన్ రిసోర్స్ పర్సన్స్‌తో పాటుగా మహిళలు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు బాతిక్, హ్యాండ్ ప్రింట్ వస్త్రధారణ పోటీలు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ హనుమాన్ నృత్య కళా నిలయంకు చెందిన పలువురు చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శుక్రవారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి ప్రసాదాలను అందచేశారు.

భక్తిశ్రద్ధలతో మరియమాత తేరు ప్రదక్షిణ


తేరు ప్రదక్షిణలో పాల్గొన్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): లోకమాతగా కీర్తించబడుతున్న మరియతల్లి దీవెనలు ఉంటే జీవితాలు సుఖప్రదంగా ఉంటాయని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. గుణదల మేరీమాత ఉత్సవాలలో భాగంగా శుక్రవారం జరిగిన తేరు ప్రదక్షిణ ఊరేగింపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణదల పుణ్యక్షేత్రం స్థాపించబడి నూరు వసంతాలు పూర్తి కావడం హర్షణీయమన్నారు. ఆ తల్లి చల్లని దీవెనలు ప్రజలందరి పై కురిపించాలని ఆకాంక్షించారు. గుణదల మాత తమ కుటుంబానికి ఎల్లప్పుడూ తోడుగా ఉందని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా ఈ తేరు ప్రదక్షిణలో మరియ తల్లి ఉత్సవ విగ్రహాన్ని తాము ఊరేగించడం సంప్రదాయంగా వస్తోందని గుర్తు చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు మరియమాత దీవెనలు పొందాలని ఆశించారు. అనంతరం తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజనీరు కొల్లి వెంకటేశ్వరరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వ్యవసాయ కుటుంబంలో పుట్టి ఇంజనీరుగా ఎదిగి పలు నిర్మాణాల్లో కీలక పాత్ర వహించిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు కొల్లి వెంకటేశ్వరరావు(86) మరణం తీరని లోటు అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. అనారోగ్య కారణంతో కొల్లి వెంకటేశ్వరరావు నగరంలోని రమేష్ ఆసుపత్రిలో శుక్రవారం కన్నుమూశారు. గాయత్రినగర్‌లో ఉన్న ఇంటి ఆవరణలో ఉంచిన కొల్లి వెంకటేశ్వరరావు మృతదేహానికి దేవినేని అవినాష్ నివాళులర్పించారు. మాచర్ల, ఖమ్మం, కావలిలో పలు వంతెనలతో పాటుగా విజయవాడ గుణదలలోని మూడు వంతెనలు, గాంధీ హిల్ ప్లానిటోరియం డోమ్ వర్క్ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర వహించారని తెలిపారు. తిరుపతిలో టీటీడీకి సంబంధించిన నీటి ప్రాజెక్టులు, ఖమ్మంలో ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌పై 60 అడుగుల ఎత్తులో డ్యామ్ నిర్మాణం, కంచికచర్ల, మూలపాడు, ఇబ్రహీంపట్నం , కొండపల్లిలో మేజర్ కాలువల నిర్మాణ పనుల్లో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. 1996 సంవత్సరంలో కొల్లి వెంకటేశ్వరరావు రిటైర్డ్ అయ్యారన్నారు. గన్నవరంలోని డ్రైవింగ్ స్కూల్ నిర్మాణం, డాక్టర్ రమేష్ ఆసుపత్రుల నిర్మాణంలో కూడా వెంకటేశ్వరరావు కీలక పాత్ర వహించారు.

11 నుంచి నగరంలో రథయాత్ర



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో ఐదు అడుగుల శివసూర్యుడు విగ్రహ ప్రతిష్ట , కళ్యాణ నవగ్రహ ప్రతిష్టలో భాగంగా ఇంటింటికీ సూర్యదర్శనం, ప్రతి ఇంటా ఆరోగ్యం కార్యక్రమం ద్వారా నగరంలో 58 రోజుల పాటు రథయాత్ర నిర్వహించనున్నట్లు పీఠాధిపతి శివాచార్య స్వామి తెలిపారు. ఏలూరు రోడ్డులోని శ్రీ శివజ్ఞాన పీఠంలో శుక్రవారం రథయాత్ర, శైవాగమ పూర్వక భార్య సహిత నవగ్రహ ప్రతిష్ట కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు 58 రోజుల పాట నగరంలో రథయాత్ర ద్వారా తొమ్మిది రకాల నవగ్రహ వ్రతములు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు శివజ్ఞాన పీఠంలో సంప్రదించాలని కోరారు. పీఠం గౌరవ సలహాదారులు గుండు దిలీప్, ధర్మాధికారి పేర్ల శ్యాంప్రసాద్, సభ్యులు హైమావతి తదితరులున్నారు.

క్లుప్తంగా...

చంద్రబాబు ఎవరి కాళ్లయినా పట్టుకుంటాడు

మంత్రి మేరుగు నాగార్జున



చీమకుర్తి: 'అధికారం కోసం ఏ పార్టీతోనైనా పొత్తు పెట్టుకుంటాడు చంద్రబాబు. ఎవరి కాళ్లయినా పట్టుకుంటాడు. ఎలాంటి నీచ రాజకీయాలు చేయడంలోనైనా సిద్ధహస్తుడు' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. చీమకుర్తిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'ఇప్పటికే చంద్రబాబు అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నాడు. 2014లో బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చాడు. బీజేపీతో విడిపోయాక ప్రధాని నరేంద్ర మోదీని చంద్రబాబు అన్న మాటలు బీజేపీ నాయకులు, ప్రజలు ఇంకా మరచిపోలేదు. మళ్లీ ఆ పార్టీతో పొత్తు కోసం వెంపర్లాడుతూ అమిత్‌షా కాళ్లు పట్టుకోవడం సిగ్గుచేటు. అందితే జుట్టు, అందకపోతే కాళ్లు.. ఇదీ చంద్రబాబు నైజం' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ పొత్తు లేకుండా 175 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీచేసే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు.

ఏమీ చేయకున్నా.. ఏదో చేసినట్టుగా బాబు బిల్డప్

ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజం



సాక్షి, అమరావతి : నిత్యం అబద్ధాల్ని వల్లె వేస్తూ.. ఏమీ చేయకున్నా చేసినట్టు బిల్డప్ ఇచ్చుకుంటున్న చంద్రబాబును ప్రజలు 2019లోనే తిరస్కరించి మూలనబెట్టారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత మండిపడ్డారు. చంద్రబాబు పక్కనున్నోళ్లంతా అభివృద్ధి నిరోధక శక్తులేనని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థి వైవీ సుబ్బారెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో సునీత కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు చరిత్ర అంతా అబద్ధాల ప్రపంచమేనని చిన్న పిల్లోడిని కదిలించినా చెబుతారన్నారు. చంద్రబాబు అబద్ధాలతో పుట్టి.. అబద్ధాలతోనే బతికేస్తారని ఎద్దేవా చేశారు. చెప్పిన అబద్ధాలే మళ్లీ మళ్లీ చెబుతుండటం వల్లే టీడీపీ రా.. కదలి రా.. సభలకు ప్రజల స్పందన కరువైందన్నారు. ఆయనతో తిరిగే వారంతా అభివృద్ధి నిరోధకులేనని చెప్పారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు పెత్తందార్లకు ప్రతినిధులని, పేదలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేస్తున్నారని పోతుల సునీత మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు బుద్ధి చెప్పే బాధ్యతను ప్రజలే తీసుకుంటారని సునీత స్పష్టం చేశారు.

బీజేపీ రాష్ట్రానికి ఏమిస్తానంది 'బాబూ'

కొత్తగా ఏం ఒరగబెట్టిందని పొత్తుకు వెంపర్లాట : కేవీపీ



సాక్షి,అమరావతి: రాష్ట్ర ప్రయోజనాల కోసమే అమిత్‌షాను కలిశానని చెప్పుకుంటున్న చంద్రబాబు రాష్ట్రానికి బీజేపీ కొత్తగా ఏం హామీలిచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీల పొత్తులు మార్చడంలో నితీష్‌కుమార్‌ను చంద్రబాబు మించిపోయారని విమర్శించారు. అమిత్‌షా, రాహుల్ గాంధీపై రాళ్లేయించిన ఘనుడు చంద్రబాబు అని, మోదీపై వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారని కేవీపీ గుర్తుచేశారు. 2019లో ధర్మపోరాట దీక్ష ఎందుకు చేశారో, నిన్న అమిత్‌షా, జేపీ నడ్డాను కలిసి ఏం అంశాలు చర్చించారో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. ప్రత్యేక హోదా అక్కర్లేదన్న చంద్రబాబు, ఇప్పుడు ఎందుకు జాతి ప్రయోజనం అంటున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిలో రాజధాని నిర్మాణ సమయంలో మోదీ కలుషిత మట్టి, జలాలు తెచ్చి ఏపీ నోట్లో మట్టి కొట్టారన్నారు.

ఎన్డీఏలో చేరడమే టీడీపీకి మరణశాసనం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఎన్డీఏలో చేరడమే టీడీపీకి మరణ శాసనమని, రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీని చంద్రబాబు ఎలా భుజానికెత్తుకుని మోస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. తాజా రాజకీయ పరిణామాలపై సీపీఎం, సీపీఐ రాష్ట్ర ముఖ్య నేతలు విజయవాడలో శుక్రవారం సమావేశమై చర్చించారు. ఈ నెల 20న ఉభయ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో రాజకీయ సదస్సును నిర్వహించి ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఉభయ పార్టీల ముఖ్య నేతలతో కలిసి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్‌లు స్వార్థంతో పదవులు, అధికారం కోసం అవకాశవాదంగా బీజేపీ పంచన చేరారని విమర్శించారు. అర్ధరాత్రి అమిత్‌షాతో చేసుకున్న చీకటి ఒప్పందాలేమిటో చంద్రబాబు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మతతత్వ బీజేపీ పెట్టే చిచ్చుకు చంద్రబాబు బాధ్యత వహించాలన్నారు. సీపీఎం, సీపీఐ నేతలు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు, రమాదేవి, జల్లి విల్సన్, అక్కినేని వనజ పాల్గొన్నారు.

జస్టిస్ రాకేష్‌పై 'సుప్రీం' సీరియస్!

▶ మొదటి పేజీ తరువాయి

పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. ఈ మేరకు ఆ వ్యాఖ్యలను తీర్పు నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేదీ, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం శుక్రవారం కీలక ఉత్తర్వులు వెలువరించింది.



ఏం జరిగిందంటే...?

మిషన్ బిల్డ్ ఏపీ కింద ప్రభుత్వ ఆస్తులను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై 2020 డిసెంబర్‌లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాకేష్‌కుమార్, జస్టిస్ రమేష్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ జరిగినప్పుడల్లా జస్టిస్ రాకేష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి అభ్యంతరకర, ఘాటు వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దివాలా తీసిందా..? రాష్ట్రంలో ఆర్థిక అత్యాయక పరిస్థితి ఉందా? అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాజ్యాల విచారణను గమనించిన ప్రతి న్యాయవాది జస్టిస్ రాకేష్‌కుమార్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నట్లు అర్థం చేసుకున్నారు. ఈ ధోరణిని ఎన్నోసార్లు భరిస్తూ వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం చివరకు మీరు విచారిస్తే న్యాయం జరిగే అవకాశం లేదని, అందువల్ల ఈ వ్యాజ్యాల విచారణ నుంచి తప్పుకోవాలంటూ (రెక్యూజ్) జస్టిస్ రాకేష్‌కుమార్‌ను కోరింది. ఆ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. దీంతో జస్టిస్ రాకేష్‌కుమార్ తీరు ప్రజలందరికీ తెలిసింది. ప్రభుత్వం న్యాయబద్ధంగా చేసిన అభ్యర్థనతో జస్టిస్ రాకేష్ కుమార్ అహం దెబ్బ తిన్నది. తనను విచారణ నుంచి తప్పుకోమనడం ధిక్కారపూర్వక చర్యే అవుతుందని జస్టిస్ రాకేష్ కుమార్, జస్టిస్ రమేష్‌ల ధర్మాసనం తీర్పు వెలువరించింది. ధర్మాసనం తరపున జస్టిస్ రాకేష్ కుమారే తీర్పు రాశారు. విచారణ నుంచి తప్పుకోవాలన్న ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొలీజియంపై తీవ్ర వ్యాఖ్యలు

సర్వ సాధారణంగా ప్రభుత్వం చేసిన అభ్యర్థన పట్ల అభ్యంతరం ఉంటే ఏ న్యాయమూర్తి అయినా ఉత్తర్వులు జారీ చేసి అంతటితో ఆగిపోతారు. జస్టిస్ రాకేష్ కుమార్ మాత్రం అలా ఆగలేదు. ఆ తీర్పు ద్వారా తన అసలు నైజాన్ని బయటపెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వంపైనే కాకుండా అప్పటి ఏపీ, తెలంగాణ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేసినందుకు సుప్రీంకోర్టు కొలీజియంపై సైతం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏకంగా 55 పేజీల తీర్పు వెలువరుస్తూ మిషన్ బిల్డ్‌పై దాఖలైన వ్యాజ్యాలతో సంబంధం లేని అంశాలను ప్రస్తావించారు. ఏ పిటిషనర్ ప్రస్తావించని అంశాలతోపాటు తమ ముందున్న కేసుతో సంబంధం లేని వివరాలను, వెబ్‌సైట్లలో ఉన్న వాటిని సైతం తీర్పులో పొందుపరిచారు. ప్రధానంగా ముఖ్యమంత్రి జగన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన ప్రతిష్టను దెబ్బతీసేలా పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌పై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బనాయించిన కేసుల గురించి తన తీర్పులో ప్రముఖంగా ప్రస్తావించారు. జగన్‌మోహన్‌రెడ్డి గురించి తనకు తెలియదని, తరువాత చాలా ఆసక్తికర విషయాలు తెలుసుకున్నానంటూ ఓ న్యాయమూర్తి చేయకూడని వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా గూగుల్‌లో ఖైదీ నెంబర్ 6093 అని టైప్ చేస్తే చాలా సమాచారం వస్తుందంటూ వ్యాఖ్యానించారు. తన పదవీ విరమణకు ఒక్క రోజు ముందు జస్టిస్ రాకేష్ కుమార్ ఈ వివాదాస్పద తీర్పును వెలువరించారు. ఆ మరుసటి రోజు ఆయన పదవీ విరమణ చేసి ఇంటికి వెళుతుండగా టీడీపీ కార్యకర్తలు, ఆ పార్టీ మద్దతుదారులు రోడ్డుకు ఇరువైపులా నిలబడి ఆయనను పసుపు పూలతో ముంచెత్తారు. ఆయనకు సాష్టాంగ నమస్కారాలు చేసి స్వామిభక్తిని చాటుకున్నారు.

'సుప్రీం' విస్మయం..

ఈ తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2021లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం జస్టిస్ రాకేష్ కుమార్ తీర్పుపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. ఆ తీర్పు తమను ఆందోళనకు గురి చేస్తోందంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. నిమిషం ఆలస్యం చేయకుండా జస్టిస్ రాకేష్ కుమార్ తీర్పు అమలుపై స్టే విధిస్తూ 2021 ఫిబ్రవరి 10న మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అనంతరం ఈ వ్యాజ్యంపై జస్టిస్ బేలా త్రివేదీ ధర్మాసనం పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా మరోసారి విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. జస్టిస్ రాకేష్ కుమార్ కేసుతో సంబంధం లేని అంశాలను ప్రస్తావించారని నివేదించారు. పలు అంశాలపై అవసరం లేని వ్యాఖ్యలు చేశారన్నారు. సుప్రీంకోర్టు కొలీజియంపై కూడా విమర్శలు చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల పాలనాపరంగా పలు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్, రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియంను విమర్శిస్తూ జస్టిస్ రాకేష్ కుమార్ తన తీర్పులో చేసిన వ్యాఖ్యలను తొలగించాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ జస్టిస్ రాకేష్ కుమార్ వ్యాఖ్యలన్నింటినీ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అత్యంత వివాదాస్పదుడు

పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ న్యాయమూర్తిగా మారిన జస్టిస్ రాకేష్ కుమార్ న్యాయవ్యవస్థలో అత్యంత వివాదాస్పదుడిగా పేరుపొందారు. బిహార్ మహాదళిత్ వికాస్ మిషన్ ఫండ్ నిధుల విషయంలో ఐఏఎస్ అధికారి రామయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఆయన తోసిపుచ్చారు. అయితే కింది కోర్టు రామయ్యకు బెయిల్ ఇవ్వడాన్ని జస్టిస్ రాకేష్ కుమార్ తప్పుబడుతూ సుమోటోగా విచారణ జరిపారు. తాను బెయిల్ నిరాకరించిన వ్యక్తికి కింది కోర్టు బెయిల్ ఎలా ఇస్తుందని ప్రశ్నిస్తూ దీనిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సివిల్ కోర్టులో అవినీతి జరుగుతోందంటూ సీబీఐ దర్యాప్తునకు ఆదేశించారు. పాట్నా హైకోర్టులో అవినీతి బహిరంగ రహస్యమంటూ ఓ తీర్పే రాశారు. అవినీతి విషయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. జస్టిస్ రాకేష్ కుమార్ తీరును పాట్నా హైకోర్టు న్యాయమూర్తులందరూ సీరియస్‌గా తీసుకున్నారు. అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షాహీ నేతృత్వంలో 11 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ప్రత్యేకంగా సమావేశమై జస్టిస్ రాకేష్ కుమార్ తీర్పును రద్దు చేసింది. జస్టిస్ రాకేష్ కుమార్ తీరుపై ఆ ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా ఆయనను కేసుల విచారణ బాధ్యత నుంచి తప్పించారు. అటు తరువాత సుప్రీంకోర్టు జస్టిస్ రాకేష్‌ను 2019లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేసింది.

రాజ్యాంగ విచ్ఛిన్నమంటూ రభస


ఏపీ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించాక కొద్ది రోజులు మౌనం పాటించిన జస్టిస్ రాకేష్ కుమార్ ఆ తరువాత నిత్యం ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. చిన్న చిన్న కేసుల్లో కూడా ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓ హెబియస్ కార్పస్‌పై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రాజ్యాంగ విచ్ఛినం జరిగిందంటూ విచారణ చేపట్టారు. పలు సందర్భాల్లో డీజీపీని ఆక్షేపించారు. రాజ్యాంగ విచ్ఛిన్నం అంశంపై తీర్పు రాసే అవకాశం కనిపించకపోవడంతో ముఖ్యమంత్రి జగన్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు మిషన్ బిల్డ్ కేసును ఎంచుకున్నారు.

బహుమానంగా ఎన్‌సీఎల్‌ఏటీ పదవి..

పదవీ విరమణ అనంతరం జస్టిస్ రాకేష్ కుమార్‌కు జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) జ్యుడీషియల్ సభ్యుడిగా అవకాశం దక్కింది. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసినందుకే ఎన్‌సీఎల్‌ఏటీ పదవి దక్కిందన్నది న్యాయవ్యవస్థలో అందరికీ తెలిసిన విషయమే. ఎన్‌సీఎల్‌టీలో కూడా ఆయన వివాదాస్పదంగా వ్యవహరించారు. ఏకంగా సుప్రీంకోర్టు ఆదేశాలనే ఉల్లంఘించారు. తనకు కావాల్సిన విషయం విచారణ చేపట్టారు. ఫినోలెక్స్ కేబుల్ వార్షిక సర్వసభ్య సమావేశం ఫలితాల విషయంలో ఏకపక్షంగా వ్యవహరించారు. దీంతో సుప్రీంకోర్టు ఆయనపై కన్నెర్ర చేసి కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమించి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రాకేష్ కుమార్ తీరు వల్ల ఎన్‌సీఎల్‌ఏటీ కుళ్లిపోయిందంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. దీంతో జస్టిస్ రాకేష్ కుమార్ బాగోతం దేశమంతా తెలిసిపోవడంతో గత్యంతరం లేక ఎన్‌సీఎల్‌ఏటీ జ్యుడీషియల్ సభ్యుడి పదవికి రాజీనామా చేశారు.

సామాజిక న్యాయంలో సీఎం జగన్ మరో అడుగు ముందుకు

- వైఎస్సార్‌సీపీ రాజ్యసభ అభ్యర్థిగా ఎస్సీ వర్గానికి చెందిన గొల్ల బాబూరావు ఎంపిక
- ఇప్పటిదాకా వైఎస్సార్‌సీపీ ఖాతాలో 8 రాజ్యసభ స్థానాలు
- అందులో నలుగురు బీసీలకు అవకాశం కల్పించిన సీఎం జగన్
- తాజాగా మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ వర్గానికి
- బడుగు, బలహీన వర్గాల్లో ఒక్కరినీ రాజ్యసభకు పంపని చంద్రబాబు



గొల్ల బాబూరావు

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గంతోపాటు ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవులు, మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులు.. ఇలా ఏ పదవులైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయమంటే ఇదీ.. అని దేశానికి చాటి చెబుతున్నారు. ఇన్నాళ్లూ అణచివేతకు గురై, కేవలం ఓటు బ్యాంకుగానే మిగిలిపోయిన ఈ వర్గాలను సీఎం వైఎస్ జగన్ అక్కున చేర్చుకున్నారు. అన్ని పదవులు, సంక్షేమ పథకాలు, నామినేషన్ పనుల్లో ఈ వర్గాలకు అవకాశం కల్పిస్తూ, వారి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేలా తోడ్పడుతున్నారు. రాజ్యసభ ఎన్నికల్లోనూ ఇదే న్యాయాన్ని పాటిస్తూ బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీ అయిన 8 రాజ్యసభ స్థానాలూ ఆ పార్టీకే దక్కాయి. అందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపారు. తాజాగా రాష్ట్ర కోటాలో మూడు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఈ మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ సామాజివర్గానికి చెందిన పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును సీఎం జగన్ ఎంపిక చేసి, సామాజిక న్యాయంలో మరో అడుగు ముందుకువేశారు. ప్రస్తుతం శాసనసభలో ఉన్న సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే మూడు రాజ్యసభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయం. తద్వారా ఎస్సీ వర్గానికి చెందిన గొల్ల బాబూరావు రాజ్యసభకు ఎంపికవడం ఖాయమని, ఇది సీఎం జగన్ అందిస్తున్న న్యాయమని రాజకీయ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు.

సామాజిక ద్రోహం చేసిన చంద్రబాబు

పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏనాడూ మనుషులుగా చూడలేదు. సామాజిక ద్రోహిగా మిగిలిపోయారు. అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు బడుగు, బలహీన వర్గాలకు కనీస న్యాయం చేయకపోగా, నీచంగా మాట్లాడారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా.. అంటూ దళితుల పట్ల నీచంగా మాట్లాడారు. తోకలు కత్తిరిస్తా, తాట తీస్తా, జడ్జీలుగా పనికిరారంటూ బీసీలను అవహేళన చేశారు. 2014-19 మధ్య చంద్రబాబు సీఎంగా ఉండగా టీడీపీకి దక్కిన రాజ్యసభ స్థానాల్లో ఎస్సీ, బీసీ వర్గాల నుంచి ఒక్కరిని కూడా రాజ్యసభకు పంపలేదు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అంటే 2018లో ఖాళీ అయిన మూడు స్థానాలకు జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఒక స్థానం నుంచి ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్యను అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఆయనకు టికెట్ లేదని అవమానించి ఇంటికి పంపేశారు. వర్ల రామయ్య స్థానంలో సొంత సామాజిక వర్గానికి చెందిన కనకమేడల రవీంద్రకుమార్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసి, ఆయన్నే రాజ్యసభకు పంపడం ద్వారా చంద్రబాబు తన నైజాన్ని బయటపెట్టుకున్నారు.

యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య విద్య

- అందుబాటులో ఉన్న వనరులతో అత్యుత్తమ అవకాశాలు సృష్టిస్తున్నాం
- స్థానిక పరిశ్రమల అవసరాల్ని బట్టి నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- ఏపీ విధానాలు భేష్: మహారాష్ట్ర స్కిల్స్ వర్సిటీ వీసీ అపూర్వ పాల్కర్
- విశాఖలో నేషనల్ స్కిల్ కాంక్లేవ్-2024 ప్రారంభం
- వివిధ సంస్థలతో ఏపీఎస్ఎస్‌డీసీ ఆరు ఎంవోయూలు

సాక్షి, విశాఖపట్నం: అందుబాటులో ఉన్న వనరులతో అత్యుత్తమ అవకాశాలు సృష్టిస్తూ.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య విద్యను అందిస్తున్నామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. విశాఖపట్నంలోని రుషికొండలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.0 పేరుతో నేషనల్ స్కిల్ కాంక్లేవ్-2024 శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యుత్తమ విధానాలు అమలు చేసేందుకు వియత్నాం, జర్మనీ, దక్షిణ కొరియా సహా పలు దేశాల్లో పర్యటించామన్నారు. గత 30-40 ఏళ్లలో నైపుణ్య రంగంలో చాలా మార్పులు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర యువతలో ఏయే విభాగాల్లో నైపుణ్య కొరత ఉందో.. ఎందులో ఎక్కువ శాతం ఉపాధి అవకాశాలు ఉన్నాయో తెలుసుకుని దానికనుగుణంగా కార్యాచరణ చేపట్టామని వివరించారు. స్థానిక పరిశ్రమల అవసరాలను బట్టి నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామని వెల్లడించారు. సన్‌షైన్ ఏపీ కోసం 26 నైపుణ్య అకాడమీలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ సెంటర్లు కూడా ఉన్నాయన్నారు. శిక్షణ ఇచ్చిన తర్వాత వీరిలో 50 శాతం మందిని స్థానిక పరిశ్రమల అవసరాల కోసం ఉపయోగించుకోవాలని అన్ని సంస్థలకు దిశానిర్దేశం చేశామని చెప్పారు. రాష్ట్ర యువత.. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా.. నైపుణ్య శిక్షణ అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష అన్నారు. ఇందుకు అనుగుణంగా ఏపీఎస్ఎస్‌డీసీ పనిచేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.



మంత్రి బుగ్గన సమక్షంలో ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందాలు కుదుర్చుకున్న ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ, ఇతర సంస్థల ప్రతినిధులు

పలు సంస్థలతో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందాలు..

సదస్సులో భాగంగా.. ఏపీఎస్ఎస్‌డీసీతో వివిధ సంస్థలు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. నైపుణ్య శిక్షణకు సంబంధించి 100 మిలియన్ లెర్నర్స్ (అరిజోనా స్టేట్ యూనివర్సిటీ), ట్రస్టెడ్ జాబ్స్, తాత్విక్ బ్యూటీ-వెల్‌నెస్, ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(టీఎన్ఏఐ), ఎక్సెల్ఐఆర్, జీయూవీఐ, హెచ్ఈఆర్ఈ టెక్నాలజీస్, రబ్బర్, కెమికల్, పెట్రో కెమికల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ మొదలైన సంస్థలతో 6 ఎంవోయూలను ఏపీఎస్ఎస్‌డీసీ కుదుర్చుకుంది. ఏపీలో నైపుణ్యాభివృద్ధి కోసం గత ఐదేళ్లలో నిర్వహించిన కార్యక్రమాలపై రూపొందించిన వీడియో ప్రదర్శనకు దేశ, విదేశాల ప్రతినిధుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్‌డీసీ 'న్యూస్కిల్' న్యూస్ లెటర్‌ను మంత్రి బుగ్గన ఆవిష్కరించారు. ఏపీఎస్ఎస్‌డీసీకి సహకారం అందిస్తూ ఉపాధి అవకాశాల్ని మరింత మెరుగయ్యేలా చేస్తున్న బెస్ట్ ప్లేస్‌మెంట్, సీఎస్ఆర్ పార్టనర్లగా కియా మోటార్స్ ఇండియా లిమిటెడ్, లలితా జ్యుయెలర్స్ తదితర 13 సంస్థలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కియా మోటార్స్ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్ డాంగ్లీ, సెంట్రల్ ఎంఎస్ఎంఈ బోర్డు సీఈవో సేతు మాధవన్, సీడాప్ సీఈవో శ్రీనివాసులు, ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేశ్ కుమార్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రెనింగ్ డైరెక్టర్ నవ్య, పలువురు పారిశ్రామికవేత్తలు, వివిధ రాష్ట్రాల స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనలో 3వ స్థానంలో ఏపీ

రాష్ట్రంలో ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గం నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం.. స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలు, హబ్‌లు ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తోంది. దేశంలో అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్రాల్లో మూడో స్థానంలో ఉంది. త్వరలోనే నంబర్‌వన్‌కి చేరుకునే అవకాశాలున్నాయి. – డా. వినోద్ కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో

ఏపీ విధానాలు భేష్

నైపుణ్య శిక్షణ కోసం ఏపీలోనూ అవలంబిస్తున్న విధానాలు అద్భుతంగా ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం మహారాష్ట్ర స్టేట్ స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి ఐదు ప్రధాన విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. మా రాష్ట్రంలో 2.7 లక్షల మందికి ఏడాది కాలంలో ఉద్యోగాలు ఇవ్వగలిగాం. – డా. అపూర్వ పాల్కర్, మహారాష్ట్ర స్టేట్ స్కిల్స్ యూనివర్సిటీ వీసీ

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

దిగజారుడు రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు.. వైఎస్సార్‌సీపీతో తప్ప అన్ని పార్టీలతోనూ పొత్తులు పెట్టుకున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఎద్దేవా చేశారు. విశాఖపట్నంలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన బుగ్గన చంద్రబాబు వైఖరిని తూర్పారబట్టారు. టీడీపీకి ఒక అజెండా, విధానం అంటూ ఏమీ లేవని విమర్శించారు. సైద్ధాంతిక విభేదాలు ఉన్న పార్టీలతో సైతం పొత్తు పెట్టుకోవడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీలకు వేర్వేరు సిద్ధాంతాలు ఉన్నాయన్నారు. వీటితో ఒక్కో పార్టీతో రెండేసి సార్లు పొత్తు పెట్టుకున్న ఘనత చంద్రబాబుదేనని ఎద్దేవా చేశారు. టీడీపీ తోక పార్టీ జనసేన సిద్ధాంతం ఏంటో ఆ పార్టీ శ్రేణులకు సైతం అర్థం కావడం లేదన్నారు. వైఎస్సార్ ఆశయాలు, పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విభజన హామీల అమలు కోసమే సీఎం ఢిల్లీ వెళ్లారని వెల్లడించారు. బీజేపీ, టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం ఉన్నప్పుడు విభజన హామీలను చంద్రబాబు గాలికొదిలేశారని మండిపడ్డారు. వాటన్నింటినీ ఒక్కొక్కటిగా వైఎస్సార్‌సీపీ నెరవేరుస్తోందన్నారు.

టీడీపీ పనైపోయింది

- అవసరమైతే టీడీపీని బీజేపీకి అమ్మేయడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారు: లక్ష్మీపార్వతి



సాక్షి, అమరావతి: టీడీపీ పనైపోయిందని.. దీంతో చంద్రబాబు రాజకీయ జీవితానికి ఎండ్ కార్డు పడినట్టేనని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. గెలుపు ఆశలు లేకపోవడంతో దొంగ సర్వే రిపోర్టులతో ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం లక్ష్మీపార్వతి మీడియాతో మాట్లాడారు. అవసరమైతే టీడీపీని బీజేపీకి అమ్మేయడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏపీ రాజకీయాలకు ఆయనలాంటి దుర్మార్గులు అవసరమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్టీఆర్ పోరాడితే.. అదే కాంగ్రెస్‌కు వంగివంగి దండాలు పెడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ నిజమైన అభిమానులు టీడీపీ నుంచి చంద్రబాబును తరమికొట్టాలన్నారు. ఏపీ విభజన తర్వాత అధికారంలోకి వచ్చి రూ.లక్షల కోట్లు మింగేశారని ఆరోపించారు. చివరికి ఖజానాను ఖాళీ చేసిన చంద్రబాబును 'క్విట్ ఆంధ్రప్రదేశ్' చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక లోకేశ్ శంఖారావం చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టేనన్నారు. రెండు ఎకరాలతో రాజకీయాల్లోకి వచ్చిన చంద్రబాబు రూ.ఆరు లక్షల కోట్లకు ఎలా ఎదిగారని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు. గతంలో బీజేపీని, మోదీని నోటికొచ్చినట్టు తిట్టి.. ఎన్డీఏ 400 సీట్లు గెలుస్తుందని ప్రధాని ప్రకటించగానే విమానం ఎక్కి ఢిల్లీ వెళ్లాడని ఎద్దేవా చేశారు. పురందేశ్వరి బీజేపీ కంటే టీడీపీ గెలుపు కోసమే ఆరాటపడుతోందన్నారు. ఎన్టీఆర్ కుటుంబంలో చిచ్చుపెట్టినట్టే ఇప్పుడు వైఎస్ కుటుంబంలోనూ చంద్రబాబు చిచ్చుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే షర్మిల.. చంద్రబాబు గూటికి చేరి.. ఆయన స్క్రిప్టునే చదువుతోందన్నారు.

అబద్ధాల ఫ్యాక్టరీ చంద్రబాబు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు(చిత్తూరు జిల్లా): చంద్రబాబు ఒక అబద్ధాల ఫ్యాక్టరీ అని, ప్రజలను మోసగించడంలో ఆయన సిద్ధహస్తుడని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలను నమ్మి ఓట్లు వేస్తే రాష్ట్రంలో అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిపోతుందని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి శుక్రవారం పుంగనూరులో మహిళలకు 'వైఎస్సార్ ఆసరా' చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేశారన్నారు. డ్వాక్రా మహిళల అప్పు మాఫీ కింద రాష్ట్రవ్యాప్తంగా 78.94లక్షల మంది ఖాతాల్లోకి నాలుగు విడతల్లో రూ.25,570 కోట్లు జమ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. అప్పట్లో ఉన్న రూ.14,200 కోట్ల రుణాలు వడ్డీతో కలిపి రూ.25 వేల కోట్లకు చేరినట్లు వివరించారు. మళ్లీ చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు కొన్ని పార్టీలతో కలిసి కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసి తిరిగి ధైర్యంగా ఓట్ల కోసం ప్రజల వద్దకు వస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ విషయాలను మహిళలు పూర్తిగా పరిశీలించి ఎవరు మేలు చేశారో తెలుసుకుని ఓట్లు వేయాలని మంత్రి పెద్దిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మెప్మా ఎండీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

అప్పుడు బీజేపీని తిట్టి ఇప్పుడు పొత్తా?

- చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు
- మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్
- గతంలో బీజేపీతో పొత్తుపెట్టుకుని మోదీపై తీవ్ర విమర్శలు చేశావ్
- రాష్ట్రానికి దోసెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చారని నువ్వే చెప్పావ్
- అధికారం కోసం మళ్లీ బీజేపీతో పొత్తులకు వెంపర్లాడుతున్నావ్



చిలకలపూడి(మచిలీపట్నం): అధికారం కోసం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తుంటారని మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. బందరులోని కలెక్టరేట్ వద్ద ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం బాగుపడాలంటే ప్రధానిగా నరేంద్ర మోదీ అవసరమని చెప్పి బీజేపీతో 2014లో పొత్తు పెట్టుకుని గెలిచిన చంద్రబాబు.. అధికారం నుంచి దిగిపోయే ముందు మోదీపై తీవ్ర విమర్శలు చేశారని చెప్పారు. మోదీకి కుటుంబమే లేదు, నాకు భార్య, కొడుకు, కోడలు, మనుమడు ఉన్నారు.., నీకు నాతో పోటీనా అంటూ ఆనాడు మోదీపై చంద్రబాబు చేసిన విమర్శలు నానీ గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆస్తులను తీసుకురావడానికి ప్రయత్నం చేశావా, మోదీ దోసెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చారని నువ్వే చెప్పావ్. ఈడీ, సీబీఐలతో బెదిరిస్తావా అంటూ మోదీపై నువ్వు చేసిన వ్యాఖ్యలు నిజం కాదా అంటూ చంద్రబాబును ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, పోలవరానికి నిధులు ఇవ్వని బీజేపీతో నేడు ఏ విధంగా చంద్రబాబు పొత్తు పెట్టుకుంటున్నారని నిలదీశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితులకు ఇంతవరకు కేంద్రం నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కడప స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎంత సహాయం చేస్తారో కూడా చెప్పలేదన్నారు. రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులకే కాకుండా రాష్ట్రంలో నిర్మాణమవుతున్న ఏ పోర్టులకు కూడా కేంద్రం సహకారం ఇవ్వలేదన్నారు. ఇటువంటి బీజేపీతో అర్ధరాత్రి చర్చలు జరిపి అధికారం కోసం ఏగడ్డినైనా కరుస్తావా అంటూ చంద్రబాబును నిలదీశారు.

ప్రజల గుండెల్లోంచి జగన్‌ను కదపలేరు

ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్ని నాని చెప్పారు. రాష్ట్రంలో పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. పేదరికాన్ని రూపుమాపేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. అటువంటి సీఎం జగన్‌ను ప్రజల గుండెల్లో నుంచి ఎవరూ కదపలేరని అన్నారు. ఇచ్చిన హామీలు తన హయాంలో అమలు చేయని చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులివ్వని బీజేపీ నాయకులతో కలసి సిగ్గు లేకుండా రాబోయే ఎన్నికల్లో జనం దగ్గరకు ఎలా వస్తారని ఆయన ప్రశ్నించారు.



విదేశాలకు చెల్లింపులు చేయలేక దివాలా అంచుల్లో ఉన్న దేశాన్ని ఆర్థిక సంస్కరణలతో గట్టెక్కించిన మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావును భారతరత్న వరించింది. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగానే కాదు.. దేశానికి గాంధీ, నెహ్రూ కుటుంబేతర వ్యక్తుల్లో పూర్తికాలం పనిచేసిన తొలి ప్రధానిగా, మైనార్టీ ప్రభుత్వాన్ని విజయవంతంగా ఐదేళ్లు కొనసాగించిన రాజకీయ చాణక్యుడిగా పీవీ పేరు పొందారు. దక్షిణ భారతదేశం నుంచి ప్రధాని అయిన తొలి వ్యక్తి కూడా పీవీనే కావడం గమనార్హం. ఆయన ఉమ్మడి ఏపీ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా తాను పనిచేసిన అన్ని పదవులకు వన్నె తెచ్చారు.

గడ్డు పరిస్థితిలో బాధ్యతలు చేపట్టి..

పీవీ భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే నాటికి దేశం గడ్డు పరిస్థితుల్లో ఉంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు బిలియన్ డాలర్ల కంటే తగ్గిపోయాయి. విదేశాలకు చెల్లించాల్సిన అప్పులు, దిగుమతుల కోసం చేయాల్సిన చెల్లింపులు పేరుకుపోయాయి. ద్రవ్యోల్బణం గరిష్టంగా రెండంకెలకు చేరింది. ఏతావాతా దేశం ఆర్థికంగా దివాలా అంచున ఉన్న సమయంలో.. దేశాన్ని ముందుకు నడిపించేందుకు పీవీ సిద్ధమయ్యారు. వెంటనే దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేపని మొదలుపెట్టారు. అప్పట్లో ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్‌సింగ్‌కు కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. మన్మోహన్‌తోపాటు ఇతర ఆర్థికవేత్తలతో చర్చించి సంస్కరణలను అమల్లోకి తెచ్చారు. ఎగుమతులు పెరిగి విదేశీ మారక ద్రవ్యం సమకూరేందుకు వీలుగా రూపాయి విలువను తగ్గించారు. తాను ప్రధాని బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లోనే రిజర్వుబ్యాంకు వద్ద ఉన్న బంగారం నిల్వలను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తాకట్టు పెట్టి 400 మిలియన్ డాలర్ల రుణం తెచ్చారు. కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచారు. లైసెన్సుల విధానాన్ని సరళీకృతం చేశారు. జాతీయ భద్రత అంశాలు మినహా అన్ని రంగాల్లో ప్రభుత్వ సంస్థల గుత్తాధిపత్యాన్ని తగ్గిస్తూ.. ప్రైవేటు సంస్థల స్థాపనకు అవకాశం కల్పించారు.

ఎన్ని విమర్శలు వచ్చినా..

1991 జూలై 24న ప్రవేశపెట్టిన దేశ బడ్జెట్‌లో అనేక సంస్కరణలను ప్రకటించారు. కార్పొరేట్ పన్ను పెంపు, టీడీఎస్ విధానం అమల్లోకి తేవడం, వంట గ్యాస్, కిరోసిన్, పెట్రోల్, ఎరువుల ధరలు పెంపు, చక్కెరపై సబ్సిడీ తొలగింపు, దిగుమతుల పన్ను తొలగింపు వంటి విధానాలను అమల్లోకి తెచ్చారు. ఈ చర్యలతో పీవీ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)కు దేశాన్ని అమ్మేస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. అయినా మొక్కవోని ధైర్యంతో పార్టీలో, ప్రభుత్వంలో అసమ్మతివాదులను ఒప్పిస్తూ సంస్కరణలను కొనసాగించారు. ఎగుమతుల కోసం ప్రత్యేక వాణిజ్య విధానాన్ని తేవడంతోపాటు చిన్న సంస్థలకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ చర్యలన్నింటి ఫలితంగా రెండున్నరేళ్లలో ద్రవ్యోల్బణం 17 శాతం నుంచి 8.5 శాతానికి తగ్గింది. బిలియన్ డాలర్లలోపే ఉన్న విదేశీ మారకద్రవ్య నిల్వలు 15 బిలియన్ డాలర్లకు చేరాయి. ద్రవ్యలోటు 8.4 నుంచి 5.7 శాతానికి తగ్గింది. ఎగుమతులు రెండింతలయ్యాయి. వృద్ధిరేటు 4 శాతానికి పెరిగింది. అక్కడి నుంచి ఇక భారత్ వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితి తలెత్తలేదు. ఇప్పుడు ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఐదో స్థానానికి చేరింది. దీనంతటికీ నాడు పీవీ వేసిన ఆర్థిక సంస్కరణలే పునాది.

నవ్య 'ఆర్థిక' భారతానికి ఊపిరి పీవీ!

ఆర్థిక సంస్కరణల శకాన్ని ప్రారంభించిన పీవీ నరసింహారావు

ఉస్మానియాలో విద్యాభ్యాసం.. కలం పేరుతో వ్యాసాలు..

అపర మేధావి, బహుభాషా కోవిదుడుగా పేరు పొందిన పీవీ నరసింహారావు.. 1921 జూన్ 28న నాటి హైదరాబాద్ సంస్థానంలోని వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లికి చెందిన నియోగి బ్రాహ్మణ దంపతులు సీతారామారావు, రుక్మాబాయిలకు జన్మించారు. మూడేళ్ల వయసులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణి దంపతులు ఆయన్ను దత్తత తీసుకున్నారు. భీమదేవరపల్లి మండలం కట్కూరులోని బంధువు గబ్బెట రాధాకిషన్‌రావు ఇంట్లో ఉంటూ పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదివారు. 1938 సమయంలో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. నిజాం నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ వందేమాతరం గేయాన్ని పాడారు. దీంతో ఆయనను ఉస్మానియా వర్సిటీ నుంచి బహిష్కరించగా.. ఓ మిత్రుడి సాయంతో నాగ్‌పూర్ విశ్వవిద్యాలయంలో చేరి న్యాయ శాస్త్రంలో పట్టా తీసుకున్నారు. కొంత కాలం జర్నలిస్టుగానూ పనిచేశారు. తన సోదరుడు పాములపర్తి సదాశివరావుతో కలసి 'జయ-విజయ' అనే కలం పేరుతో కాకతీయ వారపత్రికకు వ్యాసాలు రాశారు.

పీవీ ఇంట్లోనే పనిజేసిన.. ప్యాంట్లు వేసుకుని సిగ్గుపడ్డం



నా చిన్నప్పుడు పీవీ ఇంట్ల, వారి పొలాల్లో పనిచేసిన. ఊర్లో అందరం ఆయన ఇంటిని గడి అని పిలిచేటోల్లం. పీవీ ఇంటివాళ్లు అందరితో కలివిడిగా ఉండేవారు. మాది చిన్న పల్లెటూరు. ధోవతులు తప్ప ప్యాంట్లు తెలియవు. ఎవరన్నా ప్యాంట్ వేసుకుంటే వింతగా జూసేది. ఏ ఊరి దొరనో అని గొప్పగా అనుకునే వాళ్లం. ఒకనాడు ఇంటికి వచ్చిన పీవీ దొరను.. మీరెందుకు ప్యాంట్లు వేసుకోరని అడిగిన. ఆయన చిన్నగా నవ్విండు. తర్వాత మా ఊళ్లనే బావులకాడ పనిచేసే పది మందికి ప్యాంట్లు కుట్టిచిండు. వాళ్లు బజార్ల తిరగాలంటే ఒకటే సిగ్గుపడుడు. గుర్తొస్తే నవ్వొస్తది. పీవీకి భారతరత్న వచ్చిందంటే.. మా ఊరికి కాదు దేశానికి గౌరవం ఇచ్చినట్టే..

– కాల్వ రాజయ్య, వంగర గ్రామస్తుడు

60 ఏళ్ల వయసులో కంప్యూటర్‌తో కుస్తీ పట్టి..

ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవడంలో పీవీ ఎప్పుడూ ముందుండే వారు. ఆయన అసాధారణ ప్రతిభతో త్వరగానే పట్టు సాధించే వారు. అలా ఏకంగా దేశ, విదేశ భాషలు సహా 13 భాషలను నేర్చుకున్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో మన దేశంలోకి కంప్యూటర్లను ప్రవేశపెట్టినప్పుడు.. పీవీ ఓ కంప్యూటర్ తెప్పించుకుని పట్టు పట్టాడు. 60 ఏళ్ల వయసులో కూడా రోజూ గంటల పాటు కూర్చుని టైపింగ్ మాత్రమేకాదు.. కంప్యూటర్ లాంగ్వేజ్‌నూ నేర్చుకున్నారు.



ఎమ్మెల్యే నుంచి ప్రధాని వరకు..

కాలేజీలో రోజుల నుంచే పీవీ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సభ్యుడిగా చేరారు. 1957–77 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి మంథని నుంచి ప్రాతినిధ్యం వహించారు. అందులో 1962–71 మధ్య వివిధ శాఖల మంత్రిగా పనిచేశారు. 1971లో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

- సీఎంగా పలు భూసంస్కరణలను ప్రవేశపెట్టారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయించారు. గురుకుల విద్యా వ్యవస్థకు పునాది వేశారు.
- 1969లో కాంగ్రెస్ పార్టీ చీలిన సమయంలో ఇందిరా గాంధీ వెన్నంటి నిలిచారు. 1978లో ఇందిరాగాంధీ స్థాపించిన కాంగ్రెస్ (ఐ)లో చేరారు.
- 1977లో తొలిసారిగా హన్మకొండ ఎంపీగా గెలిచిన ఆయన.. 1984, 1989, 1991, 1996లలో జరిగిన ఎన్నికల్లో మహారాష్ట్రలోని రాంటెక్, కర్నూల్ జిల్లా నంద్యాల, ఒడిశాలోని బరంపురం లోక్‌సభ స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. కేంద్రంలో హోం, రక్షణ, విదేశాంగ శాఖల మంత్రిగా పనిచేశారు.
- 1991లో రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్ తీసుకోవాలని పీవీ భావించారు. ఆ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీ చేయలేదు కూడా. కానీ రాజీవ్‌గాంధీ హత్యతో పీవీ క్రియాశీలకంగా వ్యవహరించాల్సి వచ్చింది.
- రక్షణ మంత్రిగా పనిచేసిన అనుభవంతో పార్టీలోని ఇతర పోటీదారులను వెనక్కినెట్టి మైనార్టీలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపించే అవకాశం దక్కించుకున్నారు. 1991 జూన్ 21న ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికి ఎంపీ కాకపోవడంతో.. నంద్యాల లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో 5 లక్షల ఓట్ల భారీ మెజార్టీతోగిన్నిస్ రికార్డుల్లో ఎక్కారు.
- 1995 మే 16 వరకు మైనార్టీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపి రాజకీయ దురంధరుడిగా ఖ్యాతి గడించారు.
- ఆర్థిక రంగమైనా, రాజకీయ రంగమైనా, అభివృద్ధి పథమైనా, సంక్షేమ బాటలోనైనా.. తాను నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చిన పీవీ 83 ఏళ్ల వయసులో.. 2004 డిసెంబర్ 23న ఢిల్లీలో కన్నుమూశారు. తర్వాత 19 ఏళ్ల అనంతరం ఆయనకు కేంద్రం భారతరత్న ప్రకటించింది.

బేగంపేట.. బ్రాహ్మణవాడి అడ్డాగా

పీవీ నరసింహారావు హైదరాబాద్‌లో ఉన్నంతకాలం బేగంపేటలోని బ్రాహ్మణవాడి కేంద్రంగానే కార్యకలాపాలను నిర్వహించారు. తొలుత స్వామి రామానంద తీర్థ ఇక్కడ నివాసం ఏర్పర్చుకోగా.. ఆయన అనుచరుడిగా పీవీ ఎక్కువ సమయం ఇక్కడే గడిపేవారు. 1973లో రామానంద తీర్థ పరమపదించగా.. పీవీ అక్కడ స్వామి రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ సంస్థను నెలకొల్పారు. ఆ సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుతం పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణిదేవి ఈ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమె ఈ కమిటీ భవనంలో పీవీ స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. పీవీ రాసిన, సేకరించిన వేలాది పుస్తకాలు ఇక్కడ కొలువుదీరాయి.



స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీతో పీవీ నరసింహారావు

పీవీకి 'భారతరత్న' గొప్ప విషయం

శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర ప్రశంస

పెందుర్తి (విశాఖజిల్లా): దివంగత ప్రధాని పీవీ నరసింహారావును కేంద్ర ప్రభుత్వం భారతరత్నగా ప్రకటించడంపై విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ హర్షం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయం రాజకీయాలకు అతీతంగా ఉందని స్వామీజీ ప్రశంసించారు. పీవీని భారతరత్నగా ప్రకటించిన సందర్భంగా శ్రీ శారదా పీఠానికి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ స్వామీజీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శారదా పీఠాన్ని పీవీ సందర్శించిన క్షణాలు తమ మదిలో ఇంకా ఉన్నాయన్నారు. 14 భాషలు అనర్గళంగా మాట్లాడే జ్ఞాని పీవీ అని కొనియాడారు. తన మేధస్సుతో దేశానికి పీవీ ఎంతో మేలుచేశారని.. ఆయనకు భారతరత్న ప్రకటించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం మోదీ సర్కారుకే సాధ్యమని స్వామీజీ కొనియాడారు.




శుక్రవారం పీవీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

మోదీ సంస్కారానికి నిదర్శనం: ఎమ్మెల్సీ వాణీదేవి

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం పట్ల ఆయన కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణీదేవి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కౌన్సిల్ మీడియా పాయింట్ వద్ద వాణీదేవి మాట్లాడుతూ...పీవీకి ఈ పురస్కారం ఇవ్వడం ద్వారా భారతరత్న విలువ పెరిగిందన్నారు. పార్టీలకతీతంగా...దేశానికి పీవీ అందించిన సేవలను గుర్తించి భారతరత్న పురస్కారం ప్రకటించడం ప్రధాని మోదీ సంస్కారానికి నిదర్శనమన్నారు.

రైతు బాంధవుడు

- అన్నదాతల హక్కుల కోసం చరణ్ సింగ్ పోరాటం
- వారి సంక్షేమం, సాధికారతే ధ్యేయంగా చట్టాలకు రూపకల్పన
- ఉత్తరాదిన తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా రికార్డు
- 23 రోజులపాటు దేశ ప్రధానమంత్రిగా సేవలు
- ప్రతిఏటా 'కిసాన్ దివస్'గా చరణ్ సింగ్ జయంతి



చౌదరీ చరణ్‌సింగ్. రైతన్నల హక్కుల కోసం పోరాడి వారి ఆత్మబంధువుగా పేరు పొందిన దివంగత ప్రధానమంత్రి. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అవలంబించిన సోషలిస్టు ఆర్థిక విధానాలను ఆయన వ్యతిరేకించారు. అయితే తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో తొలుత కాంగ్రెస్‌లోనే పనిచేశారు. 1960వ దశకంలో ఆ పార్టీ నుంచి బయటికొచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నికై ఉత్తర భారతదేశంలో తొలి కాంగ్రెసేతర సీఎంగా రికార్డుకెక్కారు. రెండుసార్లు యూపీ సీఎంగా, ఒకసారి ప్రధానిగా సేవలందిచారు. కేంద్రంలో మొరార్జీ దేశాయ్ తర్వాత ప్రధాని పదవి చేపట్టిన రెండో కాంగ్రెసేతర నాయకుడు చరణ్‌సింగ్ కావడం విశేషం.

- చరణ్‌సింగ్ 1902 డిసెంబర్ 23న ఉత్తరప్రదేశ్‌లో మీరట్ జిల్లా నూర్పూర్ గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు నేత్రా కౌర్, చౌదరీ మీర్ సింగ్.
- స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య అభ్యసించారు. తర్వాత మీరట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు.
- 1923లో ఆగ్రా కాలేజీలో సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చదివారు. ఆగ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ(హిస్టరీ) పూర్తిచేశారు. 1927లో ఎల్ఎల్‌బీ పట్టా సాధించారు. ఘజియాబాద్‌లో అడ్వొకేట్‌గా పేరు నమోదు చేసుకున్నారు.
- ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు దయానంద సరస్వతి బోధనలతో చరణ్‌సింగ్ ప్రభావితులయ్యారు. మహాత్మా గాంధీ, వల్లభ్‌బాయ్ పటేల్ వంటి నాయకుల నుంచి స్ఫూర్తిని పొందారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో అడుగుపెట్టారు. పలుమార్లు అరెస్టై జీవితం అనుభవించారు. ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఆర్నెల్లు జైల్లో ఉన్నారు. 1940లో మరో కేసులో ఏడాది జైలుశిక్ష పడింది. 1942లో మళ్లీ అరెస్టయ్యారు.
- స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూనే మరోవైపు ఉత్తరాదిన యునైటెడ్ ప్రావిన్సెస్ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు.
- 1937లో తొలిసారిగా యునైటెడ్ ప్రావిన్సెస్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మీరట్ జిల్లాలోని చాప్రౌలీ నుంచి గెలిచారు. 1946, 1952, 1962, 1967లోనూ విజయం సాధించారు.
- 1946లో యునైటెడ్ ప్రావిన్సెస్ ముఖ్యమంత్రి పండిట్ గోవింద్ వల్లభ్ పంత్ ప్రభుత్వంలో పార్లమెంటరీ కార్యదర్శిగా చరణ్ సింగ్ పనిచేశారు.
- 1951లో మొదటిసారి కేబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. న్యాయ శాఖ, సమాచార శాఖ, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలందించారు.
- 1967 ఏప్రిల్ 1న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. రెండు రోజుల తర్వాత సంయుక్త విధాయక్ దళ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.
- 1970 ఫిబ్రవరిలో రెండోసారి యూపీ సీఎంగా ఎన్నికయ్యారు. అదే సంవత్సరం అక్టోబర్ 2న యూపీలో రాష్ట్రపతి పాలన విధించడంలో చరణ్ సింగ్ రాజీనామా చేశారు.
- ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలోనూ చరణ్‌సింగ్ పాల్గొన్నారు. 1975 జూన్ 26న అరెస్టయ్యారు.
- తన సొంత పార్టీ భారతీయ లోక్‌దళ్‌ను జనతా పార్టీలో విలీనం చేశారు. జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన చరణ్ సింగ్ 1977లో లోక్‌సభకు ఎన్నికయ్యారు.
- జనతా ప్రభుత్వంలో కేంద్ర హోం మంత్రిగా చేశారు. 1979 జనవరిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అయ్యారు. తర్వాత ఉప ప్రధానిగా పదోన్నతి పొందారు.
- జనతా పార్టీ చీలిక చరణ్ సింగ్‌కు కలిసివచ్చింది. కాంగ్రెస్ మద్దతుతో 1979 జూలై 28న ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఆగస్టు 20 దాకా కేవలం 23 రోజులే పదవిలో కొనసాగారు. ఆగస్టు 21 నుంచి 1980 జనవరి 14 దాకా ఆపద్ధర్మ ప్రధానిగా వ్యవహరించారు.
- గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చరణ్‌సింగ్ ఎంతగానో చొరవ చూపారు. 'నాబార్డ్'వంటి సంస్థల ఏర్పాటులో ఆయనదే కీలక పాత్ర.
- భారత ఆర్థిక శాస్త్రం, దేశ వ్యవసాయ రంగం, భూసంస్కరణలు, పేదరిక నిర్మూలనపై పలు పుస్తకాలు రాశారు.
- 1987 మే 29న 84 ఏళ్ల వయసులో చరణ్‌సింగ్ తుదిశ్వాస విడిచారు. ఆయన జయంతి డిసెంబర్ 23ను ఏటా 'కిసాన్ దివస్'గా పాటిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రైతాంగ సంక్షేమ చర్యలకు ఆద్యుడు

ఎన్నెన్నో రైతు అనుకూల చట్టాలు తీసుకొచ్చిన చరణ్ సింగ్ రైతు బాంధవుడిగా గుర్తింపు పొందారు. కన్సాలిడేషన్ ఆఫ్ హెల్డింగ్స్ యాక్ట్ ఆఫ్ 1953, ఉత్తరప్రదేశ్ జమీందారీ, భూసంస్కరణ చట్టం–1952ని తీసుకొచ్చారు. దీనివల్ల ఉత్తరప్రదేశ్‌లో జమీందారీ వ్యవస్థ రద్దయ్యింది. చరణ్‌సింగ్ ప్రతిపాదించిన అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ బిల్లు 1964లో ఆమోదం పొందింది. దీంతో రైతులకు మార్కెట్ లింకేజీ మెరుగైంది. ఆయన చేపట్టిన భూసంస్కరణలో చిన్న రైతులు ఎంతగానో లబ్ధి పొందారు. భూమి లేనివారికి భూములపై హక్కులు లభించాయి. రైతులకు సామాజిక, ఆర్థిక ప్రగతికి ఈ సంస్కరణలు దోహదపడ్డాయి. 1966, 1967లో ఉత్తరప్రదేశ్‌లో కరువు తాండవించింది. దాంతో రైతుల నుంచి అధిక ధరలకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి, లబ్ధి చేకూర్చారు. చరణ్ సింగ్ ప్రారంభించిన చర్యల వల్లనే పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) విధానం ప్రారంభమైంది.

హరిత విప్లవ సారథి

- దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఎంఎస్ స్వామినాథన్
- ప్రజలందరికీ పౌష్టికాహారం, ఆహార భద్రతే ధ్యేయంగా పరిశోధనలు
- సాగులో నూతన వంగడాలు, ఆధునిక విధానాలకు శ్రీకారం
- కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు

మాన్‌కొంబు సదాశివన్ స్వామినాథన్.. సరిపడా పంటల ఉత్పత్తి లేక ఆకలితో అలమటిస్తున్న మన దేశానికి అన్నం పెట్టిన అరుదైన శాస్త్రవేత్త. హరిత విప్లవ పితామహుడికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించింది. దేశం ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకొనే స్థాయి నుంచి పంటల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించి, ఇప్పుడు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందంటే అదంతా ఎంఎస్ స్వామినాథన్ చలవే అని చెప్పడం అతిశయోక్తి కాదు. హరిత విప్లవం, నూతన వంగడాలు, ఆధునిక వ్యవసాయ విధానాలతో దేశాన్ని అన్నపూర్ణగా మార్చారు. తన జీవితాన్ని హరిత విప్లవానికే అంకితం చేశారు. ప్రజలందరికీ పౌష్టికాహారం అందించాలని, ఆహార భద్రత కల్పించాలని అహర్నిశలూ తపించారు. ప్రపంచ ఆహార వ్యవస్థల స్థిరీకరణకు తన వంతు తోడ్పాటునందించారు. తన పరిశోధనల ద్వారా కోట్లాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు.



- ఎంఎస్ స్వామినాథన్ 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు పార్వతీ థంగమ్మాళ్, డాక్టర్ ఎం.కె.సాంబశివన్.
- 15 ఏళ్ల నిండకుండానే తండ్రి మరణించడంతో తమ కుటుంబం ఆధ్వర్యంలోని ఆసుపత్రిని నిర్వహించడానికి వైద్య విద్య అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. మెడిసిన్‌లో చేరారు.
- విద్యార్థిగా ఉన్నప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కరువు పరిస్థితులను చూసి చలించిపోయారు. ఆకలితో ఎవరూ చనిపోయే పరిస్థితి రాకూడదని భావించారు.
- వైద్య విద్యను మధ్యలోనే వదిలేసి కోయంబత్తూరులోని వ్యవసాయ కళాశాలలో చేరారు.
- పీజీ పూర్తయ్యాక సివిల్ సర్వీసు పరీక్ష రాశారు. ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ, అటువైపు మొగ్గు చూపకుండా హాలెండ్‌లో వ్యవసాయ శాస్త్రంలో ఉన్నత విద్య అభ్యసించారు. బంగాళదుంప జన్యు పరిణామంపై పరిశోధనలు సాగించారు. తర్వాత కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ చేశారు.
- 1954లో ఒడిశాలోని కేంద్ర వరి పరిశోధన సంస్థలో చేరారు. అనంతరం భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలో అడుగుపెట్టారు.
- ప్రపంచస్థాయి వ్యవసాయ సంస్థల్లో రెండు దశాబ్దాలపాటు పనిచేశారు. పరిశోధనతోపాటు పరిపాలనాపరమైన విధులు నిర్వర్తించారు.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆహార కొరత తీవ్రంగా ఉండేది. విదేశాల నుంచి ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకుంటే తప్ప ఆకలి తీరని పరిస్థితి. అప్పట్లో పంటల దిగుబడి చాలా పరిమితంగా ఉండేది. ఈ పరిస్థితిని మార్చేయాలని స్వామినాథన్ నిర్ణయించుకున్నారు. హరిత విప్లవానికి శ్రీకారం చుట్టారు.
- అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రవేశపెట్టారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పరికరాలను రైతులకు పరిచయం చేశారు. ప్రభుత్వ సహకారంతో సాగునీటి సౌకర్యం పెంచారు. ఎరువులు, పురుగు మందుల వాడకం పెంచారు. సాగు విస్తీర్ణం భారీగా పెంచేందుకు కృషి చేశారు. ఇవన్నీ సత్ఫలితాలు ఇచ్చాయి.
- ప్రధానంగా వరి, గోధుమ వంగడాల అభివృద్ధికి స్వామినాథన్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. హరిత విప్లవంతో దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.
- హరిత విప్లవం కారణంగా ఎరువులు, పురుగు మందుల వాడకం పెరిగి భూసారం క్షీణిస్తోందని విమర్శలు వచ్చాయి. వీటితో స్వామినాథన్ ఏకీభవించారు. స్థానికంగా ఉండే వంగడాలను కాపాడుకోవాలని, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని, భూసారం కోల్పోయేలా రసాయనాలు వాడొద్దని సూచించారు.
- వ్యవసాయ రంగంలో పలు ప్రతిష్టాత్మక సంస్థలకు డైరెక్టర్‌గా, డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు.
- స్వామినాథన్‌ను ఎన్నో పురస్కారాలు వరించాయి. 1971లో రామన్ మెగసెసే, 1986లో వరల్డ్ సైన్స్, 1991లో ఎన్విరాన్‌మెంటల్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.
- 1967లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్, 1989లో పద్మవిభూషణ్ పురస్కారాలు స్వీకరించారు.
- 20వ శతాబ్దంలో అత్యంత ప్రభావశీల వ్యక్తుల్లో ఒకరిగా స్వామినాథన్‌ను ప్రఖ్యాత టైమ్ మేగజైన్ గుర్తించింది.
- 1988లో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఈ సంస్థ 1987లో తొలి ప్రపంచ ఆహార పురస్కారం అందుకుంది.
- 2007 నుంచి 2013 దాకా రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు.
- ప్రపంచవ్యాప్తంగా వివిధ విశ్వ విద్యాలయాల 84 గౌరవ డాక్టరేట్లను ఆయన ప్రదానం చేశాయి.
- 2023 సెప్టెంబర్ 28న 98 ఏళ్ల వయసులో చెన్నైలోని స్వగృహంలో స్వామినాథన్ కన్నుమూశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా...

క్రీడా కోటాలో అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: గ్రూప్–1 సర్వీసు నియామకాల్లో భాగంగా క్రీడా కోటాలో ఎంపికైన అభ్యర్థుల తాత్కాలిక జాబితాను ఏపీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

గ్రంథాలయ పరిషత్‌కు 1,083 పుస్తకాల అందజేత



పుస్తకాలు అందజేస్తున్న నైపుణ్యాభివృద్ధి సలహాదారు చల్లా మధుసూధనరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ సలహాదారు (జాతీయ మీడియా) దేవులపల్లి అమర్ రచించిన మూడు దారులు (తెలుగు), ది డెక్కన్ పవర్ ప్లే (ఆంగ్ల) పుస్తకాలను ఉచితంగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు అందజేశారు. శుక్రవారం నైపుణ్యాభివృద్ధి సలహాదారు చల్లా మధుసూదనరెడ్డి 1,083 పుస్తకాలను గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావుకు అందజేశారు. వీటిని అన్ని గ్రంథాలయాల్లో పాఠకులకు అందుబాటులో ఉంచాలని కోరారు.

ఈవీఎంలపై నోడల్ అధికారులకు శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై (ఈవీఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ 2.0) రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఈవీఎం నోడల్ అధికారులకు, సాంకేతిక సహాయకులకు రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బిహార్, గోవా రాష్ట్రాలతో పాటు లడ్డాక్, లక్షద్వీప్, పుదుచ్చేరి, చండీఘర్ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన నోడల్ అధికారులు, సాంకేతిక సహాయకులు ఆన్‌లైన్ ద్వారా ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీఈవో హరేంధిర ప్రసాద్, హైదరాబాద్‌కు చెందిన ఈసీఐఎల్ అధికారుల బృందం పాల్గొని ఈవీఎంల నిర్వహణపై నోడల్ అధికారులకు, సాంకేతిక సహాయకులకు ఈవీఎంల వాడకంపై సమగ్ర అవగాహన కల్పించారు. హైదరాబాద్ ఈసీఐఎల్‌కు చెందిన సీనియర్ డీజీఎం ఏపీ రాజు, టెక్నికల్ మేనేజర్ ఎం.శంకర్, ఇంజినీర్ సీజీ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల సర్దుబాటు

ప్రతి సచివాలయంలో కనీసం 8 మంది



- సర్దుబాటుపై ఉత్తర్వులు జారీ చేసిన గ్రామ వార్డు సచివాలయాల శాఖ
- 7,900 సచివాలయాల్లో నిర్ణీత సంఖ్య కంటే ఎక్కువ మంది
- దాదాపు 3,300 సచివాలయాల్లో 8 మంది కంటే తక్కువ ఉద్యోగులు
- ఎక్కువ మంది ఉన్న సచివాలయాల నుంచి ఉద్యోగుల సర్దుబాటు
- ఏ జిల్లాలోని వారికి ఆ జిల్లాలోనే బదిలీ
- 1.34 లక్షల మంది ఉద్యోగుల్లో దాదాపు 5 వేల మందికి స్థాన చలనం
- ఎన్నికలకు ముందే కలెక్టర్ల ఆధ్వర్యంలో సర్దుబాటు పూర్తి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కనీసం 8 మంది ఉద్యోగులు ఉండేలా ప్రభుత్వం సర్దుబాటు చర్యలు ప్రారంభించింది. ఇటీవలి బదిలీల అనంతరం కొన్ని సచివాలయాల్లో నిర్ణీత సంఖ్య 8మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉండగా మరికొన్నింటిలో తక్కువ మంది ఉన్నారు. అన్ని చోట్లా సమాన సంఖ్యలో ఉద్యోగులు ఉండేలా ప్రభుత్వం రేషనలైజేషన్ (సర్దుబాటు)కు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన విధి విధానాలతో గ్రామ, వార్డు సచివాలయాలు – వలంటీర్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

విధివిధానాలివీ..

- ఏ కేటగిరీ ఉద్యోగుల ఖాళీలో అదే కేటగిరీ ఉద్యోగితోనే సర్దుబాటు
- జిల్లా ప్రాతిపదిక జిల్లాల పరిధిలోనే సర్దుబాటు
- ఎక్కువ మంది సిబ్బంది ఉన్న సచివాలయాల నుంచి తక్కువ సంఖ్యలో ఉద్యోగులు ఉన్న సచివాలయాలకే బదిలీ
- ఎక్కడైనా భార్య, భర్త వేర్వేరు సచివాలయాల్లో పనిచేస్తుంటే, వారి అభ్యర్థన మేరకు ఇరువురికీ ఒకే చోటకు బదిలీకి అవకాశం కల్పిస్తారు. వీరికి ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు కూడా అవకాశం కల్పిస్తారు.
- గ్రామ సచివాలయాల్లో నాలుగు కేటగిరీల ఉద్యోగులు, వార్డు సచివాలయాల్లో మూడు కేటగిరీ ఉద్యోగులకు మాత్రమే పరిమితమై ఈ సర్దుబాటు ఉంటుంది.
- గ్రామ సచివాలయాల్లో నాలుగు కేటగిరీల్లో.. మొదట ప్రాధాన్యతగా గ్రామ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సర్దుబాటు ప్రక్రియ సాగుతుంది. అప్పటికీ సర్దుబాటు చేయాల్సిన సచివాలయాలు మిగిలితే రెండో ప్రాధాన్యతగా గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీసు)తో సర్దుబాటు చేస్తారు. మూడో ప్రాధాన్యతలో డిజిటల్ అసిస్టెంట్లు, అప్పటికీ మిగిలిపోతే నాలుగో ప్రాధాన్యతగా పంచాయతీ కార్యదర్శి విభాగాలు ఉంటాయి. ఇలా ప్రాధాన్యతల వారీగా సర్దుబాటు చేస్తారు.
- వార్డు సచివాలయాల్లో మొదటి ప్రాధాన్యతగా వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, రెండో ప్రాధాన్యతలో మహిళా పోలీసు, మూడో ప్రాధాన్యతగా వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ విభాగాలు ఉన్నాయి.
- ఉద్యోగులతో నేరుగా కౌన్సెలింగ్ ద్వారా ఈ సర్దుబాటు ప్రక్రియ చేపడతారు

రాష్ట్రంలోని మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 1.34 లక్షల మంది ఉద్యోగులున్నారు. ప్రస్తుతం దాదాపు 7,900 సచివాలయాల్లో 8 మందికంటే ఎక్కువగానే ఉద్యోగులు ఉన్నారు. సుమారు 3,300 సచివాలయాల్లో 8 మంది కంటే తక్కువ సంఖ్యలో ఉన్నారు. మిగిలిన చోట్ల 8 మంది చొప్పున పనిచేస్తున్నారు. ఎక్కువ మంది సిబ్బంది ఉన్న సచివాలయాల నుంచి తక్కువ సంఖ్యలో ఉన్న సచివాలయాలకు ఉద్యోగులను సర్దుబాటు చేయనున్నారు. 8 మంది పనిచేస్తున్న చోట ఎవరికీ బదిలీలు ఉండవని అధికారులు తెలిపారు. ఈ సుమారు 5,000 మందికి స్థానచలనం కలుగుతుందని వెల్లడించారు. జిల్లాల ప్రాతిపదికన కలెక్టర్ల ఆధ్వర్యంలో సర్దుబాటు జరుగుతుందని తెలిపారు. ఏ జిల్లాలోని వారికి ఆ జిల్లాలోనే బదిలీ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే రానున్న పది పదిహేను రోజుల్లో మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు వెల్లడించారు.

స్పేస్ రిఫార్మ్స్ ఇయర్‌గా 2024–25

- రాబోయే 14 నెలల్లో 30 ప్రయోగాలు చేయనున్నాం
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వెల్లడి




శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ప్రయోగ వేదికపై జీఎస్ఎల్‌వీ రాకెట్ (ఫైల్)

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్–స్పేస్) ఆధ్వర్యంలో రాబోయే 14 నెలల్లో 30 ప్రయోగాలను నిర్వహించనున్నారు. 2024–25 ఆర్థిక ఏడాదిని గగన్‌యాన్ సంవత్సరంగా ప్రకటించి 7 గగన్‌యాన్ ప్రయోగాత్మక పరీక్షలను నిర్వహించేందుకు ప్రణాళిక రచించారు. అలాగే, స్కైరూట్ ఎయిరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన విక్రమ్–1టీబీడీ పేరుతో 4 ప్రయోగాలు, అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన అగ్నిబాన్–టీబీడీ పేరుతో 3 ప్రయోగాలు చేయనున్నారు. ఇస్రో పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 8 ప్రయోగాలు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటికే ఈ ఏడాది జనవరి 1న పీఎస్ఎల్‌వీ సీ57 ప్రయోగాన్ని పూర్తి చేశారు. వీటి తరువాత పీఎస్ఎల్‌వీ సీ58, సీ59, సీ61, సీ62, సీ63, పీఎస్ఎల్‌వీ ఎన్1, ఎన్2 పేరుతో 8 ప్రయోగాలు చేయడానికి సిద్ధమవుతున్నారు. జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఈ నెల 17న జీఎస్ఎల్‌వీ ఎఫ్14, తరువాత ఎఫ్15, ఎఫ్16, ఎఫ్17 ప్రయోగాలను చేయడానికి సంసిద్ధమవుతున్నారు. ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లో డీ3, ఎస్1, ఎస్2 పేరుతో 3 ప్రయోగాలు, ఎల్‌వీఎం3–ఎం5 రాకెట్ ద్వారా ఒక ప్రయోగంతో కలిసి ఈ ఏడాదిలో 30 ప్రయోగాలు చేయనున్నారు. కాబట్టి ఈ ఏడాదిని 'స్పేస్ రిఫార్మ్స్ ఇయర్'గా ఇస్రో ప్రకటించింది. 2023–24 ఆర్థిక ఏడాదిలో భాగంగా మార్చిలోపు అగ్నిబాన్, ఎస్ఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగాలు చేయనున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి దాకా 26 ప్రయోగాలు చేయడానికి ఇస్రో ప్రణాళిక రచించింది. ఈ ఏడాది గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన 7 ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతమైతే 2025 ఆఖరికి మానవుడిని అంతరిక్షంలోకి పంపించి క్షేమంగా భూమికి తీసుకువచ్చేందుకు ఇస్రోసమాయత్తమవుతోంది.

నేడు విశాఖలో ఏఐ అండ్ క్లౌడ్ సమ్మిట్

సాక్షి, విశాఖపట్నం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై యువతకు అవకాశాలు కల్పించడంతో పాటు అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతికతపై ఆసక్తి కలిగించేందుకు విశాఖలో శనివారం ఏఐ అండ్ క్లౌడ్ సమ్మిట్ ప్రారంభం కానుంది. కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో భవిష్యత్తులో అపారమైన అవకాశాలు పెరగనున్న నేపథ్యంలో యువతను అప్రమత్తం చేసేందుకు విశాఖ వేదికగా ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్), డీప్‌టెక్ సమిట్స్ సంయుక్తంగా వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో సదస్సు నిర్వహించనున్నారు.

ముందే వచ్చిన వేసవి!



సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది వేసవి ఆరంభానికి ముందే ఉష్ణతాపం భయపెడుతోంది. శీతాకాలం సీజను ముగియక ముందే సూర్య ప్రతాపం మొదలైంది. ఫిబ్రవరి రెండో వారంలోనే ఏప్రిల్ నాటి ఎండలు చుర్రుమనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం పలుచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. కొన్నిచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు పైనే రికార్డవుతున్నాయి. ఇవి రానున్న వేసవి తీవ్రతను ఇప్పట్నుంచే తెలియజేస్తున్నాయి. సాధారణంగా ఫిబ్రవరిలో గరిష్ఠ (పగటి) ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు మించవు. కానీ అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం ఇబ్బంది పడుతున్నారు. గడిచిన రెండు మూడు రోజులుగా కర్నూలులో 38.5 డిగ్రీలు, అనంతపురం, నంద్యాల, వైఎస్సార్ కడపల్లో 38 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి (కనిష్ఠ) ఉష్ణోగ్రతలు కూడా కొన్ని ప్రాంతాల్లో మినహా పలు చోట్ల క్రమంగా పెరుగుతున్నాయి. ఇవి కూడా సాధారణంకంటే 2, 3 డిగ్రీలు ఎక్కువగా ఉంటున్నాయి.

పెరగనున్న వేసవి తీవ్రత

రానున్న వేసవి తీవ్రంగానే ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వేసవి తాపంతో పాటు తీవ్ర వడగాడ్పులు కూడా ఉంటాయని, కొన్ని రోజులు అసాధారణ ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతాయని చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో బలంగా ఉన్న ఎల్‌నినోతో పాటు ఆకాశంలో మేఘాలు తక్కువగా ఉండటం, కాలుష్య కారక వాయువులు ఉపరితలంలోకి వెళ్లకుండా పొగమంచు అడ్డుకోవడం వంటివి పగటి ఉష్ణోగ్రతల పెరుగుదలకు ప్రధాన కారణమని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి ఆర్.మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. అలాగే సాధారణంగా ఫిబ్రవరిలో చిరుజల్లులు కురుస్తూ ఉష్ణతాపాన్ని అదుపు చేస్తాయని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వివరించారు. గత సంవత్సరానికంటే ఈ వేసవి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని చెప్పారు. జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడి, లానినా పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉన్నందున మే ఆఖరు వరకు ఉష్ణతాపం కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఓటమి భయంతోనే బీజేపీకి బాబు సలాం

1,230వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల దెబ్బకు తనకు మళ్లీ ఘోర ఓటమి తప్పదనే భయంతోనే చంద్రబాబు ఢిల్లీలో కనపడిన ప్రతి ఒక్కరి కాళ్లకు మొక్కుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. బహుజనుల దెబ్బకు తల్లడిల్లుతున్న చంద్రబాబు బీజేపీతో పొత్తుకు వెంపర్లాడుతున్నాడని విమర్శించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,230వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. ఎన్నికల్లో పొత్తుల కోసం తిరుగుతున్న బాబు ఓటమితో పాటు రాష్ట్రం నుంచి పారిపోవడం ఖాయమని, తమ హక్కులను అడుగడుగునా అడ్డుపడిన బాబును తరిమికొట్టేదాకా తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. 4 సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 09వ తేదీన ప్రారంభమైన తమ బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం ఇంతింతై రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ వికేంద్రీకరణ లాభాలను తెలియజేసి ఆలోచన రేకెత్తించిందన్నారు. నాయకులు బేతపూడి రాజేంద్ర కుమార్, పెద్దింటి విజయ్, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి, మాదిగాని గురునాథం, ఇందుపల్లి సుభాషిణి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, పల్లె బాబు, కారుమంచి పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.








* నేచురల్ ఆర్ట్

వృథా నుంచి ధగధగ...

కొబ్బరిచిప్ప... మామిడి ఆకు... కాదేది కళకు అనర్హం!

**కొబ్బరి చిప్పలతో మ్యూజిక్ సిస్టమ్
పాత రికార్డ్ టేప్స్‌తో టిష్యూ స్టాండ్స్
మామిడి, రావి ఆకులతో ల్యాంప్స్
సొర, బీరకాయ పీచులతో ముచ్చటైన హ్యాంగింగ్స్...
ఇలా ఎన్నో వృథాగా పడేసే వస్తువులతో
18 ఏళ్లుగా అందమైన కళారూపాలకు ప్రాణం పోస్తూ
వాటితో ఉపాధి పొందుతున్నాడు జగదీష్.**


జగదీష్

కర్ణాటకలోని నందిహళ్ళి గ్రామవాసి అయిన జగదీష్ మరో పాతిక మంది మహిళలకు తన కళారూపాలతో శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నాడు. 'దేశవ్యాప్తంగా జరిగే ఎగ్జిబిషన్స్‌లో పాల్గొంటానని, అక్కడకు వచ్చిన జనం తనను, తన పనినీ ప్రోత్సహిస్తుంటారని ఆనందంగా తెలియజేసే జగదీష్ హైదరాబాద్‌లో గచ్చిబౌలిలోని నిఢిమ్స్‌లో జరుగుతున్న దస్తకారీ హాత్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో తన జగ్గాసేస్ క్రియేటివ్ వర్క్స్ స్టాల్‌లో ఆకట్టుకునే కళారూపాలను ప్రదర్శనకు ఉంచాడు. జగదీష్ మాట్లాడుతూ ...


పాత రికార్డ్ టేప్స్‌తో టిష్యూ స్టాండ్స్

''నా క్రాఫ్ట్స్ స్టూడియో బెంగళూరులో ఉంది. పేదరికంలో పుట్టి పెరిగాను. మా అమ్మానాన్నలకు తగిన ఆదాయం లేకపోవడంతో స్కూల్ వయసులోనే చదువును ఆపేయాల్సి వచ్చింది. 'ఏదైనా పని చేసుకొని బతకాలి, ఏం చేయాలి' అని ఎప్పుడూ ఆలోచించేవాడిని. చెట్టు కింద కూర్చున్నప్పుడు ఆ చెట్టే నాకు గురువు అయ్యింది. ఆ చెట్టు నుంచి రాలిన ఆకులపై పెయింట్స్ వేసేవాడిని. ఆ తర్వాత వాటితోనే అందమైన కళాకృతులను తయారుచేయడం మొదలుపెట్టాను. అలాగే, ఎండిన చెట్టు బెరడులను సేకరించి, వాటితోనూ సృజనాత్మక వస్తువులను చేయడం ఆరంభించాను.


జగదీష్

ఆకులలో ఆత్మ...

రాలిన ఆకులు కూడా కొత్త అర్థం చెబుతాయనిపించేలా కళాకృతులను సృష్టించాలనుకున్నాను. అందుకోసం ఆకుల మీద అనేక విధాల ప్రయోగాలు చేశాను. ఇప్పుడంటే రకరకాల కెమికల్ పద్ధతులతో లీఫ్ ఆర్ట్స్ చేసే వారు పుట్టుకువస్తున్నారు. కానీ, ఇరవై ఏళ్ల క్రితం... కొన్ని రోజుల పాటు ఆకులను నీళ్లలో నానబెట్టి, పై పొరలన్నీ తొలగించి, అసలైన ఆత్మను బయటకు తీసేవాడిని. ఇందుకు రోజుల తరబడి సమయం పట్టేది. చేతులపై చర్మం దెబ్బతినేది. అన్నం కూడా తినలేకపోయేవాడిని. అయినా అవేమీ పట్టించుకునేవాడిని కాదు. ఆకుల మాదిరిగానే సొరకాయ, బీరకాయ పీచులను తయారు చేశాను. వీటితోనే ల్యాంపులు, డెకొరేటివ్ ఐటమ్స్ తయారు చేస్తూ వచ్చాను.

కాదేదీ కళకు అనర్హం...

చెట్లకొమ్మలు, బెరళ్లు, కొబ్బరి చిప్పలు, కొబ్బరి పీచు, ఉల్లి పొట్టు.. ఇలా ప్రతిదానినీ కళాత్మకమైన వస్తువులుగా మార్చడం మొదలుపెట్టాను. చెట్టు బెరళ్లను తెచ్చి, వాటికి గడియారం ముళ్లను బిగించి, అందమైన వాల్ క్లాక్‌ను తయారు చేశాను. కొబ్బరి చిప్పలతో తయారు చేసిన మ్యూజిక్ సిస్టమ్ చాలా మందిని ఆకట్టుకుంది. ఎండిపోయిన చెట్ల కొమ్మలకు ఆర్గానిక్ కలర్స్ వాడి, ఆకులతో పక్షులను చేసి ఇంటి ముందు అలంకరణ వస్తువుగా మార్చేశాను. నా దగ్గర రూ.150/- నుంచి ఎనిమిది వేల రూపాయల వరకు ధర పలికే కళాత్మక వస్తువులు ఉన్నాయి. నాకై నేనుగా నేర్చుకున్న ఈ కళ ఇన్నేళ్లుగా నన్ను బతికించడమే కాదు మరికొందరికీ ఆదాయవనరుగా మారింది. నా కళాత్మక వస్తువులను ఇష్టపడేవారు 'జగ్గాసేస్ క్రియేటివ్ వర్క్' వెబ్‌సైట్ చూసి మీ ప్రోత్సాహాన్ని అందించవచ్చు. పర్యావరణహితంగా చేస్తున్న వస్తువుల తయారీకి గుర్తింపుగా స్టేట్ క్రాఫ్ట్ కౌన్సిల్ నుంచి అవార్డులూ అందుకున్నాను' అంటూ తన గురించి, చేస్తున్న సృజనాత్మక పని గురించి తెలియజేశారు జగదీష్.


కొబ్బరి చిప్పలతో మ్యూజిక్ సిస్టమ్

– నిర్మలారెడ్డి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

**నులిపురుగులు చిన్న సమస్య కాదు.
అలాగని పెద్ద సమస్యా కాదు.
చిన్న పిల్లలను బాధించే చికాకు సమస్య.
ఆరోగ్యంగా పిల్లలు ఎదగాలంటే
ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థ ఉండాలి.
మన దేశంలో 65 శాతం మంది చిన్నారులు
నులిపురుగులతో బాధ పడుతున్నారు.
పూర్వం అమ్మమ్మలు, నానమ్మలు
పిల్లల ప్రవర్తనలో మార్పు గమనించి
నులిపురుగుల మందు వేసే వారు.
ఇప్పుడు తల్లులకు వ్యవధి ఉండటం లేదు.
కాని తప్పదు జాగ్రత్త.**

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం


ప్రతీకాత్మక చిత్రం

చిన్ని బొజ్జలకు కావాలి ఈ రక్ష

నులిపురుగులు పిల్లలను బాగా ఇబ్బంది పెడతాయి. అవి కడుపులో ఉన్నాయంటే పిల్లలు మలద్వారం వద్ద దురద ఉందని చెబుతుంటారు. పదేపదే అక్కడ గీరుకునే ప్రయత్నం చేస్తారు. అలాగే ముక్కు ఎక్కువగా దురద పెడుతున్నా 'కడుపులో నులిపురుగులున్నాయేమో' అని పెద్దలు అనేవారు. ఇంతకు మునుపు పిల్లలు ఆరుబయలులో విసర్జన చేసేవారు కాబట్టి పెద్దలు నులిపురుగులు గమనించేవారు. ఇప్పుడు ఇళ్లల్లో టాయిలెట్లు వాడి ఫ్లష్ చేయడం వల్ల నులి పురుగులను గమనించే అవకాశం లేదు. పెద్దల కంటే పిల్లలకు నులి పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని గ్రహించాలి.

నులి పురుగులంటే?

నులి పురుగులు పేగుల్లో చేరి మన పోషకాలను దొంగిలించి తినే పరాన్న జీవులు. వీటివల్ల వచ్చే ఇన్ఫెక్షన్‌ని 'అస్కారియాసిస్' అంటారు, మన దేశంలోదాదాపు 85 శాతం మంది పిల్లల్లో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తోందని ఆరోగ్య సంస్థలు ప్రకటించాయి. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, నీరసం, కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలు కనిపిస్తాయి. ఆకలి మందగిస్తుంది. 'మా పిల్లవాడు ఇంతకు ముందు బాగా తినేవాడు ఇప్పుడు తినడం లేదు' అని తల్లులు కంప్లయింట్ చేస్తారు. పిల్లల ఎదుగుదల దెబ్బతింటుంది. కొందరు పిల్లలు నులిపురుగుల వల్ల సరిగా నిద్రపోలేక ఇబ్బంది పడతారు.

ఎలా ప్రవేశిస్తాయి?

చిన్నపిల్లలు మట్టిలో ఆడుకోవడం సర్వసాధారణం. మట్టిలో ఆడుకొని చేతులు శుభ్రం చేసుకోకుండా తింటే నోటి ద్వారా పొట్ట, పేగుల్లోకి నులి పురుగులు ప్రవేశిస్తాయి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం, కాళ్లకు చెప్పులు వేసుకోకుండా తిరగడం, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం, దుమ్ము ధూళి చేరిన కలుషిత ఆహారాన్ని తీసుకోవడం వల్ల నులిపురుగుల సమస్య తలెత్తవచ్చు.

ఏం చేయాలి?

ప్రధానంగా చిన్నపిల్లల చేతి గోళ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. గోళ్లు కొరికే అలవాటును మాన్పించాలి. ప్రతిరోజూ వేడి చేసి చల్లార్చిన మంచినీటిని మాత్రమే తాగించాలి. వైద్యుల సలహాతో అల్బెండజోల్ మాత్రలు వాడాలి. ప్రకృతి వైద్యంలో ఎనిమా ద్వారా కూడా ఈ నులి పురుగుల బెడద తొలగిస్తారు. కొన్ని సులువైన చిట్కాల ద్వారా కూడా నులిపురుగుల సమస్యను అధిగమించవచ్చు. వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉండటం వల్ల నులిపురుగులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రెండు వెల్లుల్లి రెబ్బలను బాగా దంచి ఆ రసంలో గ్లాసు నీటిని కలిపి తాగించడం ద్వారా కడుపులో నులిపురుగులను నివారించవచ్చు. రెండు లవంగాలను ఒక గ్లాసు నీటిలో వేసి ఆ నీటిని తాగించడం వల్ల కడుపులో నులి పురుగులను నివారించవచ్చు. బొప్పాయి పండును తినిపించడం, సన్నగా ఉండే ఆవాలను వేయించి పొడిచేసి మజ్జిగలో కలిపి తాగించడం వంటి వాటి ద్వారా నులిపురుగుల బెడదను అధిగమించేలా చేయవచ్చు. అన్నింటికీ మించి వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటు చేయడం అవసరం.

బ్యూటిప్స్

మెరిసే ముఖానికి...



- అరకప్పు కీరాదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి మిక్స్ చేయండి. ఈ పేస్ట్‌ను ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేయాలి. కీరాదోస పిగ్మెంటేషన్ సమస్యను దూరం చేస్తుంది. ఇది ముడతలు, సన్నని గీతలు వంటి సమస్యలు దూరం అవుతాయి.
- ఒక పాత్రలో బార్లీ గింజల పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్ల పోసుకుంటూ ముద్దలా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను బాగా కలిపి ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయండి. దీన్ని 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తుంటే.. మచ్చలు, మృత కణాలు తొలగిపోయి ముఖ చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది.
- పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. ఉడికిన తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లై చేసుకుని బాగా ఆరనివ్వాలి. తర్వాత మైల్డ్ క్లెన్సర్ ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉండే బ్లాక్‌హెడ్స్ సులభంగా తొలగిపోతాయి.



- రెండు టీస్పూన్ల వేప పొడి, ఒక స్పూన్ నిమ్మరసం తీసుకోండి. వీటిని మెత్తగా చేసి ముఖం, మెడ భాగాలల్లో రాయాలి. పావు గంట తర్వాత చల్లటి నీటితో వలయాకారంలో ముఖాన్ని రుద్దుతూ శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే ముఖం కాంతిమంతంగా మెరుస్తుంది.



ఎర్న్-లెర్న్ అండ్ గ్రో

సామాన్య మహిళలే ఏఐ 'కార్య'కర్తలు

మసాలా దినుసులు, ఎండు మిరపకాయలను గ్రైండింగ్ చేసే చిన్నపాటి వ్యాపారం చేస్తున్న పుణెకు చెందిన 53 సంవత్సరాల బేబి రాజారామ్ బొకాలే నోటి నుంచి ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సంబంధించిన విషయాలు, విశేషాలు వినిపిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మోడల్స్‌కు తన గొంతును అరువు ఇస్తూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తుంటుంది బేబి. పర్సనల్ ఫైనాన్స్ నుంచి ఫ్రాడ్ జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పే ఎన్నో విషయాల వరకు మరాఠీలో చెబుతుంది...

భారత పర్యటనకు వచ్చిన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సోషల్ ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ 'కార్య' టీమ్‌లాంటి చేంజ్‌మేకర్స్‌తో కలిసి పని చేయడానికి ఉత్సాహం చూపారు. 'కార్య'కు సంస్కృతంలో 'మీకు గౌరవాన్ని ఇచ్చే పని' అనే అర్థం ఉంది. 2017లో బెంగళూరు కేంద్రంగా మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ ప్రాజెక్ట్‌గా మొదలైన కార్య 'ఎర్న్, లెర్న్ అండ్ గ్రో' అనే నినాదంతో ముందుకు వెళుతోంది. కృత్రిమ మేధ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి, పరిశోధనల కోసం అనేక భారతీయ భాషలలో డేటాసెట్లను క్రియేట్ చేస్తోంది.

'ఎన్నో లక్షల మంది మరాఠీ మాట్లాడుతున్నప్పటికీ డిజిటల్ ప్రపంచంలో ఆ భాషకు సముచిత ప్రాధాన్యత లేదు' అంటున్న 'కార్య' నిర్వాహకులు మరాఠీపైనే కాదు డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉన్న ఎన్నో భాషలపై దృష్టి పెడుతున్నారు. నైపుణ్యాలను (స్కిల్స్) వాడుకోవడంతోపాటు పేదరికాన్ని దూరం చేయడానికి, డిజిటల్ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. బేబీ రాజారామ్ బొకాలేలాంటి సామాన్య మహిళలే ఇందుకు ఉదాహరణ.

పగటిపూట తన పనులన్నీ పూర్తయ్యాక ఏఐ మోడల్స్ కోసం తన మాతృభాష మరాఠీలో స్టోరీలు చదువుతుంది బొకాలే. బ్యాంకింగ్, సేవింగ్స్, ఫ్రాడ్ ప్రివెన్షన్లకు సంబంధించిన ఈ స్టోరీలను ఇన్‌ఫర్‌మేటివ్, ఎంటర్‌టైనింగ్ విధానంలో రూపొందించారు.

'నా వాయిస్ రికార్డు అవుతున్నందుకు గర్వంగా ఉంది. స్టోరీ చదువుతున్నప్పుడు ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. కష్టపడి సంపాదించిన డబ్బు ఖర్చు చేయడం తప్ప పొదుపు చేయడం అనే అలవాటు చాలా మందిలో ఉండదు. పొదుపు అలవాటును ఒక కథ నొక్కి చెబుతుంది' అంటున్న బొకాలే తన డిజిటల్ అక్షరాస్యతను కూడా పెంచుకుంటోంది. ఏఐ టెక్నాలజీకి సంబంధించి ఆసక్తికరమైన విషయాలు తన స్మార్ట్ ఫోన్ ద్వారా తెలుసుకుంటుంది.

'మరాఠీలో ఏఐ టూల్స్ అందుబాటులోకి వస్తున్నందుకు ఆనందంగా ఉంది' అంటుంది బొకాలే. మొత్తం పదకొండు రోజులలో ఆమె చేసిన అయిదు గంటల పనికి రెండువేల రూపాయలు అందుకుంది.

వాయిస్ అరువు ఇచ్చినందుకు వచ్చిన డబ్బులను గ్రైండర్ రిపేరింగ్ కోసం ఉపయోగించింది.

పొదుపు మంత్రం


ఈ ఫొటోలో ఉన్న వారు (ఎడమ నుంచి) పార్వతీ కెంభ్లే, సురేఖ గైక్వాడ్, బేబీ రాజారామ్ బొకాలే. గతంలో ఈ ముగ్గురు ఒకచోట కూర్చుంటే ఏం మాట్లాడుకునేవారో తెలియదుగానీ ఇప్పుడు మాత్రం పొదుపు, వ్యాపారం లాంటి విషయాల గురించే ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. వీరి సెల్ఫ్-హెల్ప్ బ్యాంకింగ్ గ్రూప్ ఎంతో మంది మహిళల్లో పొదుపు అలవాట్లను పెంచుతోంది. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకునేలా చేస్తోంది.


బేబి రాజారామ్ బొకాలే

'సమయం రాత్రి 10.30 గంటలు. ఒక మూలన రంగురంగుల వెలుగులతో మెరిసిపోతున్న కృష్ణుడి మందిరం ఉన్న చిత్రం కనిపిస్తోంది. మంచంపై కూర్చున్న ఆమె తన స్మార్ట్ ఫోన్‌లో ఒక యాప్ ఓపెన్ చేసి స్పష్టమైన, ప్రతిధ్వనించే గొంతుతో ఒక కథను బిగ్గరగా చదవడం మొదలుపెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌కు మరాఠీలో ట్రెనింగ్ ఇచ్చేందుకు బొకాలే గొంతును ఉపయోగించుకుంటున్నారు' అంటూ తన బ్లాగ్‌లో రాసింది మైక్రోసాఫ్ట్.

'ఇలాంటి పని ఒకటి చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు' నవ్వుతూ అంటుంది బొకాలే. కాలేజీ పిల్లల నోటి నుంచి 'ఏఐ' అనే మాట వినడం తప్ప దానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్ట్‌లో భాగం అవుతానని ఆమె ఊహించలేదు.

పుణెలోని ఖరడ్ ఏరియాలో చుట్టుపక్కల వారు బొకాలేను 'బేబీ అక్కా' అని ప్రేమగా పిలుస్తారు. సెల్ఫ్-హెల్ప్ బ్యాంకింగ్ గ్రూప్ మొదలు పెట్టి మహిళలలో పొదుపు అలవాట్లు పెంపొందిస్తుంది బొకాలే. తాము దాచుకున్న పొదుపు మొత్తాలతో చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించిన మహిళలు ఎందరో ఉన్నారు.

51 సంవత్సరాల సురేఖ గైక్వాడ్ కూడా 'కార్య' కోసం మరాఠీ విషయంలో బేబీలాగే పనిచేస్తుంది. చిన్నపాటి కిరాణా దుకాణం నడుతున్న సురేఖ 'ఈ పని నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది' అంటుంది. బ్యాంకులో డబ్బు ఎలా డిపాజిట్ చేయాలి, ఎలా డ్రా చేయాలి... వంటి వాటి నుంచి కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత వల్ల కలిగే ఉపయోగాల వరకు ఎన్నో విషయాలు తెలుసుకుంది. పొదుపుపై దృష్టి పెట్టింది సురేఖ.

55 సంవత్సరాల మీనా జాదవ్ కూడా 'కార్య' కోసం పనిచేస్తోంది. తనకు వచ్చిన డబ్బును టైలరింగ్ బిజినెస్‌కు అవసరమైన మెటీరియల్ కొనడానికి ఉపయోగించింది. ఇప్పుడు మీనా సేవింగ్ ఎకౌంట్‌ను ఉపయోగిస్తుంది. ఏటీయం ను ఎలా ఉపయోగించాలో తెలుసుకుంది.


ఏఐ మోడల్స్‌కి మరాఠీ

మరో మహిళ తాను సంపాదించిన డబ్బును కుమార్తె చదువుకు సంబంధించి పొదుపు ఖాతా ప్రారంభించడానికి ఉపయోగించింది. వీరందరు తమ పనిని ఆస్వాదించడమే కాదు ఫైనాన్షియల్ ప్లానింగ్, ఆన్‌లైన్ టూల్స్ ఉపయోగం, ఎలా ఉపయోగించాలి, స్మార్ట్‌ఫోన్ ద్వారా కొత్త ఉపాధి అవకాశాలు ఎలా సృష్టించుకోవాలో తెలుసుకున్నారు.

'అన్ని కమ్యూనిటీలు భాగం కావడమే కార్య విజయానికి కారణం. 'కార్య'కర్తలలో మహిళలే ఎక్కువ. ఈ పని వల్ల నాకు ఎంత డబ్బు వస్తుంది అనేదాని కంటే ఈ పని చేయడం వల్ల నాకు, నా కుటుంబానికి చెడ్డ పేరు రాదు కదా! అనేది ఎక్కువ మంది మహిళల నుంచి వచ్చే ప్రశ్న' అంటుంది మైక్రోసాఫ్ట్ రిసెర్చర్ కాళిక బాలి.

పైలట్ ప్రాజెక్ట్‌లో భాగమైన కొద్దిమంది మహిళలకు మొదట్లో స్మార్ట్‌ఫోన్ ఎలా ఉపయోగించాలి అనేది బొత్తిగా తెలియదు. అలాంటి వారు కుటుంబ సభ్యులు, బంధువులు ఆశ్చర్యపడేలా స్మార్ట్‌ఫోన్‌ను అద్భుతంగా ఉపయోగిస్తున్నారు. స్థూలంగా చెప్పాలంటే వారి ప్రగతి ప్రయాణంలో ఇది తొలి అడుగు మాత్రమే.



ఎవరైతే ఈ ప్రపంచంలో నానాత్వాన్ని మాత్రమే చూచి, అందులోని ఏకత్వాన్ని (బ్రహ్మను) గ్రహించలేకపోతారో అలాంటివారు మృత్యువు నుంచి మృత్యువుకు సాగిపోతుంటారు. అంటే జనన మరణ చక్రం నుండి బయటపడలేక కొట్టుకుపోతుంటారు.

– కఠోపనిషత్తు

సాక్షి

శనివారం, 10 ఫిబ్రవరి 2024

‘బ్లాక్ అండ్ వైట్’ నిజాలు!

సందిగ్ధతకు తావు లేకుండా విషయం తేటతెల్లమయ్యే స్థితివుంటే, తప్పొప్పులు స్పష్టంగా అర్థమవుతుంటే... అలాంటి పరిస్థితిని వ్యక్తీకరించటానికి ఆంగ్లంలో ‘బ్లాక్ అండ్ వైట్’ అనే నుడికారాన్ని ఉపయోగిస్తారు. గురువారం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం శ్వేతపత్రం (వైట్ పేపర్) విడుదల చేయగా, దీనికి పోటీగా కాంగ్రెస్ నల్లపత్రం (బ్లాక్ పేపర్) ప్రకటించింది. ఇది ఎన్నికల రుతువు గనుక అధికారంలోకొచ్చి పదేళ్లవుతున్న సందర్భంలో ఆర్థిక రంగంలో తమ ఘనతను చాటుతూ ఎన్డీయే సర్కారు శ్వేతపత్రాన్ని తీసుకొచ్చింది. ఈ పదేళ్లూ ‘కర్తవ్య కాలమ’ని ఆ పత్రం అభివర్ణించింది. 2014కు ముందు యూపీఏ ప్రభుత్వ విధానాల పర్యవసానంగా ఆర్థికరంగంలో ఎంతటి అరాచకత్వం, ఎలాంటి విచ్చలవిడితనం చోటుచేసుకున్నాయో వివరించింది. 2004లో యూపీఏ అధికారంలోకి రావడానికి ముందున్న ఎన్డీయే సర్కారు దృఢమైన, ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థను అందించివెళ్తే యూపీఏ దాన్ని కాస్తా ధ్వంసం చేసిందన్నది శ్వేతపత్రం ఆరోపణ. కాంగ్రెస్ విడుదల చేసిన బ్లాక్ పేపర్ ఎన్డీయే ప్రభుత్వ పదేళ్ల వైఫల్యాలను ఏకరువు పెట్టింది. ఈ కాలాన్ని ‘అన్యాయ కాలం’గా అభివర్ణించించింది. అందులో ఆర్థిక రంగంతోపాటు ఇతరేతర అంశాలను కూడా ప్రస్తావించింది. రెండూ ఒకేరోజు విడుదల కావటంవల్ల వాస్తవ స్థితి ఏమిటో ‘బ్లాక్ అండ్ వైట్’లో తేటతెల్లమవుతుందని ఎదురుచూసిన వారికి మాత్రం నిరాశే మిగిలింది. ఇప్పుడు యూపీఏ ఉనికిలో లేదు. దాని స్థానంలో ‘ఇండియా’ పేరుతో కొత్త కూటమి రంగంలోకొచ్చింది. గతంలో యూపీఏకు నేతృత్వం వహించినట్టే ఇప్పుడు ‘ఇండియా’కు తానే అన్నీ అయి కాంగ్రెస్ వ్యవహరిస్తోంది. అయినా శ్వేతపత్రానికి కూటమి తరఫున కాక ఆ పార్టీయే సమాధానం ఇవ్వాల్సివచ్చింది.

ఉన్న స్థితిగతులను గణాంక సహితంగా చెప్పటానికి విడుదల చేసే పత్రాన్ని శ్వేతపత్రం(వైట్ పేపర్) అంటున్నారు. ఎన్డీయే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసినంత మాత్రాన దానికి పోటీగా బ్లాక్ పేపర్ పేరిట కాంగ్రెస్ ఎందుకు విడుదల చేయాలనుకుందో తెలియదు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం నింద తొలగించుకోవటానికీ, బీజేపీ ‘నమ్మకద్రోహాన్ని’ చాటడానికీ 1993 మొదట్లో అప్పటి పీవీ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. దాన్ని పూర్వపక్షం చేస్తూ, జరిగిన తప్పిదాలకు కేంద్రానిదే బాధ్యతని వివరిస్తూ బీజేపీ సైతం శ్వేతపత్రాన్నే ప్రకటించింది. ఒకటి మాత్రం వాస్తవం... పత్రాలకు ఏ పేర్లున్నా వాటిల్లో వుండేవి గణాంకాలే. సామాన్యుల బతుకులు చూస్తే తప్ప వాస్తవ స్థితిగతులేమిటో అర్థంకావు.

వాజ్‌పేయి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం గురించి శ్వేతపత్రం ఘనంగానే చెప్పింది. ఇప్పుడే కాదు, అప్పుడు కూడా ఎన్డీయేది అదే మాట. తమ అయిదేళ్ల పాలన పరమాద్భుతంగా ఉన్నదంటూ ‘భారత్ వెలిగిపోతోంది’ అనే నినాదంతో నాటి ఎన్డీయే 2004 లోక్‌సభ ఎన్నికలకు వెళ్లింది. కానీ ప్రజలు తిరస్కరించారు. తాజా శ్వేతపత్రం మాత్రం నాటి ఎన్డీయే సర్కారు సుదృఢమైన ఆర్థిక వ్యవస్థను అప్పగించిందని చెబుతోంది. దాని మాటెలావున్నా యూపీఏ తొలి అయిదేళ్ల పాలన ఒడిదుడుకులు లేకుండానే గడిచిందని చెప్పాలి. రెండోసారి నెగ్గాక అతి విశ్వాసమో, ఎదురులేదన్న దురహంకారమో యూపీఏను దెబ్బతీశాయి. పార్టీలోనూ, వెలుపలా ప్రత్యర్థులను అణచివేసేందుకు అప్రజాస్వామిక విధానాలు అమలయ్యాయి. శ్వేతపత్రం ప్రస్తావించిన బొగ్గు కుంభకోణం, కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణం తదితర 15 స్కాములలో అధికభాగం రెండో దశ పాలనలోనివే. పీవీ ప్రభుత్వం తీసుకొచ్చిన 1991 నాటి ఆర్థిక సంస్కరణలు తన ఘనతేనని చెప్పుకుని కూడా వాజ్‌పేయి సర్కారు అందించిన అవకాశాలను వినియోగించుకోలేని చేతగాని స్థితిలో యూపీఏ పడిందన్నది శ్వేతపత్రం ప్రధాన ఆరోపణ. కానీ వెనక్కి తిరిగి చూస్తే ఆర్థిక సంస్కరణల పర్యవసానంగా చేతివృత్తులు దెబ్బతిని, వ్యవసాయం గిట్టుబాటు కాక, కొత్తగా ఏర్పడిన ఉపాధి అవకాశాలను అందుకోలేక భిన్న వర్గాలు పడిన యాతనలు అన్నీ ఇన్నీ కాదు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న రాసిన ‘పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల’ గీతం ఈ దీనస్థితికి అద్దం పట్టింది. సంస్కరణలు మానవీయ దృక్పథంతో వుండాలన్న ఆలోచన ఆ తర్వాత వచ్చిందే. అనుత్పాదక ప్రయోజనాలకు వ్యయం చేయటంతో 2003–04లో 31 శాతంగా వున్న పెట్టుబడి వ్యయం 2013–14 నాటికి 16 శాతానికి దిగజారిందని శ్వేతపత్రం అంటోంది. అయితే 2008–09లో ప్రకటించిన రూ. 52,000 కోట్ల రుణమాఫీని ఈ జాబితాలో చేర్చటం సరికాదు. సాగురంగానికి జవసత్వాలివ్వటానికీ, గ్రామీణ ఆర్థికవ్యవస్థ పుంజుకోవటానికీ ఆ చర్య దోహదపడింది. సగటు ద్రవ్యోల్బణ శాతం 8 నుంచి 5కు తీసుకురావటం, తలసరి జీడీపీలో వృద్ధి, పెట్టుబడి వ్యయం పెరుగుదల, పరోక్ష పన్ను రేటులో తగ్గుదల వంటివి తమ విజయాలుగా శ్వేతపత్రం తెలిపింది. అయితే నల్లధనాన్ని వెలికి తీయటానికంటూ అమలు చేసిన పెద్దనోట్ల రద్దు ప్రస్తావన ఇందులో లేదు.

యూపీఏ కాలంనాటి అవ్యవస్థనూ, దాని చేతగానితనాన్నీ గణాంక సహితంగా చెప్పకపోవటం వల్ల అప్పటి పరిస్థితులపై కాంగ్రెస్ స్వోత్కర్షలకు పోతోందని ఏనాటినుంచో బీజేపీ శ్రేణుల్లో అసంతృప్తి వుంది. తాజా శ్వేతపత్రం ఆ లోటైతే తీర్చింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలు బీజేపీకి ఆయుధాలవుతాయి. అటు కాంగ్రెస్ అప్పట్లో తాము సాధించిందేమిటో చెబుతుంది. భావోద్వేగాలతో ముడిపడిన అంశాలు కాక, జనం మౌలిక సమస్యలు ప్రధాన చర్చనీయాంశాలు కావటం ఎప్పుడూ మంచిదే.

మణిపుర్‌కు మతం రంగు!

మణిపుర్‌లో విధ్వంసం కన్నా మణిపుర్‌పై విధ్వంసక ప్రచారమే ఎక్కువగా జరుగుతోంది! దేశంలో ఎక్కడేం జరిగినా దానికి మతాన్ని అంటుకట్టేలా తయారైన రాజకీయ వ్యవస్థ ఆఖరికి మణిపుర్‌లోని తెగల మధ్య ఘర్షణలను కూడా ‘మత కలహాలు’గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. మణిపుర్‌తో సంబంధం లేని రాష్ట్రాలకు సైతం ఆ ‘రాజకీయ మతోన్మాదం’ వ్యాపించింది! దురుద్దేశాలతో కొన్ని విదేశీ శక్తులు, పొద్దెరగని కొందరు దేశవాళీ కొత్త రాజకీయవాదులు స్వార్థ ప్రయోజనాల కోసం మణిపుర్ నిప్పుల కుంపటిని తమ ప్రసంగ వేదికలపైకి మోసుకెళుతున్నారు. అవి మత కలహాలు కావు... భూమి హక్కుల తగాదాలని తెలిసీ మణిపుర్‌కు మతం రంగును పులుముతున్నారు!

నిరుడు ఈ సమయానికి మణిపుర్ ప్రశాంతంగా ఉంది. ఫిబ్రవరిలో ప్రశాంతం. మార్చి నెలలో కూడా ప్రశాంతం. ఏప్రిల్ వచ్చేసరికి కొంచెం వేడెక్కింది. అయితే అది... ఏప్రిల్‌లో 16 సెల్సియస్ డిగ్రీలతో మొదలై, జూన్ నాటికి 35 డిగ్రీల వరకు చేరుకునే ఎండాకాలపు వేడిమి కాదు. నిరసన ప్రదర్శనల వేడి. దాడులు, దహనాల వేడి.

నిజానికి అంతకు పదేళ్లు, ఆ ముందు పదేళ్ల నుంచి కూడా మణిపుర్ దాదాపుగా ప్రశాంతంగానే ఉంది. రాష్ట్రాన్నే రెండు ముక్కలు చేసేంతగా అక్కడేం జరగలేదు. గత మే నెల నుంచే హింసాకాండ మొదలైంది. మూకుమ్మడి దాడులు, గృహదహనాలు, ప్రార్థనా స్థలాల ధ్వంసం, మహిళల్ని నగ్నంగా ఊరేగించడం మణిపుర్‌ను అగ్నిగుండంలా మార్చేశాయి. ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో 180 మంది మరణించారు. దాదాపు 60 వేల మంది నిరాశ్రయులయ్యారు.

డిసెంబరులో మణిపుర్ కాస్త ఊపిరి పీల్చుకున్నట్లుగా కనిపించినప్పటికీ కొత్త సంవత్సరంలో మళ్లీ ఒక్కసారిగా హింస చెలరేగింది. జాతుల మధ్య మొదలైన ఈ ఘర్షణలు విద్వేష జ్వాలలే అయ్యాయి. ఇంతకన్నా ఘోరం... అక్కడ జరుగుతున్న ఘటనలపై పాశ్చాత్య మీడియా చేస్తున్న దుష్ప్రచారం! వారితో పాటు అంతర్గతంగా మన దేశంలోని కొన్ని రాష్ట్రాలు కూడా మణిపుర్‌కు మతం రంగు పులిమేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ‘‘1947లో పంజాబ్‌లో మతపరమైన ఉద్రిక్తతలతో జరిగిన నిర్మూలన కాండను మణిపుర్ ఘటనలు గుర్తు చేస్తున్నాయి’’ అనేంతగా ప్రచారం జరుగుతోంది. వారి వ్యతిరేకత ఎవరి మీదనైనా కావచ్చు. కానీ వాస్తవాలను హతమార్చడం ఎందుకు? పర్ణశాల వంటి మణిపుర్‌పై మతోన్మాద మరకల్ని అంటించడం దేనికి?

భౌగోళికంగా మణిపుర్ ప్రత్యేకమైనది. రాష్ట్రంలో కేవలం పది శాతం మాత్రమే ఉన్న మైదాన భూభాగంలో రాష్ట్రంలోని దాదాపు తొంభై శాతం ప్రజలు నివసిస్తున్నారు. అందులో ఎక్కువ శాతం మైతేయిలు. రాష్ట్రంలో వారి జనాభా దాదాపు 53 శాతం. దీంతో సహజంగానే రాజకీయాల్లో వారిదే ప్రాబల్యం. 60 సీట్ల అసెంబ్లీలో 40 స్థానాలు వాళ్లవే.

కొండ ప్రాంతాల్లోని గిరిజనులైన కుకీలు, నాగాలకు ఎస్టీ రిజర్వేషన్ ఉండటం, మైదాన ప్రాంత గిరిజనులైన మైతేయిలకు ఎస్టీ రిజర్వేషన్ లేకపోవడం... కాలక్రమంలో రెండు వర్గాల మధ్య సఖ్యత లోపించడానికీ, సంఘర్షణకూ కారణం అవుతూ వచ్చింది. ఈ క్రమంలోనే వారి మధ్య సంబంధాలు మరింతగా క్షీణించడానికి మణిపుర్ హైకోర్టు గత ఏడాది మార్చిలో ఇచ్చిన తీర్పు కారణం అయింది. మణిపుర్‌ను రణపుర్‌గా మార్చేసింది.

2023 మార్చి 27న షెడ్యూల్డు తెగల జాబితాలోకి మైతేయి తెగలను చేర్చేందుకు కేంద్ర ఆదివాసీ శాఖకు సిఫారసు చేయాలని మణిపుర్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ


సహాయక శిబిరాలలో మణిపుర్ నిరాశ్రయులు

తీర్పుపై కుకీలు, నాగాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మెజారిటీ వర్గంగా మైతేయిలదే రాజకీయంగా పైచేయిగా ఉందనీ, హిందువుల్లోని ఎస్సీ, ఓబీసీ హోదాలకున్న ప్రయోజనాలను వారు ఇప్పటికే అనుభవిస్తున్నారనీ, కాబట్టి వారికి ఎస్టీ హోదా ఇవ్వటం సరికాదనీ అభ్యంతరం చెబుతున్నారు. మైతేయిలకు రిజర్వేషన్లు దక్కితే వారు తమ అటవీ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటారనీ, తమ ఉద్యోగాల వాటా తగ్గిపోతుందనీ ఆందోళన చెందుతున్నారు.

అయితే, మైతేయిల వాదన మైతేయిలకు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని నాగా, కుకీ ఆదివాసీల్లోని ముప్పైకి పైగా తెగలకు ఎస్టీలుగా ప్రభుత్వ గుర్తింపు ఉంది. తమకు ఆ గుర్తింపు లేని కారణంగా దేశంలోని ఎవరైనా వచ్చి తాముంటున్న ఇంఫాల్ లోయ ప్రాంతంలో భూమి కొనొచ్చుగాని... తమకు మాత్రం పర్వత ప్రాంతాల్లో భూమి కొనుక్కోవటానికి వీలులేకుండా పోయిందన్నది మైతేయిల వాదన. అంతేకాదు 1949లో భారత్‌లో కలవటానికి ముందు మైతేయిలను ఆదివాసీ తెగగానే గుర్తించారని వారు గుర్తు చేస్తున్నారు. ఆ హోదాను పునరుద్ధరించాలని మాత్రమే తాము కోర్టుకు విన్నవించుకున్నాం అని మైతేయి సంఘం అంటోంది. కేవలం రిజర్వేషన్ల కోసమే కాకుండా... సంస్కృతిని, భాషను, భూమిని, తమ సంప్రదాయాలను కాపాడుకోవటం కోసం ఎస్టీలుగా గుర్తింపును కోరుతున్నామని కోర్టులో వాదించింది. మణిపుర్ హైకోర్టు ఈ వాదనలతో ఏకీభవించింది.

హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆందోళనకు పిలుపు ఇవ్వటం, అది హింసాత్మకంగా మారటంతో ఆందోళన మంటలు రాష్ట్రంలో రాజుకున్నాయి. రెండు వైపులా మరణాలు సంభవించాయి. చర్చిలు, దేవాలయాలు ధ్వంసం అయ్యాయి. ఇవేమీ మత కలహాలు కావు. భూమి హక్కుల విషయమై మొదలై, నేటికీ కొనసాగుతున్న ఘర్షణలు.

అయితే మణి పూర్‌లో జరుగుతున్నవి మత ఘర్షణలు అని, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని హిందువులు విధ్వంసానికి పాల్పడుతున్నారనే దుష్ప్రచారం సాగుతోంది. గమనించాల్సి వాస్తవం ఏమిటంటే మైతేయి తెగల్లో అధిక సంఖ్యాక హిందువులతో పాటు, ముస్లింలు, క్రిస్టియన్‌లు; కుకీ నాగాల్లోనూ అధిక సంఖ్యాక క్రిస్టియన్‌లతో పాటు హిందువులు, ముస్లింలు ఉన్నారన్నది!

మణిపుర్ తెగల మధ్య ఘర్షణలు మతాల మధ్య చిచ్చుగా కొన్ని పాశ్చాత్య దేశాలకూ, మన దేశంలోనే కొన్ని రాజకీయ పార్టీల వారికీ మాత్రమే ఎందుకు కనిపిస్తోంది? ఎందుకంటే, ఎవరి స్వార్థ ప్రయోజనాలు వారివి. నిజానికి మత ఘర్షణలనేవి మణిపుర్ చరిత్రలోనే లేవు. ‘‘కుకీ, నాగా తెగలకు పరిపాలనలో స్థానం కల్పించిన చరిత్ర మైతేయిలది. మణిపురి ప్రజలకు మతోన్మాదం లేదు. 19వ శతాబ్దంలో రాచరిక పాలనలో హిందూమతం ఆధిపత్యం చలాయించిందన్నది నిజమే, కానీ అది ఎక్కువ కాలం కొనసాగలేదు. మరిక మతోన్మాదం ఎక్కడి నుంచి వచ్చింది?’’ అంటారు మణిపుర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రియోరంజన్ సింగ్.

అయితే రెండు వేలకు పైగా చర్చిలను ధ్వంసం చేశారని కొన్ని రాజకీయ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఆ వివరాలను వారికి ఏ క్రైస్తవ దేశాలు అందించాయో వారే చెప్పాలి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే చూసినా 100 దేవాలయాలతో పాటు రెండు వేల మైతేయి ఇళ్లపై కూడా దాడులు జరిగాయి. మరి వీటిని ఏమంటారు? మత ఘర్షణలు అనేనా! మైతేయి వర్గం ప్రయోజనాల కోసం ఏర్పాటైన కోకోమి ప్రతినిధి కె. ఓథాబాయ మాట్లాడుతూ, ‘‘మణిపుర్‌లోని సమస్యలు మతపరమైనవి కావు’’ అని స్పష్టం చేశారు. ఆ మాటను కాంగ్రెస్ పార్టీ వాళ్లకు చెప్పేవారెవరు? ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు చెప్పేవారెవరు? ‘‘మణిపుర్‌లో మతం పేరుతో ఎప్పుడూ అల్లర్లు జరగలేదు. జరుగుతున్నదాన్ని డైవర్ట్ చేసి మతపరమైన హింసగా చూపించడం ఇదే మొదటిసారి’’ అని స్వయంగా మణిపుర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేబబ్రత సింగ్ అన్నారు కదా!

బాధ్యత గల రాజకీయ నాయకులు ఎవరూ మణిపుర్‌లో జరుగుతున్న మతపరమైన దాడులు అని అనలేదు. అలాంటి ప్రచారానికి తావు కూడా ఇవ్వరు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇందుకు భిన్నంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మణిపుర్‌కు మతం రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారు. ‘‘మీరు క్రిస్టియన్ అయ్యుండీ ఎందుకు మణిపుర్ క్రిస్టియన్‌లను సమర్థించడం లేదు?’’ అని ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. ఆమె ఏ ఉద్దేశంతో ఇలా ఒక మతం వారిని రెచ్చగొట్టే ప్రసంగాలను ఇస్తున్నారో ప్రత్యేకించి చెప్పే పని లేదు.

– మాధవ్ శింగరాజు, సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

థాంక్యూ



పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇస్తున్నందుకు. (ప్రధాని) నరేంద్ర మోదీ దేశ కృతజ్ఞతకు అర్హులు. నిజానికి ఇది (మాజీ ప్రధాని) మన్మోహన్ సింగ్ చేయవలసింది. కానీ ఆయనకు ఆ ధైర్యం లేకపోయింది.

– సుబ్రమణియన్ స్వామి
కేంద్ర మాజీ మంత్రి

మేమిచ్చామని..



వివాదాస్పద అభిప్రాయం: (ఎల్.కె.) అద్వాణీకి ఇచ్చినదానికంటే కూడా (పీవీ నరసింహా) రావుకు భారతరత్న ఇవ్వడం అతిపెద్ద సామాజిక రాజకీయ ప్రకటన!

– అమిత్ పాండీలియా,
కాలమిస్ట్

ఇచ్చేయ్!



భారతరత్న పురస్కారాలు కొత్త పద్మశ్రీల్లా మారినట్టున్నాయి. వాటికి ఇంక పెద్ద ఆకర్షణ ఉండనట్టుగా పంచి పెడుతున్నారు.

– సుశాంత్ సరీన్, ఫెలో

శుభాకాంక్షలు



హ్యాపీ లూనార్ న్యూ ఇయర్! డ్రాగన్ సంవత్సరం అందరికీ శుభాలను తేవాలని కోరుకుంటున్నాను. (చైనీస్ క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 10న డ్రాగన్ ఇయర్ ప్రారంభమవుతుంది.)

– టింగ్‌టింగ్ లియు
తైవాన్ యాంకర్

బైబై బైడెన్



నేను గతేడాది చెప్పాను, మళ్లీ చెబుతున్నాను. డెమొక్రటిక్ (పార్టీ) నామినిగా (ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు) బైడెన్ ఉండబోరు. పరిణామాలు చూస్తుంటే, అదిఇంకా నిజం అయ్యేట్టు కనబడుతోంది.

– వివేక్ రామస్వామి
అమెరికా రిపబ్లికన్ నేత

టెక్నాలజీ



కొన్ని నెలల్లో నేను ఇక నా ఫోన్ నంబర్ వాడను. మెసేజులు, ఆడియో/వీడియో కాల్స్ కోసం కేవలం ‘ఎక్స్’ను మాత్రమే ఉపయోగిస్తాను.

– ఎలాన్ మస్క్
‘ఎక్స్’ అధినేత

ఇన్ బాక్స్

దళిత తాత్వికతకు మేనిఫెస్టో

నేటి తెలుగు దళిత కవిత్వంలో కేవలం ఒక్క ప్రతినిధిని మాత్రమే ఎన్నుకోమంటే నా ఛాయిస్ మద్దూరి నగేష్ బాబే! దళిత వాదానికి కమిట్మెంట్ విషయంలో కానీ, కవితా కళపట్ల తపన విషయంలో కానీ, రాజీలేని మార్గం మద్దూరిది. దళిత కవిత్వంలో వ్యక్తమయిన అనేక కోణాలూ, భావనలూ సమగ్రంగా, సాధికారికంగా, ప్రామాణికంగా నూతన కళాతాత్వికతను సంతరించుకుని చాలా అద్భుతంగా మద్దూరి కవిత్వంలో ఒదిగి పోయాయి.

దళిత కవిత్వానికి అంబేడ్కరిజమే ప్రాపంచిక దృక్పథమని ఒప్పుకోవటానికి కొంతమంది నేర్పరులు వెనకాడుతున్నప్పుడు, నంగి నంగి పలుకుల్తో దాటవేస్తున్నప్పుడు నగేష్ ఢంకా బజాయించి అంబేడ్కరిజమే దళిత కవిత్వానికి ప్రాణం అని ప్రకటించాడు. అట్లా అని కవిత్వంలో డైరెక్టుగా అంబేడ్కరిజాన్ని ఒక వస్తువుగా నగేష్ ఎప్పుడూ ట్రీట్ చెయ్యలేదు. దళిత జీవితాన్ని మొత్తం భారతీయ వాస్తవికతనీ, అంబేడ్కరిస్టు దృక్పథం నుంచి చూస్తూ కవిత్వీకరించాడు. జీవితాన్నీ, కవిత్వాన్నీ దళితీకరించే క్రమాన్ని మద్దూరి పర్‌ఫెక్ట్ చేశాడు.



‘నా కవిత్వం చదివి కులోన్మాదులు వణికిపోవాలి, విరిగి, కూలిపోవాలి. పీడిత కులాల జనం పరవశించి పోవాలి. పూనకంతో ఊగిపోవాలి. ఇదీ... నా కల’ అంటూండేవాడు. నగేష్ అన్నమాటను అతని కవిత్వం నిజం చేసింది. ఆఫ్రో అమెరికన్ కవిత్వాన్ని రాసిన ‘అమిరి బరకా’ తప్ప వేరెవ్వరికీ ఈ ఘనత లేదు.

కవిత్వ రూప సారాల్లోని బ్రాహ్మణ వాదాన్నీ, సంస్కృతీకరణనూ చావుదెబ్బ తీసిన మద్దూరి, పురాణాల్లోని, పవిత్ర గ్రంథాల్లోని హిందూ దేవుళ్ళనీ, దేవతల్నీ, రుషుల్నీ, దేవాలయాల్నీ నెగెటివ్ సింబల్స్‌గా నిర్మించటంలో కొత్త పోకడల్ని చవి చూపాడు. దళిత కవిత్వానికి సరికొత్త మిథాలజీనీ, ఐకనాలజీనీ, అలాదు ప్రతీకల్నీ, ప్రతిమల్నీ నిర్మించి, తన తోటి కవులకు నగేష్ దారి చూపాడు.

‘చిక్కనవుతున్న పాట’ దళిత కవితా సంకలనంలో తన దళిత సంతకాన్ని పరిచయం చేసి ‘నిశాని’లో దళిత ఆత్మగౌరవ ఎజెండాని సెట్ చేశాడు. ‘వెలివాడలో’లో దళితత్వాన్ని దళిత ఈస్థటిక్స్‌లో ప్రదర్శించాడు. ‘పదు నెక్కిన పాట’లోని తన కవితల ద్వారా దళిత ఆర్థికతనూ, దళిత సాంస్కృతిక ఆకాంక్షల్నీ అలలు అలలుగా వ్యాపింపజేశాడు. ఇక ‘మీరేవుట్లూ’ అనే పుస్తకం దళిత తాత్వికతకూ, స్వప్నాలకూ, సాహసాలకూ మేనిఫెస్టో కింద లెక్క. ఈ ఒక్క పుస్తకం చదివినా దళిత కవిత్వపు విభిన్నతా విశిష్టతా ఈజీగా బోధపడతాయి.

నగేష్, ఖాజాతో కలిసి సంపాదకత్వం వహించిన ‘విడి ఆకాశం’ కుల సంబంధాల దృష్టి నుంచి ప్రేమను సరికొత్తగా ఆవిష్కరించి చరిత్రను సృష్టించింది. నగేష్ రాసిన దళిత స్త్రీవాద కవితలు ఎంతోమందికి కనువిప్పు. ఏం కావాలి? అని ఎవరయినా అడిగితే ‘నీ గుండెలో నాకు చోటు కావాలి/ నీ ఇంట్లో నేను చెయ్యి కడగాలి / మనం చుట్టాలం కావాలి’ అని సింపుల్‌గా చెబుతాడు మద్దూరి. ‘మీరేవుట్లూ?’ అని అడగటం అంటే ‘కాగితాన్ని చించినట్లు ఒక మనిషిని పర్రున చీల్చటం / వడ్లని మరలో పోసి స్విచ్చేసినట్లు మనిషిని మరాడించటం’ అని గుండెను బద్దలుకొడతాడు.

దళిత కవిత్వం దళిత రాజ్యాధికార భావనకు కళాత్మక తోబుట్టువు. మద్దూరి నగేష్ బాబు కవిత్వమే ఇందుకు పెద్ద నిదర్శనం. దళిత భారతి అవసరాలకీ ఆశయాలకీ నేరుగా అద్దంపడుతూ నగేష్ రాసిన కవిత్వం ఎంతో విలువైనది. తన కవితల్ని ‘అసాసిన్ పోయమ్స్’ (Assassin poems) అంటాడు బరకా. నగేష్ కవితలూ అంతే.

– జి. లక్ష్మీనరసయ్య | కవి, సాహితీ విమర్శకుడు

(నేడు గుంటూరులో మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ)

ఆంగ్ల మాధ్యమం అనుసరణీయం

అభిప్రాయం


కె.ఎస్.ఎస్. శేషన్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి బోధనా మాధ్యమంగా ఆంగ్లాన్ని ప్రవేశపెట్టాలని తీసుకున్న నిర్ణయం సరైన దిశలో ఒక సాహసోపేతమైన ముందడుగు. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా ముందుకు వెళుతోంది. ఇంగ్లీషు మీడియం విద్య తన ముఖ్యమైన ఎజెండాల్లో ఒకటిగా చేసుకొంది. ఈ ఏడాది ఢిల్లీలోని రిపబ్లిక్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న శకటం ఇంగ్లీషు మీడియం చదువు ప్రాముఖ్యాన్ని ఎలుగెత్తి చాటింది. దీన్నిబట్టి ఏపీ ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమానికి ఎంత ప్రాముఖ్యం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణలో ఈ విద్యా సంవత్సరం నుంచే పాఠశాల, కళాశాల స్థాయిల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టడానికి కసరత్తు జరుగుతోంది. ఇంగ్లీషు మాధ్యమం విషయంలో కొందరు వ్యతిరేకత వ్యక్తం చేసినా ఇప్పుడు వారూ నిశ్శబ్దాన్ని ఆశ్రయించారు. మొత్తం మీద విద్యావేత్తలు, విద్యా నిర్వాహకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుండి ఆంగ్ల మాధ్యమ విద్యకు ఎంతో మద్దతు లభిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంగ్లీషును బోధనా మాధ్యమంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించి నప్పుడు మొదట్లో కొన్ని కార్పొరేట్ పాఠశాలలు, ఇతర స్వార్థ ప్రయోజనాలకు చెందిన కార్టెల్‌లు వ్యతిరేకించినప్పటికీ, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యా కార్యకర్తలు మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం బలమైన రాజకీయ సంకల్పంతో ముందుకు సాగింది. అనేక దళిత సంఘాలు, ఎన్జీఓ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో ర్యాలీలు నిర్వహించి బోధనా మాధ్యమంలో ప్రతిపాదిత మార్పుకు సంఘీభావం తెలిపాయి. ఆంగ్ల విద్య సామాజిక మార్పుకు నాంది పలుకుతుందనీ, సమాజంలోని పేదలు, అట్టడుగు వర్గాలకు విముక్తి కల్పించే సాధనంగా ఉపయోగపడుతుందనీ వారు భావించారు.

ఇంగ్లీషు చదువు వల్ల మాతృభాషకు నష్టం వాటిల్లుతుందని కొందరు అంటున్నారు. కానీ, భయపడాల్సిన పనిలేదు. ప్రాథమిక స్థాయి నుండే ఇంగ్లీషును ఒక సబ్జెక్ట్‌గా బోధిస్తే, పిల్లలకు ఆ భాషలో కూడా మెరుగైన వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలు నడిచే



యుగం ఇది. ఇంగ్లీషు పరిజ్ఞానం ఈ రంగాల్లో చాలా అవసరం. ఇవ్వాళ మన ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియంలో చదువుకుంటున్న పిల్లలకు మెరుగైన అవకాశాలు లభించడం ఖాయం. ఫలితంగా వారి కుటుంబాల జీవన ప్రమాణాలు పెరుగుతుంది. ఇది అంతిమంగా రాష్ట్ర, దేశ అభివృద్ధికి దారితీస్తుంది.

ఇంగ్లీషు ప్రాధాన్యతను పెరుగుతున్న సామాజిక–ఆర్థిక అవసరాల కోణంలో చూడాలి. సృజనాత్మక రచన, సాహిత్య ఎదుగుదల మాతృభాష ద్వారానే సాధ్యమవుతుందనేది నిజం. కానీ ఇంగ్లీషు... దేశం లోపలా, బయటా అన్ని చోట్లా ఉనికిలోకి వచ్చింది. లింక్ లాంగ్వేజ్‌గా ఉంది. ఈ భాష లేకుండా ఈ రోజు ‘ప్రపంచ పౌరుడి’ని ఊహించలేము. ప్రాథమిక పాఠశాలల నుండే ఇంగ్లీషు మీడియం ప్రవేశపెడితే సమాజంలో సమూలమైన మార్పు రావడం ఖాయం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం వల్ల ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు కట్టి పిల్లలను చదివిస్తూ సతమతమవుతున్న మధ్యతరగతి తల్లిదండ్రులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.


ప్రస్తుతం ఉన్న తెలుగు మాధ్యమాన్ని ఇంగ్లీషులోకి మార్చడం అనేక సవాళ్లతో కూడుకున్న పని. మొదటి అతి ముఖ్యమైనది ఉపాధ్యాయులకు కొత్తగా శిక్షణ ఇవ్వడం. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఇంగ్లీషు కమ్యూనికేషన్ ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది ప్రతి ఒక్కరికీ తెలుసు. అందువల్ల, ఉపాధ్యాయులు ‘ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ’ లేదా అటువంటి ఇతర సంస్థల ద్వారా, ‘ఉపాధ్యాయుల ఇండక్షన్ ప్రోగ్రామ్‌ల’ ద్వారా శిక్షణ ఇవ్వాలి. ఇంగ్లీషులో సబ్జెక్టుల బోధనకు ఉపయోగించే రీడింగ్/టీచింగ్ మెటీరియల్స్ తయారీలో ఉపాధ్యాయుల పాత్ర, విధి ఉంటుంది.

మాతృభాష ఆంగ్లం కాని పిల్లలకు బోధించడంలో అత్యంత సమగ్రమైన పద్ధతి, విధానాలు అత్యంత నైపుణ్యం కలిగి ప్రణాళికాబద్ధంగా అమలు చేయబడేవి. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కూడా పెంచాలి. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పాటూ ఎన్ఆర్ఐల ఇష్టపూర్వక సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని పాఠశాలల మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని ఆశిద్దాం.

వ్యాసకర్త హైదరాబాద్ విశ్వవిద్యాలయం
విశ్రాంత హిస్టరీ ప్రొఫెసర్

అతీంద్రియ శక్తులు

పతంజలి యోగదర్శనం విభూతి పాదం 16 నుండి 49 వరకు ఉన్న సూత్రాలు యోగి సాధించగల అతీంద్రియ లేక అసాధారణ శక్తులను గురించి వివరిస్తాయి. యోగికి భూత భవిష్యత్తుల గురించి, పూర్వ జన్మల గురించి తెలుస్తుంది. ఇతరుల ఆలోచనలు తెలుస్తాయి. నక్షత్ర గతులతో కూడిన సమస్త విశ్వం గురించి తెలుస్తుంది. శరీరం లోపలి నిర్మాణం గురించి తెలుస్తుంది. ఆకాశంలో సంచరించే శక్తి లభిస్తుంది. ఆకలిదప్పులను అణచివేసే శక్తితోపాటు, సూక్ష్మ శబ్దాల్ని కూడా వినగలిగే శక్తి లభిస్తుంది. పంచభూతాలు వశమౌతాయి.



సుత్తపిటకం దీర్ఘనికాయం పాథికవగ్గంలో బుద్ధుడు అసాధారణ శక్తుల్ని గురించి వివరిస్తాడు. అదృశ్యమవటం, అనేకమవటం, గాల్లోంచి వెళ్ళినట్లుగా గోడలోంచో, కొండలోంచో దూసుకు వెళ్ళటం, నీళ్ళ మీద నడవటం, ఆకాశంలో సంచరించటం, దూర శ్రవణం, పరుల చిత్తం గ్రహించటం, పూర్వ జన్మ జ్ఞానం, దివ్య చక్షు ప్రాప్తి మొదలైనవి అలాంటి శక్తుల్లో కొన్ని.

బుద్ధుడి శిష్యుల్లో చాలామంది ఇలాంటి అసాధారణ శక్తుల్ని పొంది ఉన్నారని తెలుస్తుంది. పురుషుల్లో మహా మౌద్గల్యాయనుడు, స్త్రీలలో ఉప్పలవణ్ణ వారిలో ముఖ్యులు.

పతంజలి అదే సమాధి పాదం 37వ సూత్రంలో ఈ విధమైన అతీంద్రియ శక్తులు ఆత్మసాక్షాత్కారం కలిగించే సమాధికి ఆటంకం కలిగిస్తాయి అనీ, మోక్షకాములైన యోగులు వాటిని హేయములని తలచి విడిచిపెడతారనీ పేర్కొన్నాడు.

అదే విధంగా బుద్ధుడు దీర్ఘనికాయం శీలఖండ వగ్గంలో ఇలాంటి అసాధారణ శక్తులు ప్రదర్శించటాన్ని తీవ్రంగా నిరసించాడు.

యోగికి సాధనా విశేషం వల్ల అతీంద్రియ శక్తులు కొన్ని సంప్రాప్తమైనా, పేరు ప్రఖ్యాతుల కోసం వాటిని ప్రజల ముందు ప్రదర్శించి మెప్పు పొందటాన్ని ఏ కాలంలోనూ మహాత్ములెవరూ హర్షించి ఆమోదించలేదు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.పాడ్యమి రా3.26 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ధనిష్ఠ రా.11.02 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.5.43 నుండి 7.11 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.33 నుండి 8.03 వరకు, **అమృతఘడియలు:** ప.1.14 నుండి 2.44 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.54.

III
సాక్షి బిజినెస్
శనివారం
10-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	167	71,595
నిఫ్టీ ▲	65	21,783

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,937	▲ 142
డోజోన్స్	38,606	▽ 121
ఎఫ్‌టీఎస్ఈ 100	7,573	▽ 23
డాక్స్	16,927	▽ 37
షాంఘై (బుధవారం ముగింపు)	2,866	▲ 36
నికాయ్	36,879	▲ 34

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,624	▲ 12
బంగారం (99.5 స్వచ్ఛత)	62,373	▲ 12
వెండి (కిలో)	70,638	▲ 688

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎఫ్‌బీఐ	82.57	83.59
£	బ్రిటన్ పౌండ్	ఎఫ్‌బీఐ	103.55	106.09
€	యూరో	ఎఫ్‌బీఐ	88.33	90.67
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎఫ్‌బీఐ	53.00	54.94
¥	జపాన్ ఎన్ (100)	కరెన్సీనోట్	43.00	68.00
S$	సింగపూర్ డాలర్	కరెన్సీనోట్	59.36	64.06
SAR	సౌదీ రియాల్	కరెన్సీనోట్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	కరెన్సీనోట్	21.71	23.50
¥	చైనా యువాన్	కరెన్సీనోట్	10.42	12.50

మహీంద్రాతో ఎంబ్రేయర్ భాగస్వామ్యం



ముంబై: భారత వైమానిక దళం కోసం సీ-390 మిలీనియం మల్టీ మిషన్ రవాణా విమానాల కొనుగోళ్లకు సంబంధించిన మీడియం ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) ప్రాజెక్ట్ కోసం ఎంబ్రేయర్ డిఫెన్స్, సెక్యూరిటీ తాజాగా మహీంద్రా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. న్యూఢిల్లీలోని బ్రెజిల్ దౌత్య కార్యాలయంలో ఈ మేరకు ఒప్పందంపై ఇరు సంస్థలు శుక్రవారం సంతకాలు చేశాయి. ఎంటీఏ ప్రాజెక్టులో భాగంగా తయారీ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి దేశీయంగా ఉన్న ఏరోస్పేస్ పరిశ్రమతో ఎంబ్రేయర్, మహీంద్రా సంప్రదింపులు జరుపనుంది. సీ-390 విమానాల విషయంలో భవిష్యత్తు కేంద్రంగా భారత్‌ను మార్చగల సామర్థ్యాన్ని ఇరు సంస్థలు అన్వేషిస్తాయి. 'సీ-390 మిలీనియం మార్కెట్లో అత్యంత అధునాతన మిలిటరీ ఎయిర్‌లిఫ్టర్. ఈ భాగస్వామ్యం ఐఏఎఫ్ కార్యాచరణ నైపుణ్యాన్ని పెంపొందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలతో సజావుగా సరిపోయే సమర్థవంత పారిశ్రామికీకరణ పరిష్కారాన్ని కూడా అందిస్తుందని నమ్ముతున్నాము' అని మహీంద్రా ఏరోస్పేస్, డిఫెన్స్ బిజినెస్ ప్రెసిడెంట్ వినోద్ సహాయ్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా, మీడియం ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) కొనుగోలు ప్రాజెక్టులో భాగంగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) 40 నుంచి 80 విమానాలను కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకోసం భారత్‌కు సాంకేతిక బదిలీతోపాటు తయారీ వ్యవస్థ ఏర్పాటు కానుంది. 18 నుంచి 30 టన్నుల వరకు బరువు మోయగల విమానాలను ఐఏఎఫ్ సేకరించనుంది.

పేటీఎం ఈ-కామర్స్ ఇక పాయ్ ప్లాట్‌ఫామ్స్



న్యూఢిల్లీ: పేటీఎం ఈ-కామర్స్ పేరు పాయ్ ప్లాట్‌ఫామ్స్‌గా మారింది. పేరు మార్పు కోసం మూడు నెలల క్రితం దరఖాస్తు చేసుకోగా ఫిబ్రవరి 8న రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి ఆమోదం లభించిందని సంస్థ శుక్రవారం తెలిపింది. పేటీఎం ఈ-కామర్స్‌లో ఎలివేషన్ క్యాపిటల్‌కు మెజారిటీ వాటా ఉంది. పేటీఎం ఫౌండర్, సీఈవో విజయ్ శేఖర్ శర్మతోపాటు సాఫ్ట్ బ్యాంక్, ఈబే సైతం ఈ కంపెనీలో పెట్టుబడి చేశాయి. అలాగే ఓఎన్‌డీసీ వేదికగా విక్రయాలు సాగిస్తున్న ఇన్నోబిట్స్ సొల్యూషన్స్ (బిట్సిలా) అనే కంపెనీని పేటీఎం ఈ-కామర్స్ కొనుగోలు చేసినట్టు సమాచారం. 2020లో బిట్సిలా కార్యకలాపాలు ప్రారంభించింది. ఓఎన్‌డీసీలో టాప్-3 సెల్లర్ ప్లాట్‌ఫామ్స్‌లో ఒకటిగా నిలిచింది.

నిబంధనలు పాటించడంపై కమిటీ: పేటీఎం అసోసియేట్ పేమెంటు బ్యాంకుపై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో నిబంధనల పాటింపు, నియంత్రణపరమైన వ్యవహారాలపై తగు సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేక అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేటీఎం బ్రాండు మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. దీనికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మాజీ చైర్మన్ ఎం దామోదరన్ నేతృత్వం వహిస్తారని వివరించింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మాజీ ప్రెసిడెంట్ ఎంఎం చితాలే, ఆంధ్రా బ్యాంక్ మాజీ సీఎండీ ఆర్ రామచంద్రన్ ఇందులో సభ్యులుగా ఉంటారని పేర్కొంది.

జనరిక్స్‌పై మెడ్‌ప్లస్...

మరింత ఫోకస్

- సొంత బ్రాండ్ ఔషధాలపై 80 శాతం వరకు డిస్కౌంట్
- 6 నెలల్లో లక్షలాది కస్టమర్లకు దాదాపు రూ. 140 కోట్ల ఆదా
- సంస్థ ఎండీ గంగాడి మధుకర్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధాల రిటైల్ దిగ్గజం మెడ్‌ప్లస్ 'స్టోర్ జనరిక్' కాన్సెప్టుపై మరింతగా దృష్టి పెడుతోంది. అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో ప్రాచుర్యంలో ఉన్న ఈ కాన్సెప్టును దేశీయంగా తాము తొలిసారి ప్రవేశపెట్టినట్లు మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ఎండీ, సీఈవో గంగాడి మధుకర్ రెడ్డి తెలిపారు. దీని కింద తమ స్టోర్స్‌లో నాణ్యమైన సొంత బ్రాండ్ ఔషధాలపై ఉత్పత్తిని బట్టి 50–80 శాతం మేర, సగటున 60 శాతం మేర డిస్కౌంటుకే విక్రయిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇతర బ్రాండ్స్‌తో పోలిస్తే మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ చానల్‌పరమైన వ్యయాల భారం తమకు ఉండని కారణంగా ఇది సాధ్యపడుతోందని మధుకర్ చెప్పారు. తొలుత హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షించిన ఈ మోడల్‌ను క్రమంగా దేశవ్యాప్తంగా అమల్లోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. దీనితో ఏడు రాష్ట్రాల్లో 26.2 లక్షల మంది పైచిలుకు కస్టమర్లకు గడిచిన ఆరు నెలల్లో రూ. 139.7 కోట్ల మేర ఆదా అయిందని ఆయన వివరించారు. దేశీయంగా దాదాపు 800 పైగా ఔషధాలు ఉండగా .. 600 పైగా జనరిక్స్‌ను తాము అందిస్తున్నట్లు మధుకర్ చెప్పారు.

దిగ్గజ సంస్థలతో జట్టు ..

''సాధారణంగా జనరిక్స్ అంటే అంత నాణ్యమైనవి కాకపోవచ్చనే అపోహ ఉంటోంది. అయితే, బ్రాండెడ్, అన్‌బ్రాండెడ్ అనే తేడా లేకుండా పేటెంటు ముగిసిపోయిన ఔషధాన్ని ఎవరు తయారు చేసినా అది జనరిక్ ఔషధమే. కాకపోతే ఎంత నాణ్యతతో తయారు చేస్తున్నారనేది ముఖ్యం. మా వరకు మేము నాణ్యతకు పెద్దపీట వేస్తూ అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మా, విండ్‌లాస్ బయోటెక్ వంటి దేశీయంగా అగ్రగామి ఔషధ తయారీ సంస్థ (సీడీఎంవో)ల దగ్గర జనరిక్స్‌ను తయారు చేయిస్తున్నాం. అధునాతన టెక్నాలజీలతో వాటి నాణ్యతను మేము కూడా స్వయంగా పరీక్షిస్తాం. పలు దిగ్గజ ఫార్మా సంస్థలకు కూడా ఈ సంస్థలు జనరిక్స్ అందిస్తున్నాయి. తమ ఫ్యాక్టరీల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూరోపియన్ యూనియన్ నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తున్నాయి. కాబట్టి నాణ్యత విషయంలో రాజీ ఉండదు. అదే సమయంలో వేల సంఖ్యలో ఉన్న మా స్టోర్స్ ద్వారా విక్రయించడంతో మాకు మార్కెటింగ్పరమైన వ్యయాలు ఉండవు కాబట్టి ఆ మేరకు ప్రయోజనాలను కస్టమర్లకు నేరుగా బదలాయించగలుగుతున్నాం'' అని మధుకర్ వివరించారు. దేశీ ఫార్మా విభాగంలో ఇదొక విప్లవాత్మక మార్పు కాగలదని ఆయన తెలిపారు. మరోవైపు, వైద్య పరీక్షల సేవలనూ గణనీయంగా విస్తరిస్తున్నామన్నారు. మెడ్‌ప్లస్‌కి ప్రస్తుతం పది రాష్ట్రాల్లో 4,200 పైచిలుకు స్టోర్స్‌లో సంఘటిత రిటైల్ ఫార్మసీ పరిశ్రమలో 30 శాతం మార్కెట్ వాటా ఉంది.

హీరో మోటో
డివిడెండ్ రూ. 100

క్యూ3 లాభం రూ. 1,093 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 50 శాతం జంప్‌చేసి రూ. 1,093 కోట్లను తాకింది. వివిధ ప్రాంతాలలో అమ్మకాలు పుంజుకోవడం లాభాలకు దోహదపడింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 726 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,300 కోట్ల నుంచి రూ. 10,031 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 18 శాతం అధికంగా 14.6 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. కంపెనీ చైర్మన్ ఎమెరిటస్ బ్రిజ్ మోహన్ లాల్ ముంజాల్ శత జయంతి సందర్భంగా రూ. 25 ప్రత్యేక డివిడెండుతో కలిపి వాటాదారులకు కంపెనీ బోర్డు మొత్తం షేరుకి రూ. 100 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. రూ. 600 కోట్లు వెచ్చించడం ద్వారా విడిభాగాలు, యాక్సెసరీస్, మెర్కండైజ్ బిజినెస్‌ను విస్తరించే ప్రణాళికల్లో ఉన్నట్లు హీరో మోటోకార్ప్ తాజాగా వెల్లడించింది.



ఫలితాల నేపథ్యంలో హీరో మోటోకార్ప్ షేరు 2 శాతం లాభంతో రూ. 4,909 వద్ద ముగిసింది.


మార్కెట్‌కు బ్యాంకింగ్ షేర్ల దన్ను

సెన్సెక్స్ 167 పాయింట్లు, నిఫ్టీ 65 పాయింట్లు అప్

ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి బ్యాంకింగ్ షేర్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ తదితర స్టాక్స్‌లో కొనుగోళ్ల ఊతంతో శుక్రవారం దేశీ సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 167 పాయింట్లు (0.23 శాతం) లాభపడి 71,595 వద్ద, నిఫ్టీ సుమారు 65 పాయింట్లు లాభంతో (0.30 శాతం) 21,782.50 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 71,676–71,200 శ్రేణిలో తిరుగాడింది. ఆద్యంతం హెచ్చుతగ్గులకు లోనైన మార్కెట్.. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లతో స్వల్పంగా లాభపడిందని విశ్లేషకులు తెలిపారు. మరోవైపు, మెటల్, టెలికం, విద్యుత్ రంగ సంస్థల షేర్లలో అమ్మకాలు జరిగాయి. వేల్యుయేషన్లు భారీగా పెరిగిపోవడంతో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అత్యధికంగా ఒత్తిడికి గురైనట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

52 వారాల గరిష్టానికి జొమాటో.. పేటీఎం మరింత డౌన్..

క్యూ3లో లాభాలు ప్రకటించిన ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో షేర్లు దాదాపు 4 శాతం పెరిగాయి. బీఎస్ఈలో ఒక దశలో 5 శాతం ఎగిసి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 151ని తాకాయి. చివరికి సుమారు 4 శాతం లాభంతో రూ. 149.45 వద్ద క్లోజయ్యాయి. మరోవైపు, పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేర్ల పతనం కొనసాగుతోంది. కంపెనీ షేరు బీఎస్ఈలో మరో 6 శాతం క్షీణించి రూ. 419.85 వద్ద క్లోజయ్యింది. రెండు రోజుల్లో షేరు 15 శాతం మేర పతనమైంది. రూ. 4,871 కోట్ల మార్కెట్ వేల్యుయేషన్ కరిగిపోయింది. నిబంధనల ఉల్లంఘన కారణంగా.. ఫిబ్రవరి 29 నుంచి దాదాపుగా అన్ని కార్యకలాపాలు నిలిపివేయాలంటూ వన్97కి అసోసియేట్ సంస్థ అయిన పేటీఎం పేమెంట్స్ బ్యాంకును ఆర్‌బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే.



మరిన్ని విశేషాలు..

- బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.36 శాతం, మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.82 శాతం క్షీణించాయి. రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 1.97 శాతం, మెటల్ 1.62 శాతం, టెలికమ్యూనికేషన్ 1.45 శాతం, విద్యుత్ 1.10 శాతం మేర తగ్గాయి. బ్యాంకెక్స్, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్ రంగాల షేర్లు లాభపడ్డాయి.
- విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ, ఎఫ్‌పీఐ) నికరంగా రూ. 142 కోట్లు కొనుగోళ్లు చేయగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 422 కోట్ల మేర విక్రయాలు జరిపారు.
- వారంవారీగా చూస్తే సెన్సెక్స్ 490 పాయింట్లు (0.67 శాతం), నిఫ్టీ 71 పాయింట్లు (0.32 శాతం) మేర తగ్గాయి.
- ఆసియా మార్కెట్లలో టోక్యో, షాంఘై లాభాల్లోనూ, హాంకాంగ్ నష్టాల్లోనూ ముగిశాయి. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

విశాఖలో వోల్టాస్ 3వ స్టోర్



హైదరాబాద్: టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ ఏసీ కంపెనీ, వోల్టాస్ విస్తరణ ప్రణాళికలో భాగంగా విశాఖపట్నంలో మూడవ స్టోర్‌ను ప్రారంభించింది. దీనితో రాష్ట్రంలో సంస్థ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ స్టోర్ సంఖ్య 11కు చేరింది. విశాఖ స్టోర్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ప్రదీప్ బక్షి ప్రారంభించారు. వినియోగదారులకు వినూత్న ఉత్పత్తి శ్రేణిని అందించాలన్నది తమ లక్ష్యమని ఈ సందర్భంగా బక్షి పేర్కొన్నారు. కొత్త తరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధునాతన ఫీచర్లతో కూడిన ఉత్పత్తులను సంస్థ అందిస్తోందని తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



మెరిసిన వార్నర్... ఆసీస్‌దే తొలి టి20

వెస్టిండీస్ జట్టుతో శుక్రవారం హోబర్ట్‌లో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 11 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. కెరీర్‌లో 100వ అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన ఆసీస్ డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ (36 బంతుల్లో 70: 12 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. అనంతరం విండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 202 పరుగులు సాధించింది. బ్రాండన్ కింగ్ (37 బంతుల్లో 53: 7 ఫోర్లు, 1 సిక్స్), చార్లెస్ (42: 6 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హోల్డర్ (34 నాటౌట్: 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్‌తో వార్నర్ మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కనీసం 100 మ్యాచ్‌ల చొప్పున ఆడిన మూడో క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో కోహ్లి (భారత్), రాస్ టేలర్ (న్యూజిలాండ్) ఉన్నారు.

నిసాంక 210 నాటౌట్

వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన శ్రీలంక ఓపెనర్

- 139 బంతుల్లో 8 సిక్స్‌లు, 20 బౌండరీలతో ద్విశతకం
- ఈ ఘనత సాధించిన పదో క్రికెటర్‌గా గుర్తింపు
- తొలి వన్డేలో అఫ్గానిస్తాన్‌పై లంక గెలుపు


నిసాంక


పల్లెకెలె: ఓపెనర్ పతుమ్ నిసాంక (139 బంతుల్లో 210 నాటౌట్; 20 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. ఫలితంగా అఫ్గానిస్తాన్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో శ్రీలంక 42 పరుగుల తేడాతో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ముందుగా లంక నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. నిసాంక ప్రత్యర్థి బౌలింగ్‌పై కడదాకా విధ్వంసం కొనసాగించాడు. 88 బంతుల్లో సెంచరీ సాధించిన ఈ ఓపెనర్ ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో తర్వాతి 100 పరుగుల్ని కేవలం 48 బంతుల్లోనే సాధించడంతో 136 బంతుల్లో అతని డబుల్ సెంచరీ పూర్తయ్యింది. ఇప్పటివరకు వన్డేల్లో లంక టాప్ స్కోరర్‌గా నిలిచిన మాజీ ఓపెనర్ సనత్ జయసూర్య (189) ప్రేక్షకుడిగా హాజరైన ఈ మ్యాచ్‌లోనే నిసాంక అతని రికార్డును అతని కళ్లముందే బద్దలు కొట్టడం విశేషం. అవిష్క ఫెర్నాండో (88 బంతుల్లో 88; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో తొలి వికెట్‌కు 182 పరుగులు జోడించిన నిసాంక... సమరవిక్రమ (45; 4 ఫోర్లు, 1 సిక్స్)తో మూడో వికెట్‌కు 120 పరుగులు జత చేశాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 339 పరుగులు చేసి పోరాడి ఓడింది. 27/4 స్కోరు వద్ద కష్టాల్లో పడిన జట్టును అజ్మతుల్లా ఒమర్జాయ్ (115 బంతుల్లో 149 నాటౌట్; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు), మొహమ్మద్ నబీ (130 బంతుల్లో 136; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకాలతో నడిపించారు. ఇద్దరు ఆరో వికెట్‌కు 242 పరుగులు జోడించారు. శ్రీలంక బౌలర్లలో మదుషాన్ 75 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. రేపు ఇదే వేదికపై రెండో వన్డే జరుగుతుంది.

12 ఓవరాల్‌గా అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో నమోదైన డబుల్ సెంచరీల సంఖ్య. ఇందులో సగానికి (7)పైగా బాదింది భారత బ్యాటర్లే! ఒక్క రోహిత్ శర్మే మూడు ద్విశతకాలను సాధించాడు. భారత్ తరఫున సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్ ఈ జాబితాలో ఉన్నారు. మార్టిన్ గప్టిల్ (న్యూజిలాండ్), క్రిస్ గేల్ (వెస్టిండీస్), ఫఖర్ జమాన్ (పాకిస్తాన్), మ్యాక్స్‌వెల్ (ఆస్ట్రేలియా) కూడా వన్డేల్లో డబుల్ సెంచరీలు చేశారు.

3 నిసాంకది వన్డేల్లో మూడో వేగవంతమైన డబుల్ సెంచరీ (138 బంతుల్లో). ఈ జాబితాలో మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో), ఇషాన్ కిషన్ (131 బంతుల్లో) ముందు వరుసలో ఉన్నారు.

అయ్యర్ అనుమానమే!

గాయాలతో సతమతమవుతున్న బ్యాటర్



న్యూఢిల్లీ: రెండో టెస్టులో గెలిచి సిరీస్ సమం చేసిన ఆనందంలో ఉన్న భారత్‌కు ఎదురుదెబ్బ! మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గాయంతో మిగతా మూడు టెస్టులకూ దూరం కావడం ఖాయమైంది. అతను వెన్నెముక, గజ్జల్లో గాయాలతో ఇబ్బంది పడుతున్నాడు. జట్టు ఫిజియో అతని ఫిట్‌నెస్‌పై సందేహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ 'అయ్యర్ తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. సిరీస్‌లో మిగతా మూడు టెస్టుల్లో అతను ఆడే అవకాశాలు లేవు' అని పేర్కొన్నాడు. బోర్డు మెడికల్ టీమ్ 29 ఏళ్ల అయ్యర్ పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిసింది. గతేడాది అతని వెన్నెముకకు శస్త్రచికిత్స చేశారు. అయితే మళ్లీ గాయం తిరగబడటంతో బోర్డు ప్రత్యేక దృష్టి సారించనుంది. ఆడిన తొలి రెండు టెస్టుల్లోనూ అయ్యర్ చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబరచలేకపోయాడు. నాలుగు ఇన్నింగ్స్‌లు ఆడే అవకాశం వచ్చినా... ఒక్క ఫిఫ్టీ కూడా సాధించలేకపోయాడు. వరుసగా 35, 13, 27, 29 స్కోర్లే చేశాడు. ఇప్పటికే అనుభవజ్ఞుడైన కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ముందుగా తొలి రెండు టెస్టుల వరకే అనుకున్నప్పటికీ మొత్తం సిరీస్‌కే దూరం కానున్నట్లు తెలిసింది. తొలి టెస్టు సందర్భంగా సీనియర్లు కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా గాయపడటంతో రెండో టెస్టు నుంచే వాళ్లిద్దరు అందుబాటులో లేకుండాపోయారు. రాజ్‌కోట్‌లో ఈనెల 15న మొదలయ్యే మూడో టెస్టుకు సమయం ఉండటంతో జట్టు ఎంపిక ఆలస్యం అవుతోంది. నేడో, రేపో మిగతా మూడు టెస్టులకు టీమిండియాను ప్రకటించే అవకాశముంది. అనంతరం ఎంపికైన జట్టు 11న రాజ్‌కోట్‌కు చేరుకుంటుంది. స్వల్ప విరామం తీసుకొని అబుదాబిలో సేదతీరుతున్న ఇంగ్లండ్ జట్టు కాస్త ఆలస్యంగా వేదికకు చేరుకుంటుంది.

తన్మయ్, తిలక్ వర్మ సెంచరీలు





హైదరాబాద్ 383/5

సాక్షి, హైదరాబాద్: నాగాలాండ్ జట్టుతో మొదలైన రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ సెమీఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 383 పరుగులు సాధించింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (192 బంతుల్లో 164; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ తిలక్ వర్మ (135 బంతుల్లో 101; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. రోహిత్ రాయుడు (59; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేశాడు. తన్మయ్, రోహిత్ రాయుడు రెండో వికెట్‌కు 143 పరుగులు... తన్మయ్, తిలక్ మూడో వికెట్‌కు 155 పరుగులు జోడించారు. రాహుల్ సింగ్ (5), రవితేజ (15) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ప్రస్తుతం నితేశ్ రెడ్డి (21 బ్యాటింగ్), ప్రజ్ఞయ్ రెడ్డి (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో గెలిస్తే హైదరాబాద్ జట్టు మళ్లీ ఎలైట్ డివిజన్‌కు అర్హత సాధిస్తుంది. మరోవైపు మేఘాలయాతో జరుగుతున్న రెండో సెమీఫైనల్లో మిజోరం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 144 పరుగులకు ఆలౌటైంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి మేఘాలయా 5 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది.

టైటిల్ పోరుకు సాకేత్-రామ్ జోడీ



చెన్నై: కెరీర్‌లో 16వ ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్ సాధించడానికి భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని విజయం దూరంలో నిలిచాడు. చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో సాకేత్–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ పురుషుల డబుల్స్ విభాగంలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ–నిక్కీ పునాచా (భారత్) జంటతో నేడు జరిగే ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ ద్వయం తలపడుతుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో సాకేత్–రామ్‌కుమార్ 6–3, 6–2తో రెండో సీడ్ తొషిహిడె మత్సుయ్–కైటో యుసుగి (జపాన్)లపై నెగ్గగా... రిత్విక్–నిక్కీ పునాచా 6–3, 4–6, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో జేకబ్ ష్నైటర్–మార్క్ వాల్నర్ (జర్మనీ)లను ఓడించారు. 58 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సాకేత్–రామ్ జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

భారత్‌కు తొలి విజయం



భువనేశ్వర్: మహిళల ప్రో లీగ్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు ఎట్టకేలకు గెలుపు బోణీ కొట్టింది. సొంతగడ్డపై ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన భారత మహిళల జట్టు నాలుగో మ్యాచ్‌లో విజయం రుచి చూసింది. అమెరికా జట్టుతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సవితా పూనియా బృందం 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున వందన కటారియా (9వ ని.లో), దీపిక (26వ ని.లో), సలీమా టెటె (56వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. అమెరికా జట్టుకు సేన్ కార్న్స్ (42వ ని.లో) ఏకైక గోల్ అందించింది. భారత జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు, అమెరికా జట్టుకు మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. అయితే రెండు జట్లు ఈ పెనాల్టీ కార్నర్‌లను వృథా చేశాయి. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రో లీగ్‌లో భారత్ మూడు పాయింట్లతో ప్రస్తుతం ఐదో స్థానంలో ఉంది. సోమవారం జరిగే ఐదో మ్యాచ్‌లో చైనాతో భారత్ ఆడుతుంది.

ప్లే ఆఫ్స్‌కు చేరువగా గుజరాత్ జెయింట్స్


కోల్‌కతా: ప్రో కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టు 11వ విజయాన్ని నమోదు చేసింది. తద్వారా ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించేందుకు మరింత చేరువైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 41–32తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. గుజరాత్ తరఫున ప్రతీక్ దహియా 13 పాయింట్లు, రాకేశ్ 11 పాయింట్లు స్కోరు చేశారు. ప్రస్తుతం గుజరాత్ 60 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 50–34తో యూపీ యోధాస్‌ను ఓడించింది. హరియాణా విజయంతో 69 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న దబంగ్ ఢిల్లీకి కూడా ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారైంది.

రాణించిన శశికాంత్, రికీ భుయ్: ఆంధ్ర 236/4



సాక్షి, విజయనగరం: ఉత్తరప్రదేశ్ జట్టుతో శుక్రవారం మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు నిలకడగా ఆడుతోంది. డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 232 పరుగులు సాధించింది. ఆల్‌రౌండర్ కేవీ శశికాంత్ (83 బంతుల్లో 72; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ రికీ భుయ్ (90 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. శశికాంత్ అవుటయ్యాక రికీ భుయ్‌తో కలిసి కరణ్ షిండే (45 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) జట్టును ఆదుకున్నాడు. ఐదో వికెట్‌కు రికీ భుయ్, కరణ్ అభేద్యంగా 116 పరుగుల భాగస్వామ్యం జోడించారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో యశ్ దయాళ్, అంకిత్ రాజ్‌పుత్, ఆకిబ్ ఖాన్, సౌరభ్ కుమార్ ఒక్కో వికెట్ తీశారు.

కుంగుబాటును కనిపెట్టండి ఇలా...



డిప్రెషన్ వచ్చిన వారిలో సహజంగానే మనకు పలు లక్షణాలు కనిపిస్తుంటాయి. వాటిని పసిగట్టడం ద్వారా ఎదుటివారు డిప్రెషన్‌కు గురవుతున్నారని మనకు సులభంగా తెలుస్తుంది. ప్రాథమిక దశలో ఉన్నప్పుడు ఓపికతో, ప్రేమతో తెలివిని ఉపయోగించి మనమే వారు కుంగుబాటులో కూరుకుపోకుండా సులువుగా నయం చేయవచ్చు. తద్వారా వారిని, వారి కుటుంబాన్ని కాపాడవచ్చు. డిప్రెషన్ వచ్చిన వారిలో కనిపించే లక్షణాలు ఏమిటో తెలుసుకుందాం..!

ఉద్యోగులలో పనిభారం పెరిగిపోవడం, వృత్తి, వ్యాపారాలలో ఒడిదొడుకులు, ఆత్మీయులను కోల్పోవడం, ప్రేమ విఫలం కావడం, పరీక్షలలో ఫెయిల్ అవడం, పెళ్లి తప్పిపోవడం వంటి కారణాల వల్ల హార్మోన్లలో అసమతుల్యతలు ఏర్పడతాయి. దాంతో వింతగా... పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. దీనిని ఆరంభంలోనే కనిపెట్టి, అరికట్టగలిగితే చాలా ఉపకారం చేసినట్లే మనం. అది కుటుంబ సభ్యులు కావచ్చు లేదా బంధువులో, మిత్రులో కావచ్చు.

- ఉన్నట్టుండి బరువు పెరుగుతూ పోవడం లేదా తగ్గిపోవడం... ఇందుకు కారణం అదే పనిగా తినడం లేదా అసలు తిండి ధ్యాస లేకుండా పూర్తిగా తగ్గించేస్తారు..
- ఒళ్లు నొప్పులతో బాధపడుతూ నిత్యం ఒళ్లు నొప్పులుగా ఉందని చెబుతూ ఉంటారు.
- దేని మీదా ఆసక్తి చూపక పోవడం... దేనినీ పట్టించుకోకపోవడం, పిలుస్తున్నా వినిపించుకోనట్టు ఉండటం...
- ఆరోగ్యాన్ని పట్టించుకోరు. తమ సొంత శరీరం తమకే భారమైనట్లు ప్రవర్తిస్తారు.
- అనారోగ్య సమస్యలను లెక్క చేయరు.
- విపరీతంగా పొగ తాగడం లేదా మద్యం సేవిస్తూ ఉండటాని బట్టి అవతలి వారు డిప్రెషన్‌తో బాధపడుతున్నారని అర్థం చేసుకోవాలి.
- క్షణక్షణానికి మూడ్ మారుతుంటుంది. ఒక క్షణంలో సంతోషంగా ఉన్నట్లు అనిపిస్తారు. కానీ వెంటనే నిరాశలో కూరుకుపోయినట్లు కనిపిస్తారు. కొండల్ని పిండి చేస్తాననే రీతిలో కబుర్లు చెప్పడం అంతలోనే చప్పబడిపోవడం...
- అన్ని విషయాలను మరిచిపోతుంటారు.
- ఇంటర్నెట్‌ను అధికంగా వాడటం లేదా ఫోన్‌ను వదలకపోవడం...
- సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు విచారకరమైన స్టేటస్ అప్‌డేట్స్ పెడతారు. లేదా ఆ తరహా పోస్టులను షేర్ చేస్తుంటారు.
- ఏ అంశంలోనూ వారు త్వరగా నిర్ణయం తీసుకోరు. వాయిదా వేస్తారు. లేదా నిర్ణయం తీసుకునే శక్తి లేనట్టు ప్రవర్తించడం.
- శరీరం మీద బొత్తిగా ధ్యాస లేకపోవడం లేదా విపరీతంగా శ్రద్ధ చూపడం...
- అంతవరకు ఎంతో ఇష్టంగా చేస్తున్న పనిని ఒక్కసారిగా మానేయడం...

ఇలాంటి లక్షణాలను బట్టి అవతలి వారు డిప్రెషన్‌లో ఉన్నట్లు గ్రహించి వారితో ప్రేమగా మాట్లాడాలి. ఓపిగ్గా నచ్చజెప్పాలి. సంయమనం చూపించాలి. మంచి పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి లేదా వినోదాత్మకమైన సినిమాలు చూపించడం, సరదాగా సంభాషించడం వంటివి చేస్తుండాలి.

కుటుంబ సభ్యులో, బంధు మిత్రులో, సన్నిహితులో ఆరంభంలోనే దీనిని కనిపెట్టగలిగితే దాని నుంచి బయట పడేయడం మనకు సులువు. ఒకసారి దీని బారిన పడ్డారా, ఇక దీర్ఘకాలం పాటు మందులు వాడుతూ ఉండాల్సిందే. దాని వల్ల ఇతర విధాలైన సైడ్ ఎఫెక్టులు తప్పవు. అందువల్ల మీ చుట్టుపక్కల వారు, సన్నిహితులు, సహోద్యోగులలలో ఎవరైనా పైన చెప్పిన లక్షణాలతో బాధపడుతుంటే గుర్తించి వారు కుంగుబాటు నుంచి తొందరగా బయట పడేందుకు సాయం చేయండి.

కొవ్వు పదార్థాలు తింటే బరువు పెరుగుతారా?



మనకు తినేందుకు అనేక రకాల కొవ్వు పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. అయితే అన్ని రకాల కొవ్వు పదార్థాలు చెడువి కావు. అంటే.. మన ఆరోగ్యానికి ఉపయోగపడే కొవ్వు పదార్థాలు కూడా ఉన్నాయి. మనకు మంచి చేసే కొవ్వు పదార్థాల గురించి తెలుసుకుందాం.

మన శరీరంలో రెండు రకాల కొలెస్ట్రాల్స్ ఉంటాయి. ఒకదాన్ని మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) అంటారు. రెండో దాన్ని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) అంటారు. మంచి కొలెస్ట్రాల్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అందువల్ల మంచి కొలెస్ట్రాల్‌ను పెంచే ఆహారాలను తీసుకోవాలి. అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉండే ఆహారాలు అదే కోవకు చెందుతాయి. వీటివల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఈ ఫ్యాట్స్ లో మళ్లీ రెండు రకాలు ఉన్నాయి. ఈ రెండూ ఆరోగ్యకరమైనవే. ఒకటి మోనో అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్. ఇవి ఆలివ్ ఆయిల్, అవకాడో, బ్రెజిల్ నట్స్, బాదంపప్పు, కనోలా ఆయిల్, పల్లీలు (వేరుశెనగ) వంటి వాటిల్లో ఉంటాయి. ఇక రెండోవి.. పాలీ అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్. ఇవి పొద్దు తిరుగుడు విత్తనాలు, నూనె, మొక్కజొన్న, సోయాబీన్, చేపలు, వాల్ నట్స్, అవిసె గింజలు వంటి వాటిల్లో ఉంటాయి. అయితే ఈ రెండు రకాల ఫ్యాట్స్ మనకు ఆరోగ్యకరమే. ఇప్పుడు చెప్పిన ఆహారాలను తరచూ తింటుంటే మన శరీరానికి ఆయా ఫ్యాట్స్ అందుతాయి. దీంతో శరీరంలో మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

శాచురేటెడ్ ఫ్యాట్స్

ఇవి ఎక్కువగా జంతు సంబంధ పదార్థాలలో ఉంటాయి. కొన్ని వృక్ష సంబంధ పదార్థాల్లోనూ ఉంటాయి. అయితే వీటిని పూర్తిగా అనారోగ్యకరమైన కొవ్వులు అనలేం. ఎందుకంటే వీటిని తక్కువ మోతాదులో తీసుకుంటే మనకు ప్రయోజనమే. అలాగని మోతాదుకు మించకూడదు మరి. మాంసం, చికెన్, పాలు, కోడిగుడ్డులోని పచ్చసొన, పాల ఉత్పత్తులు, కొబ్బరినూనె, తల్లిపాలు వంటి పదార్థాల్లో ఈ ఫ్యాట్స్ ఉంటాయి. అయితే ఈ ఫ్యాట్స్ శరీరంలో మంచి, చెడు కొలెస్ట్రాల్‌లను రెండింటినీ పెంచేందుకు అవకాశం ఉంటుంది. అలా జరిగితే పెద్దగా ప్రయోజనం ఉండదు. కనుక వీటిని తక్కువ మోతాదులో తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది. ఎక్కువైతే చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది.

ట్రాన్స్ ఫ్యాట్స్

వీటిని అస్సలు తీసుకోరాదు. ఎందుకంటే వీటిని తినడం వల్ల మన శరీరానికి ఏమాత్రం ప్రయోజనం ఉండదు సరికదా. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ విపరీతంగా పెరుగుతుంది. అన్నిరకాల జంక్ ఫుడ్, చిరు తిళ్లు, నూనె పదార్థాలు, వేపుళ్లు వంటి పదార్థాలలో ఈ ఫ్యాట్స్ ఉంటాయి. కనుక ఆయా పదార్థాలకు దూరంగా ఉంటే మంచిది. దీంతో శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకు పోకుండా ఉంటుంది.

ఇప్పుడు తెలుసుకున్నారు కదా. కొవ్వులన్నీ అనారోగ్యకరమైనవి కావని. వాటిల్లో ఆరోగ్యకరమైనవి కూడా ఉంటాయనీ. వాటిని తీసుకుంటేనే మనకు ప్రయోజనాలు కలుగుతాయి. కనుక ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలని తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలం.

ఎక్కువసేపు కూర్చునే ఉంటున్నారా?



'అబ్బా... ఈ వెన్నునొప్పితో తట్టుకోలేక పోతున్నానురా బాబోయ్...' అంటూ అరిచేవారిని మనం చాలాసార్లు చూసి ఉంటాం. ఎక్కువసేపు కూర్చొని పనిచేయడం వల్ల తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. అందులోనూ కుర్చీపై సరైన పొజిషన్‌లో కూర్చోకపోతే ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో తెలుసుకుందాం..

కుర్చీలో కూర్చుని పని చేయడం చాలా మంది గొప్ప అనుకుంటారు. అయితే కూర్చున్న కుర్చీ వెన్నెముకకు సపోర్టుగా లేకుంటే... సరిగా కూర్చోకపోతే అది మీ వెన్నెముకపై ప్రభావం చూపిస్తుంది. ఫలితంగా వెన్నునొప్పి మొదలవుతుంది. ఈ నొప్పి మెడ నుంచి మొదలై తోక ఎముక వరకు వెళుతుంది.

ఊబకాయం

ఒకే భంగిమలో ఎక్కువసేపు కుర్చీపై కూర్చుని ఎటువంటి కదలికలు లేకుండా గంటలు.. గంటలు అలా పని చేసుకుంటూ పోతే.. శరీరంలోని దిగువ భాగం పెరగడం ప్రారంభమవుతుంది. అదనపు కొవ్వు అంతా నడుము, పిరుదులలో పేరుకు పోతుంది.

ఏకాగ్రత లేకపోవడం

గంటల తరబడి కుర్చీలో కూర్చుని పని చేయడం ఏకాగ్రతను దెబ్బ తీస్తుంది. ఎందుకంటే అసౌకర్యంగా కూర్చోవడం వల్ల వ్యక్తి దృష్టి పదేపదే ఒకే చోటికి వెళుతుంది. కాబట్టి వీపు, చేయి సౌకర్యంగా ఉండేలా కుర్చీపై కూర్చోవాలి.

భుజం నొప్పి

కుర్చీపై కూర్చొని కంప్యూటర్‌లో పని చేసే వ్యక్తులు కీబోర్డ్‌పై నిరంతరం వేళ్లను కదిలిస్తుంటారు. దాంతో చేతుల నుంచి భుజాల వరకు నొప్పి మొదలవుతుంది.

రక్త ప్రసరణ తగ్గడంతో..

గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల రక్త ప్రసరణ దెబ్బతింటుంది. ముఖ్యంగా భుజం, పొట్ట, నడుము భాగాల్లో రక్తప్రసరణ సరిగా జరగకపోవడం వల్ల శరీరంలో జలదరింపు లేదా తిమ్మిరి వంటి సమస్యలు తలెత్తుతాయి.

దీంతోపాటు అలసట, నీరసం, నిస్సత్తువ ఆవహిస్తాయి. అంతేకాకుండా జీర్ణసమస్యలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. సరైన పొజిషన్‌లో కూర్చోకపోవడం వల్ల యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి. మన ఉద్యోగం లేదా వృత్తి కూర్చుని పని చేసేదే అయి ఉంటే తప్పదు కానీ, అప్పుడప్పుడు లేచి తిరుగుతూ ఉండటం, సౌకర్యంగా కూర్చోవడం అవసరం.

సినిమా

ఆస్కార్‌లో కొత్త అవార్డు



ఆస్కార్ అవార్డుల్లో ఓ కొత్త కేటగిరీ చేరనుంది. ప్రస్తుతం 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. కొత్తగా క్యాస్టింగ్ డైరెక్టర్స్‌కు ఓ కేటగిరీని చేర్చినట్లు అకాడమీ వెల్లడించింది. దీంతో ఆస్కార్ అవార్డుల విభాగాల సంఖ్య 24కు చేరనుంది. కానీ ఈ ఏడాది మార్చి 10న జరగనున్న 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో కానీ, 2025లో జరిగే 97వ ఆస్కార్ అవార్డ్స్‌లో కానీ 'క్యాస్టింగ్ డైరెక్టర్స్' విభాగంలో అవార్డును ప్రదానం చేయరు. 2026లో జరిగే 98వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఈ విభాగంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. అంటే.. 2025లో రిలీజయ్యే సినిమాలకు క్యాస్టింగ్ డైరెక్టర్స్ 98వ ఆస్కార్ అవార్డ్స్ కోసం నామినేట్ అవుతారు. ''ఫిల్మ్ మేకింగ్ విభాగంలో, ఆస్కార్ ప్రదానోత్సవంలో క్యాస్టింగ్ డైరెక్టర్స్ ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ఇప్పుడు వారిని ఈ ప్రదానోత్సవంలో భాగం చేయడం గర్వంగా ఉంది'' అన్నారు ఆస్కార్ అకాడమీ అధ్యక్షుడు జానెట్ యంగ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ బిల్ క్రామెర్. ''క్యాస్టింగ్ డైరెక్టర్స్ ఆస్కార్ అవార్డు' అనేది మా కృషికి గుర్తింపుగా భావిస్తున్నాం. ఆస్కార్ అకాడమీకి థ్యాంక్స్'' అని క్యాస్టింగ్ డైరెక్టర్ బ్రాంచ్ గవర్నర్‌లు రిచర్డ్ హిక్స్, కిమ్ టేలర్-కోల్‌మన్, డెబ్రా జేన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉంటే దాదాపు 20 ఏళ్ల తర్వాత ఆస్కార్ అవార్డ్స్‌కు సంబంధించి ఓ కేటగిరీని చేర్చారని, చివరిసారిగా 2001లో బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్‌ను చేర్చారని హాలీవుడ్‌లో కథనాలు వస్తున్నాయి.

వ్యూహం ఫిక్స్



● అజ్మల్

'వ్యూహం' సినిమా విడుదలకు రూట్ క్లియర్ అయింది. ఈ నెల 23న ఈ సినిమా విడుదల కానుంది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం గత ఏడాది నవంబరు 10న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా ఈ సినిమాను విడుదల చేసుకోవచ్చని సెన్సార్ బోర్డు క్లియరెన్స్ ఇవ్వడంతో ఈ నెల 23న రిలీజ్ చేస్తున్నట్లు రామ్‌గోపాల్ వర్మ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం తర్వాత రాజకీయ పార్టీలు ఎలాంటి వ్యూహాలు పన్నాయి? ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? వంటి కథాంశంతో 'వ్యూహం' రూపొందింది. ఈ చిత్రంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో అజ్మల్ నటించారు.

యాత్ర 2 చాలామందికి నచ్చింది - మహి వి. రాఘవ్



''యాత్ర 2' సినిమా కొందరికి నచ్చింది.. కొందరికి నచ్చలేదు. ఇది పొలిటికల్ మూవీ. రాజకీయ నాయకుడిపై తీశాం కాబట్టి భిన్నాభిప్రాయాలు రావడం సహజం. కానీ ఓ స్టోరీ టెల్లర్‌గా నేను అనుకున్న కథను తీశాను. చాలామందికి నా సినిమా నచ్చింది'' అని దర్శకుడు మహి వి. రాఘవ్ అన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో వచ్చిన 'యాత్ర' (2019) కి కొనసాగింపుగా రూపొందిన చిత్రం 'యాత్ర 2'. వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించగా, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా, వైఎస్ భారతీ రెడ్డి పాత్రలో కేతకీ నారాయణ్ నటించారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం సక్సెస్ మీట్‌లో మహి వి. రాఘవ్ మాట్లాడుతూ– ''యాత్ర 2 తీయాలని 2019లోనే నిర్ణయించుకున్నాను. తండ్రీ కొడుకుల (వైఎస్ఆర్, వైఎస్ జగన్) కథ చెప్పాలనుకున్నాను.. ఆ కథకు తగ్గట్టుగానే పాత్రలను పెట్టాను. 'యాత్ర 2'పై కొందరు పాజిటివ్, మరికొందరు నెగెటివ్ రివ్యూలు ఇచ్చారు. ఫిల్మ్ మేకర్లుగా సినిమా తీయడం మా బాధ్యత. విమర్శలను పట్టించుకోను. నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల సన్నివేశం తీశాను.. కానీ ఎడిటింగ్‌లో తీసేశాను. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారు 'యాత్ర 2' చూడలేదు.. త్వరలో చూస్తారు. త్వరలో నా నుంచి 'సేవ్ ది టైగర్స్ 2' వెబ్ సిరీస్ రాబోతోంది'' అన్నారు.

సొగసరీ... స్వాగతం



● దీపికా పదుకోన్ ● జాన్వీ కపూర్ ● మాళవికా మోహనన్ ● మానుషీ చిల్లర్ ● శ్రీనిధీ శెట్టి

ప్రతీ ఏడాదీ తెలుగు తెరపై కొత్త తారలు మెరుస్తుంటారు. ఈ ఏడాది కూడా కొందరు సొగసరులు టాలీవుడ్‌కి పరిచయమవుతున్నారు. కొందరు ఇప్పటికే వేరే భాషల్లో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళ్లి, తెలుగు తెరకు కొత్త తారగా పరిచయం అవుతున్నారు. ఇంకొందరు వేరే భాషల్లో ఇప్పుడిప్పుడే పైకొస్తూ తెలుగుకి వస్తున్నారు. 'సొగసరీ... స్వాగతం' అంటూ వీరి రాక కోసం తెలుగు తెర వేచి చూస్తోంది.

మోస్ట్ వాంటెడ్

హిందీలో పదిహేనేళ్లకు పైగా ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో భాగమయ్యారు దీపికా పదుకోన్. కానీ తెలుగులో స్ట్రయిట్ మూవీ చేయలేదు. 'కల్కి 2898 ఏడీ' చిత్రం దీపికాను తెలుగుకు ఆహ్వానించింది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో దీపికా పదుకోన్ హీరోయిన్. ఇక 'హెలెన్', 'కప్పేలా' వంటి మలయాళ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న అన్నా బెన్ కూడా 'కల్కి 28 98ఏడీ'తోనే తెలుగుకు ఎంట్రీ ఇస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న రిలీజ్ కానుంది.

స్వాగతం బంగారం

దివంగత ప్రముఖ తార శ్రీదేవికి ఇటు దక్షిణాదిన అటు ఉత్తరాదిన బోలెడంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె వారసురాలిగా ముందు ఆమె పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ ఎంట్రీని తెలుగు ఫ్యాన్స్ ఎప్పట్నుంచో ఆశిస్తున్నారు. 'దేవర' సినిమాతో అది నెరవేరుతోంది. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర'లో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో జాన్వీ పాత్ర పేరు తంగమ్ (బంగారం). కొరటాల శివ దర్శకత్వంలో కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అలాగే రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలోనూ జాన్వీ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారని సమాచారం.

ఈసారి నో డౌట్

హీరోయిన్ మాళవిక ఎంట్రీ టాలీవుడ్‌లో ఎప్పుడో జరగాల్సింది. విజయ్ దేవరకొండ, మాళవికా మోహనన్ జంటగా ఓ సినిమా ప్రారంభమై, అది క్యాన్సిల్ అయ్యింది. ఈ బ్యూటీ ఇప్పుడు 'రాజా సాబ్' సినిమాతో హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది.

బచ్చన్‌కు జోడీగా..

హిందీ చిత్రం 'యారియా 2'లో ఓ చిన్న పాత్ర చేసి పెద్ద పేరు తెచ్చుకున్నారు భాగ్య శ్రీ బోర్సె. ఈ పుణే మోడల్ 'మిస్టర్ బచ్చన్'తో తెలుగుకు పరిచయం కానున్నారు. హీరో రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకుడు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు భాగ్య శ్రీ బోర్సె. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'మిస్టర్ బచ్చన్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానున్నట్లుగా తెలిసింది.

ప్రపంచ సుందరి కూడా...

2017లో మిస్ వరల్డ్‌గా నిలిచిన బాలీవుడ్ బ్యూటీ మానుషీ చిల్లర్ కూడా తెలుగు తెరపై కనిపించనున్నారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన 'ఆపరేషన్ వాలెంటైన్' మానుషీకి తెలుగులో తొలి చిత్రం. వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఈ సినిమాకు శక్తీ ప్రతాప్ సింగ్ దర్శకుడు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మార్చి 1న రిలీజ్ కానుంది. ఇది వరుణ్ తేజ్‌కు హిందీలో తొలి చిత్రం కావడం విశేషం. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ పతాకాలపై సందీప్ ముద్దా ఈ సినిమాను నిర్మించారు.

నాట్యం టు నటన

నాట్య కళాకారిణి ప్రీతీ ముకుందన్ 'కన్నప్ప' సినిమాతో తెలుగు తెరపై నటిగా కనిపించనున్నారు. విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'కన్నప్ప'. శివభక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా ముఖేష్ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ప్రీతీ ముకుందన్‌ను తీసుకున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్మెంట్స్‌లపై విష్ణు మంచు నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది రిలీజ్ కానుంది.

బుజ్జి కన్నా.. వస్తున్నా...

తెలుగు ప్రేక్షకులకు 'బుట్ట బొమ్మ' అంటే పూజా హెగ్డే, 'బేబమ్మ' అంటే కృతీశెట్టి గుర్తొస్తారు. అలాగే 'బుజ్జి కన్నా' అంటే మలయాళ బ్యూటీ ఇవానా గుర్తొస్తారు. తమిళ హిట్ 'లవ్ టుడే'లో హీరోయిన్ ఇవానా 'బుజ్జి కన్నా..' అంటూ ప్రేమికుడిపై కురిపించిన ప్రేమ అందర్నీ ఆకట్టుకుంది. 'లవ్ టుడే' చిత్రం తెలుగులో అనువాదమై బంపర్ హిట్‌గా నిలిచింది. దీంతో తెలుగులో ఇవానాకు చాన్స్‌లు దక్కాయి. అలా స్ట్రెయిట్ ఫిల్మ్ 'సెల్ఫిష్'తో 'బుజ్జికన్నా.. వస్తున్నా!' అంటూ తెలుగు కుర్రాళ్ల మనసులను మరో మారు గెలిచేందుకు వస్తున్నారు ఇవానా. ఇందులో ఆశిష్ హీరోగా నటిస్తున్నారు. విశాల్ కాశీ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి 'దిల్' రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.


తెలుసు కదా...

యశ్ 'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో కన్నడలో, విక్రమ్ 'కోబ్రా'తో తమిళంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు మంగళూరు బ్యూటీ శ్రీనిధీ శెట్టి. ఈ యంగ్ బ్యూటీ 'తెలుసు కదా' అంటూ తెలుగులో స్ట్రెయిట్ సినిమా చేస్తున్నారు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో హీరోయిన్. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

డాటర్ ఆఫ్ జానీ లీవర్

బాలీవుడ్ ప్రముఖ హాస్య నటుడు జానీ లీవర్ కుమార్తె జెమీ లీవర్ హీరోయిన్‌గా తెలుగు పరిశ్రమకు వస్తున్నారు. 'హౌస్‌ఫుల్ 4', 'భూత్ పోలీస్' వంటి హిందీ సినిమాల్లో మెరిసిన జెమీ లీవర్ 'ఆ ఒక్కటీ అడక్కు' అనే తెలుగు సినిమా చేస్తున్నారు. రామ్ అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ''నా మాతృభాష తెలుగులో సినిమా చేస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఓ విధంగా మా గ్రాండ్ మదర్‌కు నేను ఇస్తున్న ఓ నివాళిగా ఈ సినిమాను భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు జెమీ. ఇక బాలీవుడ్ సినిమాల్లో పాపులర్ అయిన జానీ లీవర్ స్వస్థలం కనిగిరి అనే విషయం తెలిసిందే.

ఈ ఏడాది ఇంకెంత మంది కొత్త సొగసరులకు తెలుగు పరిశ్రమ స్వాగతం పలుకుతుందో చూడాలి.



● భాగ్యశ్రీ బోర్సె ● ప్రీతీ ముకుందన్ ● ఇవానా ● జెమీ లీవర్